PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 77 | విజయవాడ, శనివారం19 అక్టోబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Saturday 19 October 2024 | Rs

విద్యుత్ భారాలపై జనాగ్రహం
- ట్రూఅప్ ఛార్జీలు మోపొద్దంటూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

6

రోహిత్, కోహ్లి, సర్ఫరాజ్ అర్ధసెంచరీలు

- భారత్ 231/3
- న్యూజిలాండ్‌తో తొలిటెస్ట్

8

అన్నదాత సుఖీభవ
ఈ ఏడాది లేనట్లే!

• వచ్చే బడ్జెట్‌లోనే నిధులు • రానున్న ఖరీఫ్‌కే • రైతులకు రూ.20 వేలు అప్పడే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

టిడిపి కూటమి ప్రభుత్వం రైతులకు అందిస్తామన్న 'అన్నదాత సుఖీభవ' ఆర్థిక సాయం ఈ ఏడాది లేనట్లేనని సమాచారం. సూపర్ సిక్స్, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసేందుకు రచించిన ప్రణాళికలో భాగంగా రైతులకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో సాయం అందించనున్నట్లు తెలిసింది. 2024-25 పూర్తి స్థాయి బడ్జెట్‌ను నవంబర్‌లో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం చేస్తున్న కసరత్తులో 'అన్నదాత' పథకాన్ని వచ్చే ఏడాదికి వాయిదా వేయాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, విద్యార్థుల ఫీజులకు 'తల్లికి వందనం', నిరుద్యోగ భృతి వంటి హామీల అమలుపై దృష్టి పెట్టిన ప్రభుత్వం, రైతులకు ఆర్థిక సాయం అందించే అన్నదాత సుఖీభవను మాత్రం రెండవ ఏడాదికి వాయిదా వేశారనే వార్తలు రైతుల్లో, కౌలు రైతుల్లో గుబులు రేపుతోంది. భారీ వర్షాలు, వరదలు, కరువు వలన ఖరీఫ్ సజావుగా సాగలేదు. లక్షల ఎకరాల్లో వేసిన పంటలు చేతికి రాలేదు. వరదల్లో పంటలు నష్టపోయిన రైతుల్లో కొందరికే ఇన్‌పుట్ సబ్సిడీ అందింది. బీమా పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఈ ఆపద కాలంలో ప్రభుత్వం ఇస్తామని హామీ ఇచ్చిన 'అన్నదాత' సాయం ఎప్పుడెప్పుడా అని రైతాంగం ఎదురు ఎదురు చూస్తునానరు. ఈ తరుణంలో సహాయం ఇప్పుడు కాదు, వచ్చే సంవత్సరమని సర్కారు నుంచి అందుతున్న సంకేతాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి.

ఖరీఫ్ ముగిసింది

రైతులకు, కౌలు రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి హామీ ఇచ్చింది. అంతకుముందు టిడిపి ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీల్లో ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించింది. వైసిపి సర్కారు 'వైఎస్‌ఆర్ రైతు భరోసా' పేరిట స్కీంను అమలు చేయగా కూటమి ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' అని పేరు పెట్టింది. కాగా ఇప్పటి వరకు దీనిపై విధి విధానాలు ఖరారు చేయలేదు. వైసిపి రైతు భరోసా వలే కేంద్ర ప్రభుత్వ పథకం పిఎం కిసాన్‌తో కలిపి అమలు చేస్తారా, విడిగానా అనే మీమాంశ నెలకొంది. విధి విధానాలు నిర్ణయిస్తేకాని స్పష్టత రాదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఖరీఫ్ సీజన్ ముగిసినా 'అన్నదాత' సాయంపై ప్రభుత్వంలో కదలిక లేదు. రబీలోనైనా ఇస్తారా, జనవరి ఫస్ట్‌కా, సంక్రాంతికా అని రైతులు ఆశగా చూస్తున్నారు. ఇప్పుడే కాదని, అసలు ఈ ఆర్థిక సంవత్సరంలో ఉండదని, ప్రాధాన్యతాక్రమంలో పథకాలు అమలు చేయాలని నిర్ణయించారని, ఆ మేరకు వచ్చే ఖరీఫ్‌కు ముందు పథకాన్ని ప్రారంభించే అవకాశం ఉందని చెబుతుతున్నారు. అదే జరిగితే ఒక ఏడాది సాయం రూ.20 వేలను రైతులు, కౌలు రైతులు కోల్పోతారు.

పిఎం కిసాన్‌కు కోతలు

కేంద్ర పథకం పిఎం కిసాన్ కింద కిస్తుకు రూ.2 వేల వంతున ఈ సంవత్సరం రెండు కిస్తులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో వేశారు. ఏప్రిల్-జులై కిస్తును జూన్ 18న విడుదల చేశారు. ఆగస్టు-నవంబర్ కిస్తును అక్టోబర్ 5న జమ చేశారు. రాష్ట్రం నుంచి ఈ ఏడాది తొలి కిస్తుకు 41,77,423 మందిని అర్హులుగా నిర్ణయించగా 41,22,252 మంది ఖాతాల్లో సొమ్ము జమ అయింది. రెండో కిస్తుకు 41,73,950 మందిని అర్హులుగా నిర్ణయించగా 41,22,252 మందికి డబ్బులు పడ్డాయి. గత వైసిపి సర్కారు పిఎం కిసాన్‌తో కలిపి భరోసా రూ.13,500 మూడు విడతల్లో అమలు చేసింది. ఆ సొమ్ములో కేంద్రానిది ఆరు వేలు కాగా రాష్ట్రానిది 7,500. రాష్ట్రంలో 76 లక్షల మంది సొంత భూమి కలిగిన రైతులు, కౌలు రైతులు 8-10 లక్షల మంది ఉన్నారని ప్రభుత్వ లెక్కలే చెబుతు న్నాయి. కౌలు రైతులకు కేంద్రం 'పిఎం కిసాన్' ఇవ్వలేదు. సొంత భూమి కలిగిన వారిలో కూడా పలు నిబంధనలతో ఏటా కోతలు విధించింది. దాంతో లబ్ధిదారుల సంఖ్య 41 లక్షలకు తగ్గిపోయింది. పిఎం కిసాన్ రెండు విడతలు పడ్డా రాష్ట్రంలో కూటమి సర్కారు చేస్తామన్న సాయం రూపాయి కూడా రైతులకు పడలేదు.

రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలి
- తీర్మానాన్ని ఆమోదించిన జమ్మూకాశ్మీర్ కేబినెట్
- తొలి సమావేశంలో నిర్ణయం

7

ఆరుద్ర... నిబద్ధతగల కవి
- శతజయంతి సభలో సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి
- ఏడాదంతా సాహిత్య కార్యక్రమాలు : ఎంవిఎస్ శర్మ

2

కుక్క, పాము కాట్ల చికిత్సకు హెల్ప్‌లైన్
- వైద్యారోగ్యశాఖ స్పెషల్ సిఎస్ ఎంటి కృష్ణబాబు

3

గుర్లలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చికిత్సపొందుతున్న బాధితులు

ఆందోళనకరంగానే డయేరియా

ఎనిమిదికి చేరిన మృతుల సంఖ్య

నమోదవుతున్న కొత్త కేసులు

అదుపులోకి రాకపోగా కొత్త మండలాలకు విస్తరణ

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

వారం రోజుల క్రితం విజయనగరం జిల్లా గుర్ల మండల కేంద్రంతోపాటు ఆ చుట్టుపక్కల గ్రామాల్లో ప్రబలిన డయేరియా ఇప్పటికీ అదుపులోకి రాలేదు. మరణాలు కొనసాగుతున్నాయి. ఈ మండలానికి ఆనుకుని ఉన్న మండలాల్లోనూ కేసులు నమోదవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా గుర్ల మండల కేంద్రంలో బాధితులు ఎక్కువమంది ఉన్నారు. డయేరియాతో ఆ గ్రామంలో ఈ నెల 13న ఒకరు, 15న నలుగురు మృతి చెందారు. గుర్ల గ్రామానికి చెందిన బోడసింగి రాములమ్మ (65), అదే మండలంలోని కోట గండ్రేడుకు చెందిన అప్పల నరసయ్యమ్మ (56) గురువారం మృత్యువాత పడ్డారు. శుక్రవారం పతివాడ సూరమ్మ (65) మరణించారు. దీంతో, మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. దయేరియా ప్రబలడానికి కలుషిత నీరు, అపారిశుధ్యం కారణమని గ్రామస్తులు అంటున్నారు. గుర్ల, దాని చుట్టుపక్కల గ్రామాల్లో ఇప్పటి వరకు మొత్తం 198 డయేరియా కేసులు నమోదయ్యాయి. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ప్రస్తుతం 17 మంది, చీపురుపల్లి సిహెచ్‌సిలో 13 మంది, నెల్లిమర్ల మిమ్స్‌లో ఒకరు, విజయనగరంలోని కేంద్రాస్పత్రిలో ఎనిమిది మంది, విశాఖ కెజిహెచ్‌లో ఒకరు చికిత్స పొందుతున్నారు. ఈ నెల 15 నుంచి గ్రామంలో అధికారులు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో చికిత్స పొంది డిశ్చార్జి అయ్యాక ఇంటి వద్ద రాములమ్మ, సూరమ్మ మృతి చెందారు. వారికి పూర్తి స్థాయిలో చికిత్స అందకపోవడమే ఇందుకు కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రాములమ్మ వృద్ధాప్యంతో మృతి చెందినట్టు డిఎం అండ్ హెచ్‌ఒ ఎస్.భాస్కరరావు ప్రకటన జారీ మిగతా 2లో

ఏజెన్సీలో పెసా నిబంధనలు అమలు చేయాలి

- మద్యం దుకాణాలు స్థానిక ఆదివాసీలకు కేటాయించాలి
- ముఖ్యమంత్రికి వి శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏజెన్సీ ఏరియాలో మద్యం దుకాణ లబ్ధిదారుల ఎంపిక విషయంలో పెసా చట్టం నిబంధనలను ఉల్లంఘించారని, ఏజెన్సీ చట్టాలను ప్రభుత్వం గౌరవించలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. వెంటనే పెసా చట్టాన్ని అమలు చేయడంతోపాటు, అక్కడ మద్యం దుకాణాలు గిరిజనులకే కేటాయించాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఆయన రాసిన లేఖను మీడియాకు శుక్రవారం విడుదల చేశారు. జిఓ నెంబరు 372 ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మద్యం దుకాణాల టెండర్ నోటిఫికేషన్ 2024 నుండి 2026 వరకూ ఇచ్చిందని, దీనిపై డైరెక్టర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ వారు ఉత్తర్వులు జారీచేశారని తెలిపారు. మద్యం రాష్ట్ర ప్రభుత్వ నోటిఫికేషన్‌ను అనుసరించి గిరిజనేతరులు, స్థానికేతర గిరిజనులు దరఖాస్తులు చేసుకున్నారని వివరించారు. గిరిజనేతరులు సిండికేట్లుగా ఏర్పడి తెలంగాణ రాష్ట్రం సరిహద్దు జిల్లాల నుండి షాపులు దక్కించుకున్నారని, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 40 దుకాణాలకు గాను సుమారు 2,200 మంది దరఖాస్తులు చేసుకున్నారని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పెసా గ్రామసభకు లోబడి మద్యం దుకాణాలు నిర్వహించాలని ఏ.పి.పెసా రూల్స్ 2011 రూల్ నెం.4,8-(1) క్లాజ్ -3 (2) సెక్షన్‌లో పేర్కొన్నారని వివరించారు. 1996 పెసా చట్టం సెక్షన్ 4(ఎ)(బి)(డి)(ఇ)(ఎం-1) చట్టం ప్రకారం ఏజెన్సీ గ్రామాల్లో ఆదివాసీల ఆచారాలు, సంస్కృతి, సాంప్రదాయాలు, సామాజిక న్యాయం మతపరమైన పద్ధతులు, సామాజిక వనరుల నిర్వహణ, పరిరక్షణ, సాంప్రదాయ పద్ధతుల్లో వివాదాలు పరిష్కరించుకోవడానికి, అధికారాలను అమలు చేసుకోవడంతో పాటు లబ్ధిదారులను ఎంపిక చేసే అధికారం, మద్యం దుకాణాలకు అనుమతులు ఇవ్వడం, రద్దు చేయడంలో అంతిమ అధికారాలు పెసా చట్టం ప్రకారం గ్రామసభకు మాత్రమే ఉందని వివరించారు. ఈ విషయంలో పెసా గ్రామసభ ఆమోదం, తీర్మానం అత్యంత కీలకమైందని, మిగతా 2లో

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

ప్రజాశక్తి- పిచ్చాటూరు

పిడుగుపాటుకు ఇద్దరు వ్యవసాయ కార్మికులు మృతి చెందారు. తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలంలో శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... హనుమంత పురం గ్రామానికి చెందిన దామోదరం పొలంలో వ్యవసాయ కార్మికులు మణి (54), సుబ్రహ్మణ్యం (50) పనిచేస్తున్నారు. ఆ సమయంలో వారి సమీపంలో పిడుగులు పడడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో, ఆ రెండు కుటుంబాలూ పెద్ద దిక్కును కోల్పోయాయి. మణికి భార్య, ముగ్గురు కుమార్తెలు, సుబ్రహ్మణ్యానికి భార్య, కుమార్తె భార్య ఉన్నారు. ఇద్దరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పిల్లలను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదని కుటుంబ సభ్యుల వేదన అందరినీ కంట తడిపెట్టించింది

పోలీస్ సంక్షేమానికి ప్రాధాన్యత : డిజిపి

2

మోడీపై మళ్లీ ప్రశంసలు

- ప్రధాని నుండి చాలా నేర్చుకోవాలన్న బాబు
- 2029 ఎన్నికల్లోనూ ఈ కూటమితోనే
- ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధాని నరేంద్రమోడీపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మళ్లీ ప్రశంసల వర్షం కురిపించారు. ఆయన నుండి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని అన్నారు. ఇటీవలే ఢిల్లీ పర్యటన తరువాత విలేకరుల సమావేశం పెట్టి మరీ ప్రధానిపై బాబు పొగడ్తల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే. తాజాగా శుక్రవారం నిర్వహించిన టిడిపి ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలోనూ చంద్రబాబు అదే ధోరణి కొనసాగించారు. 'హర్యానా సిఎం ప్రమాణ స్వీకారం తరువాత చండీగఢ్‌లో ఎన్‌డిఎ సమావేశం నిర్వహించారు. ప్రధాని మోడీ ఆ సమావేశంలో 5 గంటల పాటు కూర్చున్నారు. ఆయన అంతసేపు అక్కడ కూర్చోవాల్సిన అవసరం లేదు. కానీ వచ్చే ఎన్నికలకు ఆయన ఇప్పటి నుండే సిద్ధమవుతున్నారు. మోడీ నుండి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. పట్టుదల, కృషి వల్లే మూడోసారి ఆయన ప్రధాని అయ్యారు. ఆరుసార్లు గుజరాత్‌లో బిజెపిని గెలిపించారు. మూడోసారి హర్యానాలో విజయం సాధించారు' అని బాబు అన్నారు. ప్రధాని మోడీ ఏం చేసినా ప్రజలను దృష్టిలో ఉంచుకునే చేశారని చెప్పారు. 'దేశంలో ఎవరికీ దక్కని విజయం మోడీకి దక్కిందంటే, దాని వెనుక ఆయన కఠోర శ్రమ, క్రమశిక్షణ ఉంది' అని బాబు అన్నారు. గత ఐదు సంవత్సరాలో వైసిపి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని చెప్పారు. తనను జైల్లో పెడితే పవన్ కల్యాణ్ వచ్చి పరామర్శించి, కలిసి పోటీ చేస్తున్నట్లుగా బహిరంగంగా ప్రకటించారని గుర్తు చేసుకున్నారు. 2029లో జరిగే ఎన్నికల్లోనూ ఇప్పటి కూటమితోనే కలిసి వెడతామని ప్రకటించారు. వైసిపి పాలనలో అన్ని తరగతుల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. తప్పు చేసిన వాళ్లను చట్టబద్ధంగా శిక్షిద్దామని, అంతేకానీ ఇష్టం వచ్చినట్లు అరెస్టులు జరగాలంటే కుదరదని, అది తన విధానం కూడా కాదని చెప్పారు.

వాటి విషయంలో జోక్యం వద్దు

ఇసుక, మద్యం విషయంలో ఎవరూ జోక్యం చేసుకోవద్దని బాబు చెప్పారు. ఇసుక విధానం సక్రమంగా అమలు కాకపోతే అధికారులను కూడా బాధ్యులను చేస్తానని స్పష్టం చేసినట్లు తెలిపారు. ఒకరిద్దరు కోసం ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తే ఎందుకు సహించాలని చంద్రబాబు మిగతా 7లో



సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

రాష్ట్రంలో ఇసుక, మద్యం మాఫియా పాలన

- జగన్‌మోహన్‌రెడ్డి విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఇసుక, మద్యం మాఫియా పాలన చేస్తోందని, డిబిటి స్థానంలో డిపిటి (దోచుకో, పంచుకో, తినుకో) పద్ధతిని అమలు చేస్తున్నారని వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన ప్రభుత్వంలో కేంద్రంలోని బిజెపి అండ చూసుకుని రెచ్చిపోతోందని విమర్శించారు. ఏమి చేసినా అడిగేవారు లేరన్నట్లు వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఓటాన్ ఎకౌంట్‌పై సుదీర్ఘకాలం నడుస్తున్న ఏకైక ప్రభుత్వం ఎపిలోనే ఉందని అన్నారు.

తల్లికి వందనం, మహిళలకు భరోసా వంటి డిబిటి పథకాలేవీ ఇప్పటి వరకూ అమలు చేయలేదని చెప్పారు. విజయవాడ వరద సాయంలోనూ అక్రమాలకు పాల్పడ్డారని, ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ఇవిఎంలపై పోరాటం కొనసాగుతూనే ఉంటుందని చెప్పారు. నియోజకవర్గంలో మైనింగ్ చేసుకున్నా, పరిశ్రమ పెట్టినా కప్పం కట్టనిదే ఏ పనీచేయలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఒక పద్ధతి ప్రకారం తప్పుడు హామీలతో ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టారని, గెలిచిన తరువాత హామీలను పట్టించుకోకుండా పక్కనబెట్టేశారని అన్నారు. లిక్కర్ పాలసీ అంటూ బాబు ప్రభుత్వం మరో దోపిడీకి పక్కా స్కెచ్ వేసిందన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో వైన్‌షాపులు రద్దుచేసి తనవారికే మద్యం షాపులు దక్కేలా రెండు రోజుల్లోనే టెండర్లు ముగించేశారని తెలిపారు. చంద్రబాబు తెచ్చిన బ్రాండ్లనే వైసిపి ప్రభుత్వంలో అమ్మామని, టిడిపి, జనసేన ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా అవే బ్రాండ్లు అమ్ముతున్నారని చెప్పారు. లిక్కర్ డిస్ట్రిబ్యూషన్‌పై పూర్తి కంట్రోల్ తీసుకున్నారని, ఇక పర్మిట్ రూములు, బెల్టుషాపులు ప్రారంభం అవడమే తరువాయని చెప్పారు. సిఎం, ఎమ్మెల్యేలు మాఫియా పంపకాలు మొదలైందని అన్నారు. ఇసుక విషయంలో ఈ ప్రభుత్వం అడ్డగోలుగా గతంలో దేశంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా రెండురోజుల్లో టెండర్లు ముగించి ఇష్టారాజ్యంగా చేసుకుపోయిందని అన్నారు. 141 నియోజకవర్గాల్లో లారీ ఇసుక ధర రూ.20 వేలకుపైగా ఉందని, ఇంకొన్ని నియోజకవర్గాల్లో లారీ ఇసుక ధర ఏకంగా రూ.60 వేలు ఉందని తెలిపారు. 53 నియోజవకర్గాల్లో సగటున రూ.30వేలకుపైగా ఉందని వివరించారు. స్కిల్ స్కాములో చంద్రబాబు 13 చోట్ల సంతకాలు చేసి అక్రమాలకు పాల్పడితే ఆ కేసు తాలూకూ ఆస్తులను ఇడి అటాచ్ చేస్తే ఆయనకు క్లీన్ చిట్ ఇచ్చారని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

ఇసుక విధానంలో మార్పులు

- స్థానిక అవసరాలకు ట్రాక్టర్లలో ఉచితం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇసుక విధానంలో రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసింది. ఇసుకరీచ్‌ల నుంచి స్థానిక అవసరాలకు ట్రాక్టర్లలో ఉచితంగా ఇసుక తీసుకెళ్లేందుకు తాజాగా అనుమతినిచ్చింది. ఈ మేరకు గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ట్రాక్టర్లలోనూ ఇసుకను ఉచితంగా తరలించే అవకాశాన్ని కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఎడ్ల బండికి మాత్రమే ఉచితంగా ఇసుక తరలింపునకు అనుమతి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణ పనులకు ఇసుక కొరత లేకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మీనా పేర్కొన్నారు. స్థానిక అవసరాలకు సమీపంలోని వాగుల నుంచి ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చని, అవసరమైన వారు ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లలోనూ రవాణా చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

తనిఖీలు నిర్వహిస్తున్న సిసిబి అధికారులు.. పట్టుబడిన డ్రగ్స్ బిళ్లలు

బెంగళూరు పోస్టాఫీస్‌లో డ్రగ్స్ కలకలం

- రూ.21 కోట్ల విలువైన సరుకు స్వాధీనం

బెంగళూరు : కర్ణాటకలోని ఒక ప్రధాన పోస్టు ఆఫీస్‌లో భారీగా డ్రగ్స్ పట్టుబడడం తీవ్ర కలకలం రేపింది. వివిధ పార్శిళ్ల రూపంలో పలు రకాల డ్రగ్స్‌ను చేరవేస్తుండటం నార్కోటిక్ అధికారులను విస్తుపోయేలా చేసింది. సంబంధిత అధికారులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం..విదేశాలకు పార్శిళ్ళను చేరవేసేందుకు ఉద్దేశించిన బెంగళూరు నగరంలోని ఫారిన్ పోస్ట్ ఆఫీస్‌లో ప్రత్యేక జాగిలాల ద్వారా కస్టమ్స్ అధికారుల సహకారంతో సిసిబి అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భారీ మొత్తంలో డ్రగ్స్ బయటపడ్డాయి. దాదాపు రూ.21 కోట్ల విలువైన పలు రకాల డ్రగ్స్‌ను వివిధ పరిమాణాల్లో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అమెరికా, బెల్జియం, బ్రిటన్, థాయ్‌లాండ్, నెదర్లాండ్స్ వంటి దేశాల నుంచి అక్రమంగా రవాణా చేస్తున్నట్లుగా గుర్తించారు. 606 డ్రగ్స్ పార్శిళ్లను పోస్టు ఆఫీస్ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌లో హైడ్రో గంజాయి, ఎల్ఎస్‌డి, ఎండిఎంఎ క్రిస్టల్స్ తదితర మత్తు పదార్థాలు ఉన్నాయని తెలిపారు. వీటిని బెంగళూరులో అధిక ధరలకు విక్రయించేందుకు దిగుమతి చేసుకున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. అయితే ఇంత పెద్ద మొత్తంలో పోస్టు ఆఫీసు సేవల ద్వారా డ్రగ్స్ సరఫరా అవుతుండటంపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, తపాల శాఖ అధికారుల ప్రమేయంపైనా ఆరా తీస్తున్నామని సిసిబి అధికారులు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను తిప్పికొడతాం

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు జరుగుతున్న కుట్రలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1345వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో డిఇఎస్‌యు, టిఎన్‌టియుసి నాయకులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు శ్రీనివాసరావు, రామ్మోహన్‌రావు మాట్లాడారు. 50 ఏళ్లు దాటిన అందరినీ వైద్య పరీక్షలకు పంపించాలని యాజమాన్యం కుట్రలు చేస్తోందని, వాటిని అడ్డుకుంటామని తెలిపారు. ఏదో ఒకసాకుతో ఉద్యోగులను తొలగించేందుకు కుట్రలు చేస్తోందన్నారు. అలాంటి ప్రయత్నాలను విడనాడి ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సొంత గనులు, వర్కింగ్ కేపిటల్ కేటాయించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

23న మంత్రివర్గ సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 23న ఉదయం 11 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరగనుంది. ఈ మేరకు సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రివర్గ సమావేశం నేపథ్యంలో హెచ్‌ఒడిలు ఈ నెల 21న సాయంత్రం 4 గంటల్లోగా ఆయా శాఖల హెచ్‌ఒడిలు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని కోరారు. వారం తిరగక మునుపే మంత్రివర్గ సమావేశం ఏర్పాటువెనుక గత సమావేశంలో తీసుకున్న 6 పాలసీల సత్వర అమలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసమేనని సమాచారం.

నైపుణ్యాభివృద్ధికి ఇదే సరైన సమయం : సీడాప్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధిని పెంచుకోవడానికి ఇదే సరైన సమయమని సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) ఛైర్మన్ గుణపాటి దీపక్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రానికి వచ్చే పారిశ్రామికవేత్తల అవసరాలను తీర్చే విధంగా శిక్షణ ఇస్తామన్నారు. శుక్రవారం సీడాప్ కార్యాలయంలో స్కిల్ కౌన్సిల్, అగ్రికల్చర్, ఏవియేషన్, ఏరోస్పేస్, అపెరల్, టెక్స్‌టైల్ రంగాల సిఇఒలతో జరిగిన వర్క్‌షాపులో దీపక్‌రెడ్డి మాట్లాడారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన అమలులో రాష్ట్రం.. దేశంలోనే అగ్రస్థానంలో ఉందని సీడాప్ సిఇఒ ఎంకెవి శ్రీనివాసులు పేర్కొన్నారు.

నవంబర్ 28 నుంచి పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు: టిటిడి

ప్రజాశక్తి - తిరుమల

నవంబరు 28 నుంచి డిసెంబర్ ఆరు వరకు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు టిటిడి జెఇఒ వీరబ్రహ్మం తెలిపారు. అందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అధికారులతో కలిసి అమ్మవారి ఆలయం, పుష్కరిణి, మాడవీధులు తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ... బ్రహ్మోత్సవాలలో చివరిరోజైన పంచమి తీర్థం నాడు వాహనాల పార్కింగ్ కోసం పూడి రోడ్డు, రేణిగుంట, మార్కెట్ యార్డ్ ప్రాంతాల్లో స్థలాలను సిద్ధం చేయాలన్నారు. పుష్కరిణిలోకి వెళ్లేందుకు, తిరిగి వెలుపలికి వచ్చేందుకు తగిన విధంగా గేట్లు ఏర్పాటు చేయాలని, తమిళంలో సైన్ బోర్డులు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. టిటిడి సివిఎస్ఒ శ్రీధర్, సిఇ సత్యనారాయణ, ఎస్ఇ జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో పెసా నిబంధనలు అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

చట్టవిరుద్ధంగా ఏజెన్సీ ఏరియాలో అమలు చేస్తున్న మద్యం షాపులు వేలం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెసా గ్రామసభకు మద్యం దుకాణాలు వినియోగం, అనుమతి విషయంలో సెక్షన్ 3 క్లాజ్-1, సెక్షన్ 8 క్లాజ్ -1 ప్రకారం ప్రత్యేకమైందని, అంతిమమైందని వివరించారు. పెసా చట్టం సెక్షన్ 4 క్లాజ్-డి, ఎన్ ప్రకారం గ్రామసభకు శాసనపరమైన స్వయంపాలన అధికారం ఉందని తెలిపారు. ఏజెన్సీ పరిధిలో సెక్షన్ 8 క్లాజ్-11 ప్రకారం మద్యం దుకాణాల లైసెన్సులను స్థానిక గ్రామసభ పరిధిలో స్థానిక గిరిజనులకు మాత్రమే మంజూరు చేయాలని, సెక్షన్ 3 క్లాజ్-11 ను అనుసరించి ఏజెన్సీ గ్రామ ఆచారాలు, సంస్కృతి, సాంప్రదాయాలు, కట్టుబాట్లు ప్రకారం మద్యం దుకాణాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేసి గ్రామసభ పరిధిలోనే లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. అర్హత కలిగిన దరఖాస్తుదారులను గ్రామసభకు తెలియపర్చడంతో పాటు మద్యం దుకాణాల విషయంలో గిరిజనులకు లైసెన్స్ గ్రామసభ పరిధిల్లోనే ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్‌కు తగిన ఆదేశాలు జారీచేయాలని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలా ? వద్దా ? అనే అంశాన్ని కూడా పెసా గ్రామసభ లో చేతులు ఎత్తడం ద్వారా, మెజార్టీ ప్రకారం నిర్ణయించి, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రూఅప్ విధానాన్ని రద్దు చేయాలి

- సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజాభిప్రాయ సేకరణలో ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్న సిహెచ్ బాబూరావు

ప్రజలపై మోయలేని భారానికి కారణమవుతున్న ట్రూఅప్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. రెండున్నర దశాబ్దాలకుపైగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యుత్ సంస్కరణల వల్ల ప్రయోజనం శూన్యమని స్పష్టమైందని పేర్కొన్నారు. డిస్కంల ప్రతిపాదనలపై ఎపిఇఆర్‌సి శుక్రవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో విజయవాడ నుంచి ఆన్‌లైన్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికీ డిస్కంలు నష్టాల్లోనుంచి బయటపడకపోవడంతో ఎపిఇఆర్‌సి నిబంధనలతో సహా సంస్కరణలను పున:సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని అధికార పక్షం స్పష్టంగా హామీ ఇచ్చినందున డిస్కంలు ప్రతిపాదనల్లో పేర్కొన్న రూ.8,114 కోట్లను ప్రభుత్వమే భరించాలని కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేసి, ప్రభుత్వానికి లేఖ రాయాలని విజ్ఞప్తి చేశారు. మూడు డిస్కమ్‌ల పరిధిలో నాలుగు త్రైమాసికాలకు సంబంధించి సగటున యూనిట్‌కు రూ.1.27 భారం పడుతుందని తెలిపారు. గృహ వినియోగదారులపై రూ.2,194 కోట్లు, పరిశ్రమలపై రూ.2,748 కోట్లు భారం పడనున్నట్లు తెలిపారు. 30 యూనిట్లు లోపు వినియోగించే నిరుపేదలపై 67 శాతం, 30 నుంచి 70 యూనిట్ల మధ్య వినియోగించే వారిపై 42 శాతం ట్రూఅప్ ఛార్జీలతో విద్యుత్ బిల్లుల మొత్తం పెరగనుందన్నారు. ఇప్పటికే వివిధ కారణాల వల్ల ఒక్కో యూనిట్‌పై రూ.1.03 ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి అదనంగా మరోమారు రూ.1.27 భారం వేయడం ప్రజలను నమ్మించి మోసం చేయడమేనన్నారు. ఈ విధంగా భారం మోపితే ఉన్న పరిశ్రమలను కోలుకోలేని దెబ్బతీస్తుందన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ఈ భారంతో తమకు సంబంధం లేదని గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల అని చెప్పడాన్ని తప్పుబట్టారు. గత ప్రభుత్వ నిర్ణయాలు సక్రమంగా లేకపోతే వాటిని సరిదిద్దాలని, అయినప్పటికీ డిస్కంలకు లోటు ఉంటే దానిని ప్రభుత్వమే భరించాలి తప్ప ఇచ్చిన హామీలకు విరుద్ధంగా విద్యుత్ భారం ప్రజలపై వేయకూడదన్నారు. ప్రజలు అడగనప్పటికీ రూ.99లకే మద్యం ఇస్తున్నారని, విద్యుత్‌ను చౌకగా ఇవ్వాలని అడుగుతున్నా అందుకు మాత్రం సుముఖంగా లేరని అన్నారు. గత పాలకుల పాపాలను ఎఫ్‌పిపిసిఎల రూపంలో ఎపిఇఆర్‌సితో ఆమోదింపజేస్తున్నారని చెప్పారు. సిఎం ఇటీవల విడుదల చేసిన శ్వేతపత్రంలో 17,137 కోట్ల ట్రూఅప్ భారం పడబోతుందని ప్రకటించారని తెలిపారు. ట్రూ అప్ నిబంధనలను ప్రజల్ని తప్పుదోవ పట్టించడానికి ప్రభుత్వాలు వాడుకుంటున్నాయన్నారు. ఈ భారానికి కారణమేమిటని విచారించాలి, గత పాలకుల తప్పులు ఉంటే వారినే బాధ్యుల్ని చేయాలన్నారు. 2022 ఏప్రిల్‌లో జరపాల్సిన ఎఫ్‌పిపిసిఎపై విచారణపై జాప్యానికి కారణమేమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యుత్ మిగులు ఉన్నా రూ.6 వేల కోట్ల వ్యయంతో 8,094 మిలియన్ యూనిట్లు షార్ట్‌టర్మ్ పర్చేజ్ ఎందుకు చేయాల్సి వచ్చిందన్నారు. సరైన అంచనాలు ఎందుకు వేయలేకపోతున్నారని ప్రశ్నించారు. మిగులు విద్యుత్‌ను ఎంత ధరకు అమ్ముతున్నారనేది వెల్లడించాలన్నారు. వ్యవసాయ రంగానికి వాడుతున్న విద్యుత్‌కు ట్రూఅప్ ఛార్జీలను ప్రభుత్వం డిస్కంలకు చెల్లిస్తే రూ.12,681 కోట్లు బకాయిలు ఎందుకు ఉన్నాయనే విషయాన్ని స్పష్టం చేయాలన్నారు. డిస్కంలకు ప్రభుత్వ శాఖలు, ఇతర సంస్థలు, తెలంగాణా ప్రభుత్వం నుంచి రావాల్సిన మొత్తం రూ.51,092 కోట్లు ఈ మొత్తం ఎప్పటికి వసూలు చేస్తారన్నారు. బూడిద అమ్ముకుని కోట్లు సంపాదించుకుంటూ బూడిద రవాణాకు రూ.252 కోట్లు ప్రతిపాదించారని పేర్కొన్నారు. ఇంటర్‌స్టేట్ ట్రాన్స్‌మిషన్ ఛార్జీలను 49 శాతం పెంచి రూ.130 కోట్ల భారం వేశారన్నారు. సెకి నుంచి విద్యుత్ యూనిట్ రూ.2.49 అని చెప్పి, ఇతర ఛార్జీలతో కలిపి రూ.6.02 చేశారన్నారు. సెకీ ఒప్పందాల వల్ల 25 ఏళ్లలో 62 వేల కోట్ల అదనపు భారం పడుతుందని చెప్పారు. వ్యవసాయానికి రూ.7 వేల కోట్ల వ్యయంతో మీటర్లు బిగిస్తున్నారని దీని వల్ల వినియోగదారులపై లేనిపోని భారం పడుతుందన్నారు. హిందుజా సంస్థకు ఎపిఇఆర్‌సి ఆమోదం లేకుండా రూ.1,234 కోట్లు చెల్లిస్తున్నారని, సుప్రీంకోర్టు ఆదేశించిందని తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. ఇది పూర్తిగా అక్రమమేన్నారు. ఇన్ని లోటుపాట్లు ఉన్న డిస్కమ్‌ల ప్రతిపాదనలు ఆమోదించవద్దని డిమాండ్ చేశారు.

విద్యుత్ ఛార్జీల నుంచి విముక్తి కల్పించాలి

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ ఛార్జీల పెంపు, ట్రూఅప్ విధింపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వంటి విద్యుత్ పెనుభారాలను విరమించుకుని విద్యుత్ ఛార్జీల బాదుడు నుండి ప్రజలకు విముక్తి కలిగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానించింది. ఆ సమావేశం శుక్రవారం విజయవాడలోని దాసరి భవన్లో జరిగింది. దీనికి హాజరైన సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ జాతీయ రాజకీయాలు, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై వివరించారు. అనంతరం సమావేశం విద్యుత్ సంస్కరణలపై తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను వైసిపి ప్రభుత్వం వేగవంతం చేసి రూ.50 వేలకోట్ల భారం మోపిందని తెలిపారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం ద్వారా అదనంగా మరో రూ.17 వేల కోట్ల భారాన్ని మోపేందుకు సిద్ధమైందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం కూడా విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపడాన్ని ఖండించారు. ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.8,114 కోట్ల పెనుభారాలు మోపేందుకు విద్యుత్ సంస్థలు సిద్ధమవడం విచారకరమని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ సంస్థలు హిందూజా సంస్థకు రూ.1,234 కోట్లు చెల్లించి ఆ భారాన్ని కూడా ట్రూఅప్ ప్రతిపాదనలో కలపడం దుర్మార్గమన్నారు. పెరిగిన ఛార్జీలను ఎత్తివేయాలని, ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

కందిపప్పు సరఫరాదారులపై మంత్రి నాదెండ్ల అసహనం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సబ్సిడీపై కందిపప్పు సరఫరా చేయాలనే ప్రభుత్వ నిర్ణయానికి సరఫరాదారులు సహకరించకపోవడంపై పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అసహనం వ్యక్తం చేశారు. విజయవాడలోని సివిల్ సప్లయిస్ భవన్‌లో కందిపప్పు సరఫరాదారులు, వంట నూనెల దిగుమతిదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. టెండర్లలో పేర్కొన్న విధంగా పూర్తి స్థాయిలో కందిపప్పు సరఫరా చేయాలని, అదే సమయంలో నాణ్యత లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరఫరాలో జాప్యానికి సరఫరాదారులు చెప్పిన కారణాలను మంత్రి తోసిపుచ్చారు. సబ్సిడీపై వంట నూనెల సరఫరాను పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచిన నేపథ్యంలో వంట నూనెల ధరలు పెరిగే అవకాశం ఉందని తెలుస్తున్న నేపథ్యంలో సామాన్య ప్రజలపై భారం వీలైనంత తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దిగుమతిదారులు జాప్యం లేకుండా నూనెలను సరఫరా లేయాలని సూచించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాలశాఖ కమిషనరు వీరపాండ్యన్, ఎమ్‌డి మనజీర్ జిలాని పాల్గొన్నారు.

ఆరుద్ర... నిబద్ధతగల కవి

- శతజయంతి సభలో సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి
- ఏడాదంతా సాహిత్య కార్యక్రమాలు : ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి - విజయవాడ

శతజయంతి సభలో మాట్లాడుతున్న తెలకపల్లి రవి

సాహిత్యరంగంలో నిబద్ధత గల కవి ఆరుద్ర అని... చరిత్రను సాహిత్యానికి ఎలా అన్వయించాలో తెలిసిన ప్రతిభావంతులని సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు, సాహిత్య ప్రస్థానం ప్రధాన సంపాదకులు తెలకపల్లి రవి అన్నారు. ఆరుద్ర శతజయంతి సభ విజయవాడ బాలోత్సవ భవన్‌లో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. సభను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్యరంజన్ ప్రారంభించారు. ప్రధాన వక్తగా హాజరైన తెలకపల్లి రవి మాట్లాడుతూ... కృత్రిమమైన చింతలో పుట్టిన కవికి చింతే ఉంటుందన్నారు. సామ్యవాద భావుకుడిగా సాహిత్య లోకంలో ఆరుద్ర చెరగని ముద్ర వేశారన్నారు. కొత్త ప్రతీకలు తీసుకుని మార్క్సిస్ట్ దృక్పథంలో చూశారన్నారు. ప్రతిభ, ప్రయోగశీలత కలిగిన కవి ఆరుద్ర అని అన్నారు. మొదటి కావ్యంతోనే అభ్యుదయ కాంక్ష కనబడుతుందన్నారు. ఫాసిజం, నాజీయిజానికి వ్యతిరేకంగా జాతీయోద్యమం, సామ్యవాద ప్రభావంతో 1935-36లో అరసం ఏర్పడిందని, అయితే ప్రస్తుత ఆధునిక కాలానికనుగుణంగా ఆరుద్ర లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని ఈనాటి ఫాసిస్టులకు వ్యతిరేకంగా సమాజాన్ని మేల్కొలపడానికి, సాహిత్యాభివృద్ధికి విశాల ఐక్యతతో ప్రత్యామ్నాయ భావజాలం కోసం కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం సమాజంలో రాజ్యమేలుతున్న ఛాందసవాద, మనువాద విష సంస్కృతికి వ్యతిరేకంగా విశాల ఐక్యత ద్వారా ప్రత్యామ్నాయ భావాజాలాన్ని తీసుకురావాల్సిన కర్తవ్యం సాహితీ వేత్తలు, మేధావులు, లౌకిక, ప్రజాస్వామిక, అభ్యుదయవాదులపై ఉందన్నారు. గడియారంలో గంటల ముల్లును పెట్టుబడిదారుడిగా, నిమిషాల ముల్లును మధ్యతరగతివారిగా, సెకన్ల ముల్లును ఆహోరాత్రులు శ్రమించే శ్రమ జీవిగా అన్వయించి సాహిత్యంలో చొప్పించారని గుర్తుచేశారు. ఆరుద్ర జీవితం నిబద్ధత, నిపుణత, నిరాడంబరతతో మేళవించి ఉంటుందన్నారు. చివరి వరకు ఎంతో విలక్షణ మార్గంలో నడిచారన్నారు.

ఆధునికాంధ్ర సాహిత్యంతోపాటు జానపద సాహిత్యాభివృద్ధికీ ఎంతో కృషి చేశారని కొనియాడారు. సాహిత్యాంశాలపై 'ప్రజాశక్తి'తోనూ ఆయన సాన్నిహిత్యంగా వ్యవహరించారని తెలిపారు. ఆయన కలం నుంచి జాలువారిన కూనలమ్మ పదాలు అత్యంత జనాదరణ పొందాయన్నారు. రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ మాట్లాడుతూ.. శాస్త్రీయ సామ్యవాద సిద్ధాంతాల వెలుగులో పరిశీలించి, కొత్త విషయాలను గుర్తించి, ఒకనాటి సనాతన ధర్మం ఏమిటో అర్థం చేసుకోవాలని ఆరుద్ర ఏనాడో చెప్పారన్నారు. కాలం ఒక తేలని ప్రశ్న, కాలం ఒక తీరని తృష్ణ అని గొప్ప కవిత్వాన్ని సృష్టించారని వివరించారు. సినీ కవిగా దాదాపు వేల పాటలు రాశారన్నారు.

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ.. ఆరుద్ర సాహిత్యంపై సంవత్సరం పాటు వివిధ సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పాలకులే ఈ సమాజాన్ని పక్కదారి పట్టిస్తున్న సమయంలో భావాల ద్వారా ప్రతిఘటించాల్సిన అవసరం కవులపై ఉందన్నారు. దేశం సంక్లిష్ట స్థితిలో ఉన్న నేపథ్యంలో కవులపాత్ర శక్తివంతంగా ఉండాలన్నారు. ఈ సభలో రాష్ట్ర మాజీ అధ్యక్షులు వొరప్రసాద్, సాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ, గోళ్ల నారాయణ రావు, శాంతిశ్రీ, జాషువా విజ్ఞానకేంద్రం బాధ్యులు గుండు నారాయణ, పిఎస్‌బిహెచ్.లక్ష్మయ్య, కవి వైష్ణవి శ్రీ, కెఎక్స్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పాల సేకరణ ధర తగ్గించిన విశాఖ డెయిరీ

- విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పాడి రైతుల ఆందోళన
- 29న డెయిరీ వద్ద నిరసన

ప్రజాశక్తి - జామి, సీతానగరం

జామి మండలంలో నిరసన తెలుపుతున్న పాడి రైతులు, నాయకులు

విశాఖ డెయిరీ పాల సేకరణ ధరను తగ్గించడాన్ని నిరసిస్తూ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పాడిరైతులు ఆందోళన చేపట్టారు. లీటరు ఆవుపాలు రూ.34, గేదె పాలు రూ.39.50 ఉండగా ఈ ధరలపై రూ.మూడు తగ్గించడంతో ఎపి పాడి రైతుల సంఘం, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం కాశీపేట బల్క్‌మిల్క్ సెంటర్ వద్ద రాస్తారోకో చేపట్టారు. పాచిపెంట పాల కేంద్రం వద్ద నిరసన తెలిపారు. రైతులతో సంప్రదించకుండా ఏకపక్షంగా సేకరణ ధర తగ్గించడం సరికాదని, దాణా ఖర్చులతో పోలిస్తే ప్రస్తుత ధర గిట్టుబాటు కావడం లేదని, తక్షణమే ప్రస్తుత ధర కన్నా లీటర్‌కు రూ.పది పెంచాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ధర తగ్గింపును నిరసిస్తూ ఈ నెల 29న విశాఖ డెయిరీ వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు.

విజయనగరం జిల్లా జామి మండల కేంద్రం సీతారామ కల్యాణ మండపంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు అధ్యక్షతన పాడిరైతుల జిల్లా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎపి పాడి రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. అజయ్ కుమార్ మాట్లాడుతూ...సహకార రంగంలో ఉండవలసిన డెయిరీలన్నీ కంపెనీ యాక్ట్‌లోకి వెళ్లడంతో పాడి రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. సహకారం రంగంతోనే పాడి రైతులకు మంచి జరుగుతుందని చెప్పారు. కేరళ, తమిళనాడు తరహా మన రాష్ట్రంలో లీటరు పాలకు పది రూపాయలు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీ లీటర్‌కు మూడు రూపాయలు తగ్గించి రైతులను నట్టేట ముంచే పరిస్థితి తీసుకొచ్చిందని, ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో కల్తీ పాలు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు మాట్లాడుతూ.. పాల సేకరణ ధర తగ్గింపునకు నిరసనగా ఈనెల 29న విశాఖ డెయిరీ వద్ద జరిగే ఆందోళనలో పాడి రైతులంతా పాల్గొనాలని కోరారు. అంతకుముందు తహశీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో చేపట్టారు.

ఎల్‌ఒసి రద్దు చేయండి : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి

పోలీసులు తనపై లుకౌట్ సర్క్యులర్ (ఎల్‌ఒసి) ఇవ్వడాన్ని వైసిపి సజ్జల రామకృష్ణారెడ్డి హైకోర్టులో సవాల్ చేశారు. లుకౌట్ సర్క్యులర్‌ను రద్దు చేస్తూ తీర్పు చెప్పాలని, ఈ పిటిషన్‌పై తుది తీర్పు వచ్చే వరకు లుకౌట్ సర్క్యులర్ అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. టిడిపి ఆఫీసుపై దాడి కేసులో ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దన్న హైకోర్టు ఈ నెల 4న ఆదేశించిన తర్వాత ఈ నెల 10న తనపై పోలీసులు ఎల్‌ఒసి జారీ చేయడం కోర్టు ధిక్కారం అవుతుందన్నారు. ఎల్‌ఒసిని రికార్డుల నుంచి తొలగింపునకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు ఈ నెల 21న విచారణ చేసే అవకాశముంది.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మల్లికార్జునరావు, రామరాజు, కొండలరావు తదితరులు

అమరావతి బాలోత్సవం ఆధ్వర్యాన నవంబర్ 15 నుండి 7వ పిల్లల పండుగ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

'అమరావతి బాలోత్సవం' ఆధ్వర్యాన నవంబర్ 15, 16 17 తేదీల్లో విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో 7వ పిల్లల పండుగ నిర్వహించనున్నట్లు బాలోత్సవం గౌరవాధ్యక్షులు చలవాది మల్లికార్జునరావు తెలిపారు. విజయవాడ గవర్నరుపేటలోని బాలోత్సవ భవన్లో శుక్రవారం '7వ పిల్లల పండుగ' పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అధ్యక్షులు ఎస్‌పి రామరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్ కొండలరావుతో కలసి మల్లికార్జునరావు మాట్లాడారు. "ప్రగతికి మార్గం - సైన్స్ విజ్ఞానం"పై సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో 43 అకడమిక్, 18 కల్చరల్ అంశాల్లో పోటీలు నిర్వహించన్నుట్లు తెలిపారు. మొత్తం 61 అంశాల్లో జరిగే ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, రెండు కన్సోలేషన్ బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పిల్లల పండుగలో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ సర్టిఫికెట్, ప్రతి పాఠశాలకు మెమొంటో ఇవ్వనున్నట్లు తెలిపారు. మూడ్రోజులపాటు జరిగే పిల్లల పండుగలో 200 పాఠశాలల నుండి పదివేలమంది విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లూ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల మానసిక వికాసానికి, సర్వతోముఖాభివద్ధికి 2017 నుండి 'పిల్లల పండుగ'ను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో బాలోత్సవం ఆఫీస్ బేరర్లు గుమ్మా సాంబశివరావు, ఎన్ విద్యాకన్నా, వై.సుబ్బారావు, సిహెచ్‌ఎల్ నరసింహారావు, జి రవీంద్ర, పి ఐజాక్, యువి రామరాజు పాల్గొన్నారు.

పోలీస్ సంక్షేమానికి ప్రాధాన్యత

- 21 నుంచి అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు
- డిజిపి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలీస్ సంక్షేమానికి, ఆరోగ్య భద్రత, హోమ్‌గార్డుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు డిజిపి ద్వారకా తిరుమలరావు తెలిపారు. అమరవీరుల దినోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 21 నుంచి 31 పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు నిర్వహించనున్నామని, దేశంలో అమరులైన వారి పేర్లన్నీ ఈ సందర్భంగా చదువుతామన్నారు. ఈ నెల 21న ఆరంభమయ్యే సంస్మరణ కార్యక్రమాలు ఈ నెల 31తో ముగుస్తాయన్నారు. ఈ నెల 21న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో స్మృతి పరేడ్ నిర్వహిస్తామన్నారు. ఈ నెల 22 నుంచి 31 వరకు విజయవాడలో ఓపెన్ హౌస్ పేరుతో అవగాహన కార్యక్రమాలను, అలాగే ఈ నెల 26, 27 తేదీల్లో ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 24 నుంచి 27 వరకు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు, పోలీస్ సిబ్బందికి, వారి పిల్లలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. 28న జిల్లా/హెడ్ క్వార్టర్స్‌లో పోలీస్ సిబ్బంది, సాధారణ ప్రజానీకం కోసం మెడికల్ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. పోలీస్ ప్రమాద మరణాలకు బీమా కవరేజీని రూ.75 లక్షల నుంచి రూ.కోటికి పెంచామన్నారు. సిబ్బంది సహజ మరణం చెందితే రూ.5 లక్షలున్న ఎక్స్‌గ్రేషియాను రూ.15 లక్షలకు పెంచామని తెలిపారు. రూ.20 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు ఇన్సూరెన్స్ పథకాన్ని ఈ ఏడాది నుంచి పూర్తి స్థాయిలో అమలు చేస్తామని డిజిపి పేర్కొన్నారు. విధులకు వచ్చే స్త్రీ, పురుషులకు అన్ని జిల్లాల ప్రధాన కార్యాలయాల్లో రవాణా వసతి కల్పించేందుకు చర్చలు చేపట్టినట్లు వెల్లడించారు.

ఆలయాన్ని కూల్చింది పూజారే

- ఆర్థిక లావాదేవాలతోనే దుశ్చర్య
- రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు : ఎస్‌పి
- నానా యాగీ చేసిన బిజెపి, ఆర్‌ఎస్ఎస్ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

ఆర్థిక లావాదేవీల మధ్య నెలకొన్న వివాదంతోనే ఆంజనేయస్వామి ఆలయం కూల్చివేసిన సంఘటన అన్నమయ్య జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల విచారణలో ఈ విషయం స్పష్టమైంది. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువు సమీపంలోని కనుగొండ అటవీ ప్రాంతంలో అభయ హస్త ఆంజనేయస్వామి ఆలయం ఉంది. ఈ నెల 14న గుర్తు తెలియని వ్యక్తులు ఆ ఆలయాన్ని కూల్చివేశారు. బిజెపి, ఆర్‌ఎస్ఎస్ నాయకులు శనివారం ఆలయాన్ని పరిశీలించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇతర మతాలకు చెందిన వారే గుడిని కూల్చివేశారని ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సూచన మేరకు అన్నమయ్య జిల్లా ఎస్‌పి విచారణకు ఆదేశాలు జారీ చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. ఆంజనేయస్వామి ఆలయంలో హరినాథ్, విద్యాసాగర్ పూజారులుగా పనిచేస్తున్నారు. విద్యాసాగర్ ఆధీనంలో ఆలయం ఉంది. వీరు ఇరువురి మధ్య కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఆలయానికి వస్తున్న డబ్బులపై హరినాథ్ కన్నుపడింది. విద్యాసాగర్ అడ్డుతగులుతుండడంతో ఆలయాన్ని కూల్చివేస్తే ఆయనకు ఆదాయం పోతుందని, తిరిగి కొత్త ఆలయం ఏర్పాటు చేస్తే తన ఆధీనంలోకి వస్తుందని హరినాథ్ కుట్ర పన్నారు. దీంతో తన అనుచరులతో కలిసి ఆలయాన్ని హరినాథ్ కూల్చివేశారు. పోలీసుల విచారణలో అసలు విషయం తేలడంతో పూజారితో సహా ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఇందులో ఎలాంటి మతపరమైన సంఘటనలూ లేవని కేవలం ఆర్థిక లావాదేవాలే కారణమని పోలీసులు వెల్లడించినప్పటికీ ఈ నేతలు విమర్శలు చేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

ప్రశాంతంగా ఉండాలి : ఎస్‌పి

అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువు అభయహస్త ఆంజనేయస్వామి ఆలయం కూల్చివేత సంఘటనలో ప్రజలందరూ సమన్వయం పాటించాలని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ ఆలయం కూల్చివేతలో ఎలాంటి మతపరమైన సంఘటనలు లేవన్నారు. ఎవరైనా ప్రజలను రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆందోళనకరంగానే డయేరియా

(మొదటిపేజీ తరువాయి)

చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. చనిపోయినవారి వయసును అధికారులు ఎక్కువ చేసి చూపిస్తున్నారని విమర్శిస్తున్నారు.

పక్క మండలాల్లోనూ కేసులు

గుర్లను ఆనుకుని ఉన్న గరివిడి, చీపురుపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లోనూ డయేరియా కేసులు ఉన్నట్టు 'ప్రజాశక్తి' పరిశీలనలో బయటపడింది. గరివిడి మండలం కుమరాం పాలవలసలో మీసాల అప్పలనర్స, మీసాల సింహాచలం, బాలి ఆశ, గదుల సూర్య తదితరులు సుమారు పది మంది వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. పెనుబర్తికి చెందిన వెల్లంకి పైడిమ్మ చీపురుపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చీపురుపల్లి మండలం రావివలసలో కుప్పిలి గౌరీశంకర్ సహా ఆరుగురు డయేరియా బారినపడ్డారు. వీరిలో కొందరు చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రిలో చేరారు. ఈ గ్రామాల ప్రజలు తాగునీటి కోసం చంపావతి నదిపైనే ఆధారపడుతున్నారు. నది లేదా పైపులైలో నీరు కలుషితమైనట్టుగా అనుమానిస్తున్నారు. గుర్ల గ్రామానికి నది నుంచి పైపులైన్ నుంచి నీటి సరఫరాను మరణాలు సంభవించాక అధికారులు నిలిపి వేశారు. గ్రామంలోని బోరు నీరు కూడా కలుషితంగా ఉన్నట్టు తేలడంతో ప్రభుత్వ, ప్రయివేటు బోర్ల వాడకాన్ని కూడా నిషేధించామని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమాశంకర్ తెలిపారు. ప్రస్తుతం క్లోరినేషన్ చేసిన నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒకసారి, కలెక్టర్ రెండుసార్లు గుర్ల గ్రామాన్ని సందర్శించారు. ఇప్పటివరకు ఒక్కరు మాత్రమే డయేరియాతో మరణించారని, మిగిలినవారు ఇతర అనారోగ్య కారణాలతో మృతి చెందారని కలెక్టర్ ప్రకటించడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవడం వల్లే మరణాలు సంభవించాయని, ఇందుకు బాధ్యత వహించి మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు.

విశాఖ కోర్టుకు లోకేష్ హాజరు

- 'సాక్షి' పై పరువు నష్టం కేసులో..

ప్రజాశక్తి - లీగల్ రిపోర్టర్ (విశాఖపట్నం)

తన పరువుకు భంగం కలిగించేలా కథనాలు ప్రచురించిందంటూ సాక్షి మీడియాపై రూ.75 కోట్లుకు పరువు నష్టం దావా వేసిన కేసు విషయమై రాష్ట్ర మంత్రి నారా లోకేష్ విశాఖలోని 12వ అదనపు జిల్లా కోర్టుకు శుక్రవారం హాజరయ్యారు. సాయంకాలం సుమారు రెండున్నర గంటల సేపు ఈ కేసుపై విచారణ జరిగింది. సాక్షి తరఫున అడ్వకేట్ హభయబుల్లా, ఎన్ఎస్వి రెడ్డి, లోకేష్ తరఫున సీనియర్ న్యాయవాది మానం శోభన్‌బాబు హాజరయ్యారు. తుదకు నవంబర్ 15కు ఈ కేసును న్యాయమూర్తి వాయిదా వేశారు. అనంతరం లోకేష్ మీడియాతో మాట్లాడుతూ ప్రజా కోర్టుతో తాము గెలిచామని, పరువు నష్టం కేసులోనూ గెలుస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

న్యాయవాదుల వినతి

మంత్రి నారా లోకేష్‌కు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు బెవర సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు సమస్యలపై న్యాయవాదులు వినతిపత్రం అందజేశారు. న్యాయవాదులకు గ్రూప్ ఇన్సూరెన్స్‌ను కొనసాగించాలని, విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని, లా నేస్తం కొనసాగించాలని, కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు న్యాయవాదులకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించామని, త్వరలో నెరవేరుస్తామని అన్నారు. న్యాయవాదులకు వృత్తి పన్ను రద్దు చేసేందుకు, రక్షణ చట్టం తెచ్చేందుకు కృషి చేస్తున్నామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విశాఖ ఎంపి ఎం శ్రీభరత్, న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి దంతా నరేష్ కుమార్, సీనియర్ న్యాయవాది పృథ్వీరాజ్ పాల్గొన్నారు. తన పర్యటనలో భాగంగా లోకేష్ టిడిపి విశాఖ జిల్లా కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. పలువురు ఆయనను నేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు.

ఇసుక పాలసీ అమలు కావట్లేదని..
ముఖ్యమంత్రే చెప్పడం విడ్డూరం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు
- వరద బాధితులకు దుస్తుల పంపిణీ

పెదలంకలో బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు, రమాదేవి

ప్రజాశక్తి-భట్టిప్రోలు, కొల్లూరు (బాపట్ల జిల్లా)

స్వయంగా ముఖ్యమంత్రే ఉచిత ఇసుక పాలసీ అమలు జరగడంలేదని చెప్పడం విడ్డూరంగా ఉందని, సంబంధిత అధికారులకు అప్పజెప్పిన పనిని ఆయన స్వయంగా పరిశీలించి చేయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కృష్ణా నది వరదల కారణంగా లంక గ్రామాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఈ నష్టాన్ని ప్రభుత్వం తప్ప ఎవరూ తీర్చలేరని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భట్టిప్రోలు మండలం, పెదలంకలో కొల్లూరు మండలం, తిప్పలకట్ట గ్రామాలలో వరద బాధితులకు చీరలు, దుప్పట్లు, కండువాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొల్లూరులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. వరద బాధితులకు తమ వంతుగా ఉడతా భక్తిగా ఆదుకునేందుకు సిపిఎం సేకరించిన సాయంతో వీటిని అందజేస్తున్నామని చెప్పారు. గృహాల్లో నీరు చేరి నష్టపోయిన బాధితులకు ప్రతి గహానికీ రూ.25 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అందించిన రూ. పది వేల సాయం ఏ మూలకూ సరిపోదని తెలిపారు. ప్రభుత్వం ఇసుక మీద, మద్యం మీద చూపించే ప్రేమ వరద బాధితులు, పేద ప్రజలపై చూపించడం లేదని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు జరపకుండా దానికి సంబంధించిన నిధులను నేడు ఉప ముఖ్యమంత్రి రహదారులు నిర్మించడానికి వినియోగిస్తున్నారని, దీనివల్ల కార్మికుల ఉపాధికి గండిపడిందని చెప్పారు. ఎక్కడబడితే అక్కడ మద్యం షాపులు పెట్టడానికి ముందుకు వెళుతున్నారని, స్కూళ్ల దగ్గర, జనావాసాల దగ్గర పెట్టవద్దని మహిళలు పెద్దఎత్తున వ్యతిరేకిస్తున్నారని, ప్రజల అభిప్రాయాలు తీసుకుని మద్యం షాపులు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి, సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య పాల్గొన్నారు.

కుక్క, పాము కాట్ల చికిత్సకు హెల్ప్‌లైన్

- వైద్యారోగ్యశాఖ స్పెషల్ సిఎస్ ఎమ్‌టి కృష్ణబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కుక్క, పాము కాటుకు గురైన వారికి సత్వర చికిత్స అందించే చర్యల్లో భాగంగా సమాచారాన్ని అందించేందుకు వీలుగా జాతీయ స్థాయిలో ఏర్పాటుచేసిన 15400 టోల్‌ఫ్రీ నెంబరుకు సంప్రదిస్తే వ్యాక్సిన్ ఎక్కడ లభ్యమవుతాయనే సమాచారాన్ని అందిస్తారని వైద్యారోగ్యశాఖ స్పెషల్ సిఎస్ ఎమ్‌టి కృష్ణబాబు పేర్కొన్నారు. ర్యాబిస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలుగులో ముద్రించిన పోస్టర్లు, కరపత్రాలను సచివాలయంలో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు హెల్ప్‌లైన్ పనిచేస్తుందన్నారు. ప్రస్తుతానికి ఇంగ్లీషు, హిందీ భాషల్లో సమాధానం చెప్తారని, ఈ నెల 21 నుంచి తెలుగులోనూ సమాధానం ఇస్తామని తెలిపారు.

పాము, కుక్క కాటు మరణాల్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. జాతీయ స్థాయిలో ఏర్పాటుచేసిన కేంద్రానికి అనుసంధానంగా విజయవాడలోనూ ఏర్పాటు చేశారన్నారు. 2030 నాటికి కుక్క కాటు వల్ల వచ్చే ర్యాబిస్ వ్యాధిని నిర్మూలించాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు కొత్తగా ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ ఉపయోగపడుతుందన్నారు. ర్యాబిస్ వ్యాధితో ఏడాదికి 20 వేల మంది మరణిస్తున్నారని, రాష్ట్రంలో 2023లో 2,12,246 మంది కుక్క కాటుకు గురయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు ఎ సిరి, ఉన్నతాధికారులు గణపతిరావు, మోహన్‌కృష్ణ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

పాఠశాల పైకప్పు పెచ్చులూడి విద్యార్థినికి గాయాలు

ప్రజాశక్తి - మండవల్లి (ఏలూరు జిల్లా)

పాఠశాల పైకప్పు పెచ్చులూడి విద్యార్థిని తలపై పడడంతో తీవ్ర గాయమైన ఘటన ఏలూరు జిల్లా మండవల్లి మండలంలోని చింతపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం... చింతపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఏడో తరగతి గదిలో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు చెబుతుండగా ఒక్కసారిగా గదిలోని స్లాబ్ నుంచి పెచ్చులూడి విద్యార్థిని జయమంగళ జయశ్రీ తలపై పడి గాయమైంది. పరీక్షించిన ఉపాధ్యాయులు చిన్న దెబ్బేనని, తగ్గిపోతుందని నిర్లక్ష్యం చేశారు. జయశ్రీ తల నుంచి రక్తం కారుతుండడంతో తోటి విద్యార్థులు ఆర్ఎంపి వైద్యుని వద్దకు తీసుకెళ్లగా బలమైన దెబ్బ తగిలిందని చెప్పడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కైకలూరులోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న స్థానికులు, తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై నిలదీశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

కడప జిల్లా ఆర్‌టిపిపిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

ఎపి జెన్‌కో నిర్లక్ష్య వైఖరి

- నల్లబ్యాడ్జీలతో ఆర్‌టిపిపి కాంట్రాక్టు కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల (కడప జిల్లా)

ఎపి జెన్‌కోలో యాజమాన్యం నిర్లక్ష వైఖరికి నిరసనగా ఎపి ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కడప జిల్లా ఎర్రగుంట్ల మండల పరిధిలోని ఆర్‌టిపిపిలో కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఎపి జెన్‌కోలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలైన గ్రేడ్ ఛేంజ్, పిఆర్‌సి అరియర్స్, సర్వీస్ ఇన్సెంటివ్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎపి ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస సుబ్బిరెడ్డి, యూనియన్ ఆర్‌టిపిపి ప్రాంతీయ అధ్యక్ష, కార్యదర్శులు వి గంగయ్య, డి పుల్లారెడ్డి మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను అనేకమార్లు ఎపి జెన్‌కో యాజమాన్యం దృష్టికి తెచ్చినా స్పందన లేదన్నారు. కార్మికుల సమస్యలపై విద్యుత్ మంత్రిని కలిసి విన్నవించినా ఫలితం లేదని పేర్కొన్నారు. 16 మాసాలు ఆలస్యంగా 2023 ఆగస్టులో వేతన సవరణ మాత్రమే చేసి అరియర్స్‌ను ఇవ్వలేదన్నారు. కాంట్రాక్టు కార్మికుల విషయంలో విద్యుత్ యజమాన్యాలు నిర్లక్ష్యం చూపిస్తున్నాయని విమర్శించాయి. అరియర్స్ ఇవ్వకపోవడం వల్ల ఒక్కో కార్మికుడు సుమారు రూ.లక్ష వరకు నష్టపోతున్నారని పేర్కొన్నారు. 2018 చంద్రబాబు ప్రభుతంలో జరిగిన వేతన సవరణ పది సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న ప్రతి కార్మికుడికి సర్వీస్ ఇన్సెంటివ్ కింద నెలకు రూ.ఐదు వందల నుండి రూ.వెయ్యి ఇచ్చేవారని తెలిపారు. 2023లో గత ప్రభుత్వ హయాంలో దాన్నీ తొలగించారని దాని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమబాట పట్టడానికి వెనుకాడమన్నారు. కార్మికుల నిరసనకు ఎపి పవర్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎస్‌జి శేఖర్ మద్దతు తెలిపారు. నిరసన కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మిక సంఘం నేతలు వెంకట రమణ, పవన్, రాజు, రమణయ్య, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

ప్రమాద ఘటనను చూపించడానికి వెళ్లి...
అటవీ ఉద్యోగి మృతి

- పోలీసు వాహనాన్ని ఢీకొన్న గ్యాస్ లారీ

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

ప్రమాద స్థలాన్ని చూపించడానికి వెళ్లిన అటవీశాఖ ఒప్పంద ఉద్యోగి మృతి చెందిన ఘటన గురువారం అర్ధరాత్రి తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం పెద్దకన్నలి గ్రామ సమీపం నాయుడుపేట-మదనపల్లి జాతీయ రోడ్డుపై చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తొట్టంబేడు మండలం బసవయ్యపాలెం ఎస్‌టి కాలనీకి చెందిన వెంకటేష్ (35) గత 15 ఏళ్లుగా బసవయ్యపాలెం చెక్‌పోస్టు వద్ద ఒప్పంద ఫారెస్ట్ వాచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి పెద్దకన్నలి సమీపంలో కట్టెల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్, కేరళ నుంచి వెళ్తున్న టూరిస్ట్ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు ఘటనా స్థలికి వెళ్లేందుకు చెక్‌పోస్టు విధుల్లో ఉన్న అటవీ ఉద్యోగి వెంకటేష్ సాయం తీసుకున్నారు. ఈ క్రమంలో ఘటనా స్థలం వద్ద దర్యాప్తు చేస్తున్న సమయంలో పోలీసు వాహనాన్ని వెనుక వైపు నుంచి గ్యాస్‌లారీ వేగంగా ఢీ కొట్టింది. పోలీసు వాహనంలో ఉన్న వెంకటేష్ అక్కడికక్కడే మరణించారు. మరొకరికి గాయాలయ్యాయి. వెంకటేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూలి రేట్ల సమస్యను పరిష్కరిస్తాం : నాదెండ్ల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పౌర సరఫరాలశాఖ పరిధిలోని మండల స్థాయిలో పనిచేస్తున్న హమాలీల కూలి రేట్ల పెంపు సమస్యను త్వరలో పరిష్కరిస్తామని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. హమాలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పౌరసరఫరాల సంస్థ హమాలీల రాష్ట్ర యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు నేతృత్వంలో సిఐటియు నాయకులు బి ముత్యాలరావు, బి లక్ష్మణరావు శుక్రవారం విజయవాడలోని పౌరసరఫరాలశాఖ ప్రధాన కార్యాలయంలో మంత్రి నాదెండ్లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. పౌరసరఫరాల శాఖ పరిధిలోని మండల స్థాయిలో పనిచేస్తున్న హమాలీలకు గత జనవరి నుంచి కూలి రేట్లు పెంచి అమలు చేయాల్సి ఉండగా, గత ప్రభుత్వం కూలి రేట్లు పెంచకుండా కాలయాపన చేసిందన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ, నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు క్వింటాలుకు రూ.25 నుంచి రూ.40లకు పెంచాలని, దసరా బోనస్ రూ.6 వేల నుంచి రూ.15 వేలకు పెంచాలన్నారు. ఇటీవల దసరా పండగ సందర్భంగా బోనస్ పెంచకుండానే పాత పద్ధతిలోనే చెల్లించారని మంత్రి నాదెండ్ల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

అన్ని ఎంఎల్ఎస్ పాయింట్లలో స్వీపర్స్‌ను వెంటనే నియమించాలని, పిఎఫ్ క్లెయిమ్స్ కొత్తవారి పేర్లు చేర్చడం, పేర్లలోని అక్షరాల దోషాలను సరిదిద్దే పనికి సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ఇఎస్ఐ పథకం అమలుకు ఆటంకంగా ఉన్న కోర్టు కేసులను ఉపసంహరించి వెంటనే అమలు చేయాలని మంత్రికి తాము విజ్ఞప్తి చేసినట్లు ఎపి పౌరసరఫరాల సంస్థ హమాలీల రాష్ట్ర యూనియన్ పేర్కొంది. రిటైర్మెంట్ అయిన హమాలీ కార్మికులకు పిఎఫ్ క్లెయిమ్స్, పెన్షన్ అమలు చేయాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కూలి రేట్లు పెంచి 1.1.2024 నుంచి ఎరియర్స్ చెల్లింపుతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మంత్రి నాదెండ్లకు వినతిని అందిస్తున్న నాయకులు

ఒక గేటు ద్వారా విడుదలవుతున్న వరద నీరు

శ్రీశైలానికి వరద ప్రవాహం

- ఒక గేటు ద్వారా దిగువకు నీటి విడుదల

ప్రజాశక్తి-శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణా నది ఎగువ పరివాహక ప్రాంతాలలో కురిసిన వర్షాల కారణంగా శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైల జలాశయ పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకు చేరుకుంది. దీంతో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఒక గేటును పది అడుగుల మేర పైకెత్తి 27,891 క్యూసెక్కుల నీటిని జలవనరుల శాఖ అధికారులు దిగువకు విడుదల చేశారు. మూడు గంటల సమయంలో ఎగువ జూరాల నుంచి 83,891 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 38,493 క్యూసెక్కులు , హంద్రీ నుంచి 250 క్యూసెక్కులతో కలిపి జలాశయానికి 1,22,634 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. పైకెత్తిన ఒక గేటు ద్వారా 27,891 క్యూసెక్కులతో కలిపి జలాశయ ఎడమ, కుడి విద్యుత్తు ఉత్పత్తి అనంతరం 95,753 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది జలాశయం నుంచి ఆనకట్ట గేట్లు ఎత్తడం ఇది ఐదవసారి. నీటి ప్రవాహాన్ని బట్టి గేట్లు ఎత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

జగన్ కోర్టుకు హాజరవ్వాలి

- శ్రీనివాస్ తరపు న్యాయవాది

ప్రజాశక్తి - లీగల్ రిపోర్టర్, కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ ఎయిర్ పోర్టులో మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డిపై జరిగిన కోడి కత్తి దాడిపై ఆయన వెంటనే కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పాలని, ఆ కేసులో ప్రధాన ముద్దాయి జనుపల్లి శ్రీనివాస్ తరపు న్యాయవాది సలీం కోరారు. ఈ కేసుపై విశాఖలోని ఎన్ఐఎ కోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. వచ్చే నెల 15కి కోర్టు వాయిదా వేసింది. ఈ సందర్భంగా సలీం మీడియాతో మాట్లాడుతూ సాధారణ ఎమ్మెల్యేగా ఉన్న జగన్మోహన్ రెడ్డి కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పడానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నానని చెబుతూ కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుంటూ వచ్చారన్నారు. ఇప్పటికైనా కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాలని, లేనిపక్షంలో న్యాయపరంగా ముందుకు వెళ్తామని హెచ్చరించారు. దళిత సంఘాల నాయకుడు డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ జైల్లో ఉన్న అనుచరులను కలవడానికి వెళ్తున్న జగన్ ఈ కేసులో సాక్ష్యం చెప్పడానికి ఎందుకు రావడం లేదన్నారు. కోర్టుకు హాజరు కాకపోవడాన్ని కోర్టు ధిక్కరణ కిందే పరిగణించాలని కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న న్యాయవాది సలీం



వెలువడినది
ప్రియతమ నేతకు అక్షర నివాళి
కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయం, లక్ష్యం తెలిపేందుకు ఆయన్ని స్మరించుకుంటూ వేసినదే ఈ అక్షర నివాళి పుస్తకం.
వెల : 225/-
ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్
ఫోన్ : 9490099057
బ్రాంచీలు
విశాఖపట్నం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు

సిహెచ్. ఆదెయ్య, బ్యాంక్రప్ట్ విషయమై
ఆస్తుల అమ్మకము కొరకు నోటీసు (4వ సారి)
(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరియు సిహెచ్ ఆదెయ్య, కు మధ్య గల విషయమై IBC, 2016 లోని సెక్షన్ 123 క్రింద CP (IB) No. 225/123/HDB/2023 లో గౌ॥ NCLT, హైదరాబాద్ బెంచ్-1 ద్వారా జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం)

ఈ నోటీసు ద్వారా సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమేమనగా, ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డు ఆఫ్ ఇండియా (కార్పొరేట్ డెటార్లకు వ్యక్తిగత హామీదారుల కొరకు బ్యాంక్రప్టసీ ప్రాసెస్) రెగ్యులేషన్స్, 2019లోని రెగ్యులేషన్ 27 క్రింద షెడ్యూల్-2 లోని పార్ట్-ఎలో నిబంధనలు అనుసరించి **శ్రీ సిహెచ్. ఆదెయ్య** (బ్యాంక్రప్ట్) యొక్క ఆస్తుల ఇ-వేలం ప్లాట్‌ఫారం అనగా https://bankeauctions.com ద్వారా అమ్ముటకు ప్రతిపాదించినారు.
సదరు బిడ్డింగ్ ఆన్‌లైన్ ఇ-వేలము సర్వీస్ ప్రొవైడర్ మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ https://bankeauctions.com ద్వారా నిర్వహించబడును.

క్ర.సం.	వివరములు	వివరములు
1	ధరావత్తు సొమ్ము డిపాజిట్‌తో పాటు బిడ్ పత్రముల దాఖలుకు ఆఖరి తేది	02-11-2024న సా.5.00 గం.ల వరకు
4.	సైట్ తనిఖీ/ సైట్ సందర్శన తేది	20-10-2024 నుండి 02-11-2024న ఉ.10.00 గం.ల నుండి సా.5.00 గం.ల మధ్య
5.	ఇ-వేలము తేది :	05-11-2024న మ.12.00 గం.ల నుండి మ. 01.00 గం.ల వరకు.(ప్రతి 5 ని॥లకు ఒకసారి అపరిమిత పొడిగింపుతో).
6.	బ్యాంక్రప్టసీ ట్రస్టీ యొక్క చిరునామా మరియు ఇ-మెయిల్	ఎంఎంఆర్ లయన్ కార్ప్, 4వ అంతస్తు, హెచ్ఎస్ఆర్ ఈడేన్, క్రీమ్ స్టోన్ ప్రక్కన, రోడ్ నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్, తెలంగాణ- 500034. ఇ-మెయిల్: irppgchadalavada@gmail.com, మొబైల్ నెం. 9848271555.

ఇ-వేలము క్రింద ఆస్తుల వివరములు

ఆస్తుల వివరములు	రిజర్వు ధర (రూ.)	బయానా (రూ.)	బిడ్ పెంపుదల విలువ (రూ.)
ప్రకాశం జిల్లా, (ఎపి) ఎస్.ఎన్.పాడు మండలం, మంగమూరు గ్రామం, వద్ద ఎ.4.95 సెంట్ల విస్తీర్ణము గల వ్యవసాయ భూమి యావదాస్తి.	2,43,98,550	24,39,855	2,00,000

గమనికలు :
1) సదరు అమ్మకము ఎటువంటి వారంటీలు మరియు ఇండెమ్నిటీలు లేకుండా నిర్వహించబడును.
2) సదరు అమ్మకము "ఎక్కడ ఎలా ఉందో, ఏది ఏలా ఉందో మరియు ఏదైతే ఎలా ఉందో అది అలానే" ప్రాతిపదికన రికోర్స్ పద్ధతి కాకుండా నిర్వహించబడును.
3) పైన తెలిపిన ఆస్తుల ఒరిజినల్ పత్రములు మెస్సర్స్ చెదలవాడ ఇన్‌ఫ్రా టెక్ లిమిటెడ్ విషయమై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) కస్టడీలో కలవు.
4) సదరు ఆస్తిపై అనధికార వర్గాలద్వారా ఏర్పాటుచేసిన డాక్యుమెంట్స్ ప్రకారం 8వ అదనపు జిల్లా జడ్జి, ఒంగోల్ వారు సుదనగుంట నారాయణరావు, మహ్మద్ సాహుల్ హమీద్ లతో పాటు మరియు చదలవాడ వరలక్ష్మి ల మధ్య ఒరిజినల్ సూట్ నం. 184/2017 ప్రకారం 11 ఏప్రిల్, 2018న డిక్రీ జారీ చేసినట్లు ఈ నోటీసు ద్వారా హెచ్చరించడమైనది.
5) ఆన్‌లైన్ ఇ-వేలము అమ్మకము యొక్క సాధారణ నియమనిబంధనలు, ఆన్‌లైన్ ఇ-వేలము బిడ్డు ఫారం డిక్లరేషన్ మరియు అండర్‌టేకింగ్, బ్యాంక్రప్ట్ యొక్క ఆస్తుల గురించిన పూర్తి మరియు వివరణాత్మక సమాచారం "ఇ-వేలం ప్రాసెస్ ఇన్‌ఫర్మేషన్ డాక్యుమెంట్" వద్ద లభించును. అమ్మకము నోటీసును **"ఇ-వేలం ప్రాసెస్ ఇన్‌ఫర్మేషన్ డాక్యుమెంట్"తో పాటు https://www.bankeauctions.com (మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్) వద్ద లభించును మరియు వాటితో పాటు క్షుణ్ణంగా చదువ వలెను. లేదా శ్రీ ధరణికృష్ణ-9948182222, మెయిల్ : telangana@c1india.com లేదా ఇ-మెయిల్ : irppgchadalavada@gmail.com కు సంప్రదించవలెను.**
6) ఆసక్తి గల బిడ్డర్లు "ఇ-వేలం ప్రాసెస్ ఇన్‌ఫర్మేషన్ డాక్యుమెంట్"లో సూచించిన సంబంధిత నియమనిబంధనలతో పాటు ఖచ్చితంగా చదివి మరియు ఒప్పుకొని వేలములో పాల్గొనవలెను.
7) బ్యాంక్రప్టసీ ట్రస్టీ లేదా అమ్మకమునకు ప్రభావితమగు బ్యాంక్రప్ట్‌లో భాగంగా ఏ విధమైన బిడ్డింగ్ ఆబ్లిగేషన్లు సృష్టించకుండా మరియు ఔత్సాహిక బిడ్డర్లను ఆహ్వానించు ప్రయోజనం కొరకు మాత్రమే గా స్పష్టీకరించడమైనది. ఎటువంటి ముందస్తు కారణము తెలపకుండా ఏ సమయంలోనైన ఏవైనా ఆస్తులను ఉపసంహరించుకొనుట లేదా ఇ-వేలము రద్దు/ వాయిదా/ నిరంతర రద్దు లేదా అన్ని లేదా ఏవైనా ఆఫర్లను స్వీకరించుటకు లేదా నిరాకరించుటకు బ్యాంక్రప్టసీ ట్రస్టీకి పూర్తి హక్కులు కలవు.
8) సదరు అమ్మకము ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్, 2016 మరియు నిబంధనలకు లోబడియుండును.
9) ఏవైనా స్పష్టతల కొరకు ఈ క్రింది సంతకందారును సంప్రదించవచ్చును.

మలిగి మధుసూధన రెడ్డి
బ్యాంక్రప్టసీ ట్రస్టీ
తేది : 19.10.2024
ప్రదేశం : హైదరాబాద్
రిజిస్టర్డ్ నెం. IBBI/IPA-001/IP-P00843/2017-2018/11427
AFA No. AA1/11427/02/311225/107442, వ్యవధి: 31.12.2025 వరకు.

సిహెచ్. వరలక్ష్మీ, బ్యాంక్రప్ట్ విషయమై
ఆస్తుల అమ్మకము కొరకు నోటీసు (4వ సారి)
(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరియు సిహెచ్ వరలక్ష్మీకి కు మధ్య గల విషయమై IBC, 2016 లోని సెక్షన్ 121 క్రింద CP (IB) No. 111/121/HDB/2023 లో గౌ॥ NCLT, హైదరాబాద్ బెంచ్-1 ద్వారా జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం)

ఈ నోటీసు ద్వారా సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమేమనగా, ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డు ఆఫ్ ఇండియా (కార్పొరేట్ డెటార్లకు వ్యక్తిగత హామీదారుల కొరకు బ్యాంక్రప్టసీ ప్రాసెస్) రెగ్యులేషన్స్, 2019లోని రెగ్యులేషన్ 27 క్రింద షెడ్యూల్-2 లోని పార్ట్-ఎలో నిబంధనలు అనుసరించి **శ్రీమతి సిహెచ్. వరలక్ష్మీ** (బ్యాంక్రప్ట్) యొక్క ఆస్తుల ఇ-వేలం ప్లాట్‌ఫారం అనగా https://bankeauctions.com ద్వారా అమ్ముటకు ప్రతిపాదించినారు.
సదరు బిడ్డింగ్ ఆన్‌లైన్ ఇ-వేలము సర్వీస్ ప్రొవైడర్ మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ https://bankeauctions.com ద్వారా నిర్వహించబడును.

క్ర.సం.	వివరములు	వివరములు
1	ధరావత్తు సొమ్ము డిపాజిట్‌తో పాటు బిడ్ పత్రముల దాఖలుకు ఆఖరి తేది	02-11-2024న సా.5.00 గం.ల వరకు
4.	సైట్ తనిఖీ/ సైట్ సందర్శన తేది	20-10-2024 నుండి 02-11-2024న ఉ.10.00 గం.ల నుండి సా.5.00 గం.ల మధ్య
5.	ఇ-వేలము తేది :	05-11-2024న ఉ.11.00 గం.ల నుండి మ. 12.00 గం.ల వరకు.(ప్రతి 5 ని॥లకు ఒకసారి అపరిమిత పొడిగింపుతో).
6.	బ్యాంక్రప్టసీ ట్రస్టీ యొక్క చిరునామా మరియు ఇ-మెయిల్	ఎంఎంఆర్ లైయన్ కార్ప్, 4వ అంతస్తు, హెచ్ఎస్ఆర్ ఈడేన్, క్రీమ్ స్టోన్ ప్రక్కన, రోడ్ నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్, తెలంగాణ- 500034. ఇ-మెయిల్: irppgchadalavada@gmail.com, మొబైల్ నెం. 9848271555.

ఇ-వేలము క్రింద ఆస్తుల వివరములు

ఆస్తుల వివరములు	రిజర్వు ధర (రూ.)	బయానా (రూ.)	బిడ్ పెంపుదల విలువ (రూ.)
ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు మండలం, మంగమూరు గ్రామం, ఆనంద్ విహార్ వెంచర్ వద్ద సర్వే నెం. 16లో (ఎ. 1.54 సెంట్లు) 17లో (ఎ. 1.43 సెంట్లు), 18లో (ఎ. 1.08 సెంట్ల) విస్తీర్ణము గల వ్యవసాయ భూమి యావదాస్తి. విస్తీర్ణము: 4.05 సెంట్లు	1,99,62,450	19,96,245	2,00,000

గమనికలు :
1) సదరు అమ్మకము ఎటువంటి వారంటీలు మరియు ఇండెమ్నిటీలు లేకుండా నిర్వహించబడును.
2) సదరు అమ్మకము "ఎక్కడ ఎలా ఉందో, ఏది ఏలా ఉందో మరియు ఏదైతే ఎలా ఉందో అది అలానే" ప్రాతిపదికన రికోర్స్ పద్ధతి కాకుండా నిర్వహించబడును.
3) పైన తెలిపిన ఆస్తుల ఒరిజినల్ పత్రములు మెస్సర్స్ చెదలవాడ ఇన్‌ఫ్రా టెక్ లిమిటెడ్ విషయమై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) కస్టడీలో కలవు.
4) సదరు ఆస్తిపై అనధికార వర్గాలద్వారా ఏర్పాటుచేసిన డాక్యుమెంట్స్ ప్రకారం 8వ అదనపు జిల్లా జడ్జి, ఒంగోల్ వారు సుదనగుంట నారాయణరావు, మహ్మద్ సాహుల్ హమీద్ లతో పాటు మరియు చదలవాడ వరలక్ష్మి ల మధ్య ఒరిజినల్ సూట్ నం. 184/2017 ప్రకారం 11 ఏప్రిల్, 2018న డిక్రీ జారీ చేసినట్లు ఈనోటోసు ద్వారా హెచ్చరించడమైనది.
5) ఆన్‌లైన్ ఇ-వేలము అమ్మకము యొక్క సాధారణ నియమనిబంధనలు, ఆన్‌లైన్ ఇ-వేలము బిడ్డు ఫారం డిక్లరేషన్ మరియు అండర్‌టేకింగ్, బ్యాంక్రప్ట్ యొక్క ఆస్తుల గురించిన పూర్తి మరియు వివరణాత్మక సమాచారం "ఇ-వేలం ప్రాసెస్ ఇన్‌ఫర్మేషన్ డాక్యుమెంట్" వద్ద లభించును. అమ్మకము నోటీసును "ఇ-వేలం ప్రాసెస్ ఇన్‌ఫర్మేషన్ డాక్యుమెంట్"తో పాటు https://www.bankeauctions.com (మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్) వద్ద లభించును మరియు వాటితో పాటు క్షుణ్ణంగా చదువ వలెను. లేదా శ్రీ ధరణికృష్ణ-9948182222, మెయిల్ : telangana@c1india.com లేదా ఇ-మెయిల్ : irppgchadalavada@gmail.com కు సంప్రదించవలెను.
6) ఆసక్తి గల బిడ్డర్లు "ఇ-వేలం ప్రాసెస్ ఇన్‌ఫర్మేషన్ డాక్యుమెంట్"లో సూచించిన సంబంధిత నియమనిబంధనలతో పాటు ఖచ్చితంగా చదివి మరియు ఒప్పుకొని వేలములో పాల్గొనవలెను.
7) బ్యాంక్రప్టసీ ట్రస్టీ లేదా అమ్మకమునకు ప్రభావితమగు బ్యాంక్రప్ట్‌లో భాగంగా ఏ విధమైన బిడ్డింగ్ ఆబ్లిగేషన్లు సృష్టించకుండా మరియు ఔత్సాహిక బిడ్డర్లను ఆహ్వానించు ప్రయోజనం కొరకు మాత్రమే గా స్పష్టీకరించడమైనది. ఎటువంటి ముందస్తు కారణము తెలపకుండా ఏ సమయంలోనైన ఏవైనా ఆస్తులను ఉపసంహరించుకొనుట లేదా ఇ-వేలము రద్దు/ వాయిదా/ నిరంతర రద్దు లేదా అన్ని లేదా ఏవైనా ఆఫర్లను స్వీకరించుటకు లేదా నిరాకరించుటకు బ్యాంక్రప్టసీ ట్రస్టీకి పూర్తి హక్కులు కలవు.
8) సదరు అమ్మకము ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్, 2016 మరియు నిబంధనలకు లోబడియుండును.
9) ఏవైనా స్పష్టతల కొరకు ఈ క్రింది సంతకందారును సంప్రదించవచ్చును.

మలిగి మధుసూధన రెడ్డి
బ్యాంక్రప్టసీ ట్రస్టీ
తేది : 19.10.2024
ప్రదేశం : హైదరాబాద్
రిజిస్టర్డ్ నెం. IBBI/IPA-001/IP-P00843/2017-2018/11427

ఎం. హరనాథ బాబు, బ్యాంక్రప్ట్ విషయమై
ఆస్తుల అమ్మకము కొరకు నోటీసు (4వ సారి)
(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరియు ఎం. హరనాథ బాబు, కు మధ్య గల విషయమై IBC, 2016 లోని సెక్షన్ 123 క్రింద CP (IB) No. 227/123/HDB/2023 లో గౌ॥ NCLT, హైదరాబాద్ బెంచ్-1 ద్వారా జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం)

ఈ నోటీసు ద్వారా సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమేమనగా, ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డు ఆఫ్ ఇండియా (కార్పొరేట్ డెటార్లకు వ్యక్తిగత హామీదారుల కొరకు బ్యాంక్రప్టసీ ప్రాసెస్) రెగ్యులేషన్స్, 2019లోని రెగ్యులేషన్ 27 క్రింద షెడ్యూల్-2 లోని పార్ట్-ఎలో నిబంధనలు అనుసరించి శ్రీ **ఎం. హరనాథ బాబు,** (బ్యాంక్రప్ట్) యొక్క ఆస్తుల ఇ-వేలం ప్లాట్‌ఫారం అనగా https://bankeauctions.com ద్వారా అమ్ముటకు ప్రతిపాదించినారు.
సదరు బిడ్డింగ్ ఆన్‌లైన్ ఇ-వేలము సర్వీస్ ప్రొవైడర్ మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ https://bankeauctions.com ద్వారా నిర్వహించబడును.

క్ర.సం.	వివరములు	వివరములు
1	ధరావత్తు సొమ్ము డిపాజిట్‌తో పాటు బిడ్ పత్రముల దాఖలుకు ఆఖరి తేది	02-11-2024న సా.5.00 గం.ల వరకు
4.	సైట్ తనిఖీ/ సైట్ సందర్శన తేది	20-10-2024 నుండి 02-11-2024న ఉ.10.00 గం.ల నుండి సా.5.00 గం.ల మధ్య
5.	ఇ-వేలము తేది :	05-11-2024న ఉ.11.00 గం.ల నుండి మ. 12.00 గం.ల వరకు.(ప్రతి 5 ని॥లకు ఒకసారి అపరిమిత పొడిగింపుతో).
6.	బ్యాంక్రప్టసీ ట్రస్టీ యొక్క చిరునామా మరియు ఇ-మెయిల్	ఎంఎంఆర్ లైయన్ కార్ప్, 4వ అంతస్తు, హెచ్ఎస్ఆర్ ఈడేన్, క్రీమ్ స్టోన్ ప్రక్కన, రోడ్ నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్, తెలంగాణ- 500034. ఇ-మెయిల్: irppgchadalavada@gmail.com, మొబైల్ నెం. 9848271555.

ఇ-వేలము క్రింద ఆస్తుల వివరములు

ఆస్తుల వివరములు	రిజర్వు ధర (రూ.)	బయానా (రూ.)	బిడ్ పెంపుదల విలువ (రూ.)
ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లా, ఒంగోలు, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్, ఎలక్షన్ డివిజన్ నం. 46, అల్లూరి సీతారామరాజు స్ట్రీట్, అసెస్ట్ నం. 2330, సర్వే నం. 164 & 164/1, లలో డి.నం. 5-356 వద్ద గ్రౌండ్ & ఒకటవ అంతస్తులతో ఆర్‌సిసి రూఫ్ కలిగిన ప్రస్తుతం ఉన్న భవనం యావదాస్తి. విస్తీర్ణము: 216.80 చ.గ.లు.	66,06,000	6,00,000	1,00,000

గమనికలు :
1) సదరు అమ్మకము ఎటువంటి వారంటీలు మరియు ఇండెమ్నిటీలు లేకుండా నిర్వహించబడును.
2) సదరు అమ్మకము "ఎక్కడ ఎలా ఉందో, ఏది ఎలా ఉందో మరియు ఏదైతే ఎలా ఉందో అది అలానే" ప్రాతిపదికన రికోర్స్ పద్ధతి కాకుండా నిర్వహించబడును.
3) పైన తెలిపిన ఆస్తుల ఒరిజినల్ పత్రములు మెస్సర్స్ చెదలవాడ ఇన్‌ఫ్రా టెక్ లిమిటెడ్ విషయమై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) కస్టడీలో కలవు.
4) ఆన్‌లైన్ ఇ-వేలము అమ్మకము యొక్క సాధారణ నియమనిబంధనలు, ఆన్‌లైన్ ఇ-వేలము బిడ్డు ఫారం డిక్లరేషన్ మరియు అండర్‌టేకింగ్, బ్యాంక్రప్ట్ యొక్క ఆస్తుల గురించిన పూర్తి మరియు వివరణాత్మక సమాచారం "ఇ-వేలం ప్రాసెస్ ఇన్‌ఫర్మేషన్ డాక్యుమెంట్" వద్ద లభించును. అమ్మకము నోటీసును "ఇ-వేలం ప్రాసెస్ ఇన్‌ఫర్మేషన్ డాక్యుమెంట్"తో పాటు https://www.bankeauctions.com (మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్) వద్ద లభించును మరియు వాటితో పాటు క్షుణ్ణంగా చదువ వలెను. లేదా శ్రీ ధరణికృష్ణ-9948182222, మెయిల్ : telangana@c1india.com లేదా ఇ-మెయిల్ : irppgchadalavada@gmail.com కు సంప్రదించవలెను.
5) ఆసక్తి గల బిడ్డర్లు "ఇ-వేలం ప్రాసెస్ ఇన్‌ఫర్మేషన్ డాక్యుమెంట్"లో సూచించిన సంబంధిత నియమనిబంధనలతో పాటు ఖచ్చితంగా చదివి మరియు ఒప్పుకొని వేలములో పాల్గొనవలెను.
6) బ్యాంక్రప్టసీ ట్రస్టీ లేదా అమ్మకమునకు ప్రభావితమగు బ్యాంక్రప్ట్‌లో భాగంగా ఏ విధమైన బిడ్డింగ్ ఆబ్లిగేషన్లు సృష్టించకుండా మరియు ఔత్సాహిక బిడ్డర్లను ఆహ్వానించు ప్రయోజనం కొరకు మాత్రమే గా స్పష్టీకరించడమైనది. ఎటువంటి ముందస్తు కారణము తెలపకుండా ఏ సమయంలోనైన ఏవైనా ఆస్తులను ఉపసంహరించుకొనుట లేదా ఇ-వేలము రద్దు/ వాయిదా/ నిరంతర రద్దు లేదా అన్ని లేదా ఏవైనా ఆఫర్లను స్వీకరించుటకు లేదా నిరాకరించుటకు బ్యాంక్రప్టసీ ట్రస్టీకి పూర్తి హక్కులు కలవు.
7) సదరు అమ్మకము ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్, 2016 మరియు నిబంధనలకు లోబడియుండును.
8) ఏవైనా స్పష్టతల కొరకు ఈ క్రింది సంతకందారును సంప్రదించవచ్చును.

మలిగి మధుసూధన రెడ్డి
బ్యాంక్రప్టసీ ట్రస్టీ
తేది : 19.10.2024
ప్రదేశం : హైదరాబాద్
రిజిస్టర్డ్ నెం. IBBI/IPA-001/IP-P00843/2017-2018/11427
AFA No. AA1/11427/02/311225/107442, వ్యవధి: 31.12.2025 వరకు.

సంపాదకీయం

ఎర్ర తివాచీ..!

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పెట్టుబడిదారులను రెడ్ కార్పెట్ పరిచి ఆహ్వానిస్తున్నామని సి.ఎం చంద్రబాబు నాయుడు పిలుపునిస్తూ రాష్ట్రంలో వ్యాపార అనుకూల ప్రభుత్వం ఉందని చెప్పడం ద్వారా కార్మిక, ఉద్యోగుల పట్ల సర్కారు ఎటువంటి వైఖరి తీసుకుంటుందో చెప్పకనే చెప్పినట్టయింది. కొత్త పాలసీ ఫ్రేమ్‌వర్క్ పరిశ్రమ అనుభవజ్ఞులతో సమగ్ర సంప్రదింపుల ఆధారంగా రూపొందించామని, దేశంలో అత్యుత్తమ వ్యాపార పర్యావరణ వ్యవస్థను తాము నిర్మించబోతున్నట్లు గొప్పగా చెప్పారు. వ్యక్తిగతంగా తాను పెట్టుబడులు పెట్టేవారికి హామీ ఇవ్వాలనుకుంటున్నానని, దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముఖ్యంగా మన రాష్ట్రంలో ఇంతకంటే మంచి సమయం ఎప్పుడూ లేదంటూనే పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చేవారి కోసం ఎదురు చూస్తున్నట్లు సిఎం చెప్పడం ఈ ప్రభుత్వ ప్రాధాన్యతను విడమర్చింది. గతంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఉండేదనీ తమ ప్రభుత్వం ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదాన్ని ఎత్తుకుందని ఇంతకు ముందే ఆయన ప్రకటించడం పెట్టుబడిదార్లకు భరోసా కల్పించడానికే!

ముఖ్యమంత్రి ప్రకటనకు వేగంగా స్పందించిన ఎ.పి ఛాంబర్స్ స్తోత్ర పాఠాలు పాడడం ఆశ్చర్యకరం కాదు. ప్రభుత్వం ఆమోదించిన ఆరు కొత్త పాలసీలతో రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని, ఇప్పటి వరకూ వచ్చిన పాలసీలకంటే అత్యంత మెరుగైనవని పేర్కొన్నారు. ముఖ్యంగా పీపుల్ పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ (పిపిపిపి) పద్ధతిలో తీసుకువస్తున్న ప్రైవేటు పారిశ్రామిక పార్కులు రాష్ట్రంలో తిరుగులేని అధ్యాయాన్ని సృష్టిస్తాయని ఆనందం వ్యక్తం చేయడం ప్రజల సంపద పెట్టుబడిదార్ల పరం అవుతుందనే! పార్కుల ఏర్పాటులో భాగంగా ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని, ఇది పారిశ్రామిక వేత్తలకు కొత్త ఉత్సాహాన్ని నింపుతుందనడంలో సందేహం లేదని వివరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య పెరుగుతోందని, దీని ప్రభావం ఎ.పి లోనూ ఉందన్న నగ్న సత్యాన్ని వారు చెప్పక తప్పలేదు. అయితే నూతన పాలసీల వల్ల ఉపాధి పెరుగుతుందని చెప్పడం డొల్లతనమే. ప్రస్తుత ఎనర్జీ పాలసీలో పెట్టుబడిదారులకు అనేక సానుకూల అంశాలు ఉన్నాయని, సోలార్ ఎనర్జీకి 25 శాతం, గ్రీన్ హైడ్రోజన్‌కు 30 శాతం సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించడంపట్ల వారు ఉబ్బి తబ్బిబ్బయారు.

రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలనుకుంటున్న పారిశ్రామిక విధానాలపై కార్మిక సంఘాలతో సమగ్రంగా చర్చించాలని, ఆ తర్వాతే తుది రూపం ఇవ్వాలన్న డిమాండ్లు న్యాయసమ్మతమైనవి. 20 లక్షల ఉద్యోగాలతో పాటు రూ.30 లక్షల కోట్లు పెట్టుబడులు రాబోయే ఐదేళ్లలో వస్తాయని చెప్పారు కానీ గతంలో విశాఖలో జగన్ మోహన్ రెడ్డి సమావేశం పెట్టి రూ. 24 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రకటించినా వాస్తవంగా వచ్చిన పెట్టుబడులెన్నో, ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందీ ఎవరూ చెప్పలేదు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడిచినా డిఎస్‌సి ఊసే లేదు. రాష్ట్రంలో 2.50 లక్షల ఎకరాలను సెజ్ పేర సేకరించారని, నేటికీ ఇవన్నీ ఖాళీగానే ఉన్నాయి. వాటిలో పరిశ్రమలనైనా నెలకొల్పాలి లేదా తిరిగి రైతులకు ఇచ్చేయాలి. 2008లో ఏర్పడిన కాకినాడ సెజ్‌లో నేటికీ ఒక్క పరిశ్రమ కూడా స్థాపించలేదు. ప్రకృతి వనరులను కార్పొరేట్ల పరం చేసేందుకే కేంద్రంలోని మోడీ పనిచేస్తుండగా ఇక్కడి కూటమి సర్కారు కూడా ఆ బాటనే సాగడం దారుణం. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలోవున్న అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రజల ఆమోదం లేకుండానే వందల ఎకరాలను ఆదానీకి కట్టబెట్టాలని చూస్తున్నారు. విశాఖ సెజ్‌లో రాత్రికి రాత్రి లాకౌట్ ప్రకటించడంతో 1000 మంది కార్మికులు వీధిన పడ్డారు. హిందూపురం, కాకినాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో వేలాది మంది మహిళలు 14 గంటల పాటు పని చేస్తున్నా కనీస వేతనాలు ఇవ్వడం లేదు. ఇలా చెబుతూ పోతే కార్మికుల కష్టాలెనెన్నో! ఉన్న పరిశ్రమలు మూత పడుతుంటే కొత్త పరిశ్రమలు ఎక్కడి నుంచి వస్తాయన్నది మరో ప్రశ్న. ఏది ఏమైనా ప్రభుత్వం కష్ట జీవులకు రక్షణ కల్పించే విధానాలు చేపట్టాలే తప్ప శతకోటీశ్వరులకు సేవ చెయ్యడం తగదు.

మంచి మాట



ప్రపంచం మారాలని మనం కోరుకోవడం కాదు. మార్పు మనతో మొదలైతే... ప్రపంచం అదే మారుతుంది.

- లియో టాల్‌స్టాయ్, ప్రసిద్ధ రచయిత

Leo Tolstoy

వ్యాఖ్య

మహిళలు, పిల్లలపై అత్యాచారాలు అడ్డుకోవాలి



మహిళలు, పిల్లలపై పెరుగుతున్న ఈ హింసకుగల కారణాలను అరికట్టడం కోసం...ఈ అంశంపై ఉద్యమం సాగించాలని... సెప్టెంబర్‌లో జరిగిన సిపిఎం కేంద్ర కమిటీ సమావేశం దేశ వ్యాపితంగా పార్టీ శాఖలన్నిటికీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా జరిగిన అమానుషాలపై కేంద్రీకరించడంతో పాటు... బాధ్యతల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన, తప్పులకు, పొరబాట్లకు కారణమైన పోలీస్ అధికారులు, ప్రభుత్వ బాధ్యులను శిక్షించడం వంటి డిమాండ్లను కూడా జత చేయాలి.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

'బేటీ బచావో' అనే నినాదాన్ని అపహాస్యం చేసేలా దేశంలో మహిళలు, బాలికల మీద అత్యాచారాలు, హత్యలు వేగంగా పెరిగి పోతున్నాయి. చాలా సందర్భాల్లో బాధితులు ముందుగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారినే వేధించడం, బలాత్కరించటం, హత్య చేయడం కూడా జరుగుతున్నది.

బిజెపి పాలిత రాష్ట్రాలలోనే అధికం

భారత దేశంలో ఇప్పుడు రోజుకు 86 అత్యాచారాలు, గంటకు 49కి పైగా నేరాలు జరుగుతున్నాయి. ఇవి ప్రధానంగా బిజెపి పాలనలోని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో జరుగుతున్నాయి. టి.ఎం.సి పాలనలోని బెంగాల్‌లో కూడా మహిళల పైన, పిల్లలపైన భయంకరమైన అత్యాచారాలు సంభవించాయి. కర్ణాటకలో బిజెపి కూటమికి చెందిన బలమైన ఒక రాజకీయ పార్టీ ఎంపీ (తర్వాత లోక్‌సభ ఎన్నికలలో ఓడిపోయాడు) వందలాది మంది మహిళల పైన అత్యాచారాలు చేయడమే కాక వాటిని చిత్రీకరించి వేధిస్తున్నట్లు బయటపడింది. బలైన వారిలో అనేకమంది ఆయన పార్టీకి చెందిన వారే.

బెంగాల్‌లో వెల్లువెత్తిన నిరసనలు

ఇలాంటి ఘటనలపైన అక్కడక్కడ నిరసనలు కొనసాగుతున్నాయి కానీ వాటి ప్రభావం పెద్దగా వుండటం లేదు. పశ్చిమ బెంగాల్‌లో డాక్టర్‌పై అమానుష అత్యాచారం, హత్యకు వ్యతిరేకంగా ప్రజ్వరిల్లిన నిరసన ఉద్యమం ఒక్కటే ఇందుకు మినహాయింపుగా ఉంది. ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్లు ప్రారంభించిన నిరసనకు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో వేలాది మంది స్త్రీ,పురుషుల మద్దతు లభించింది. దారుణాన్ని అడ్డుకోవడంలోనూ విఫలమవటమే కాక తర్వాత నేరస్తులను కాపాడడానికి కూడా సిద్ధమైన రాష్ట్ర ప్రభుత్వ పాత్రను ఈ నిరసన ఉద్యమం ఎండగట్టింది. పశ్చిమ బెంగాల్‌లో ప్రజ్వరిల్లిన ఈ మహా నిరసన నుంచి మన కామ్రేడ్లు నేర్చుకోదగిన అనేక పాఠాలు ఉన్నాయి. అన్ని చోట్లా కూడా కొన్ని ఉమ్మడి అంశాలు కనిపిస్తాయి. అత్యధిక చోట్ల ఇలాంటి ఘటనలలో పోలీసులు చేయవలసింది చేయకపోగా బాధితురాలు, కుటుంబ సభ్యుల ఫిర్యాదులను పూర్తిగా పెడచెవిన పెడుతున్నారు. దాంతో దుండగులు మరింత చెలరేగిపోయి వేధింపులకు దిగడం అత్యాచారాలకు తెగబడడం కూడా జరుగుతున్నది.

నేరస్థులకు పోలీసులు, ప్రభుత్వ అండ

ఇలాంటి సందర్భాల్లో మరో ఉమ్మడి లక్షణం ఏమంటే నేరస్థులు పాలక పార్టీకి చెందిన వారైతే రక్షణ కల్పించడం, చర్య తీసుకోకుండా వదిలివేయటం జరుగుతుంది. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఇది సర్వసాధారణ వ్యవహారంగా ఉంది. ఉత్తరప్రదేశ్‌లో ఒక మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన బిజెపి ఎమ్మెల్యేని అరెస్ట్ చేయడానికి హైకోర్టు, సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో అమ్మాయిలపై అత్యాచారానికి పాల్పడిన బిజెపి మీడియా సెల్ ప్రతినిధులు ముగ్గురుని విద్యార్థుల ఆందోళన తర్వాతే అరెస్ట్ చేశారు. అయితే వారిని కొద్ది మాసాల తర్వాత మళ్లీ వదిలిపెట్టారు. మరోవైపున నిరసన తెలిపిన ఆ విద్యార్థులను మటుకు బహిష్కరించి చదువుకునే అవకాశం లేకుండా చేశారు. బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం కేసులో...కేంద్రం, గుజరాత్ ప్రభుత్వం సిగ్గు మాలిన పాత్ర వల్ల...నిందితులకు పదేపదే బెయిల్ ఇప్పించడమే కాక శిక్ష నుండి మినహాయింపు కల్పించి విడుదల చేయటం చూశాం. అనేకమంది అమ్మాయిలపై అత్యాచారానికి, హత్యలకు పాల్పడిన బాబా రామ్ రహీంను హర్యానా ప్రభుత్వం పదేపదే బెయిల్‌పై విడుదల చేస్తూ హిందీ రాష్ట్రాల ఎన్నికలలో బిజెపికి ప్రచారం చేసేందుకు ఉపయోగించుకుంటున్నది.

మీడియాలో అనుచిత ధోరణి

చాలా సందర్భాల్లో ఇలాంటి ఘటనలను బయటకి తీసుకు రావడంలో ముఖ్య పాత్ర వహించే మీడియా కూడా తప్పు చేస్తుంటుంది. వీటిని నివేదించే సందర్భంలో లైంగిక దురహంకారం, పురుషాధిక్య ధోరణులు, అవమానకర భాషతో ఈ నేరం జరగడానికి బాధితులే కారణ మనీ అర్థం వచ్చేలా చేస్తుంది. సమాజంలో వ్యక్తులు బాధ్యతాయుత స్థానంలోని ప్రజాప్రతినిధులు, పోలీసులు, అధికారుల ప్రకటనలకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా ఈ పని జరుగుతుంది.

దేశవ్యాపిత ఉద్యమం

మహిళలు, పిల్లలపై పెరుగుతున్న ఈ హింసకుగల కారణాలను అరికట్టడం కోసం...ఈ అంశంపై ఉద్యమం సాగించాలని...సెప్టెంబర్‌లో జరిగిన సిపిఎం కేంద్ర కమిటీ సమావేశం దేశ వ్యాపితంగా పార్టీ శాఖలన్నిటికీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా జరిగిన అమానుషాలపై కేంద్రీకరించడంతో పాటు బాధ్యతల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన, తప్పులకు, పొరబాట్లకు కారణమైన పోలీస్ అధికారులు, ప్రభుత్వ బాధ్యులను శిక్షించడం వంటి డిమాండ్లను కూడా జత చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంలో కుమ్మక్కై ఉంటే దాన్ని కూడా పూర్తిగా బహిర్గతం చేయాలి. ఈ ఘటనలను మీడియా నివేదించే తీరును నిశితంగా పరిశీలిస్తుండాలి. బతికి బయటపడిన బాధితులకు, బాధిత కుటుంబాలకు తోడుగా నిలవాలి. వారికి న్యాయం జరిగేలా చూసేందుకు కృషి చేయాలి.

/ అక్టోబర్ 16 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం /

నివాళి

చివరిదాకా మహిళా చైతన్యం కోసమే...

కె. స్వరూపరాణి

లింగ వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థి దశ నుంచే ఉద్యమించి, సామాజిక, సాంస్కృతికోద్యమాల్లో చురుకైన పాత్ర పోషించిన జ్యోత్స్న భౌతికంగా మనకు దూరమయ్యారు. రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తను మృత్యువాత పడిందనే నిజాన్ని జీర్ణించుకోవడం కష్టంగా ఉంది. తన మరణం కుటుంబానికే కాదు. ఆమెతో అనుబంధం ఉన్న వారికి, మరీ ముఖ్యంగా మహిళా చైతన్యం కోసం తను స్థాపించి ముందుకు నడిపిస్తున్న సేఫ్, తరుణీ తరంగాలకు పూడ్చలేని లోటు.

కలిగినింట పుట్టినా ఏనాడూ ఆమె భేషజాలకు పోలేదు. విద్యార్థి దశ నుండి అసమాన తలు లేని సమాజాన్ని ఆశించి ఆ దిశగానే తుది వరకు తన ప్రయాణం సాగించింది. తండ్రి వృత్తిరీత్యా బదిలీలు వుండటంతో జోత్స్న బాల్యంలో పెద్దమ్మ సరోజనమ్మ దగ్గర పెరిగింది. విజయవాడ ఎస్.ఆర్.ఆర్, మాంటిస్సోరి, స్టెల్లా కాలేజీల్లో చదివి ఎం.ఏ పూర్తి చేసింది. మోటూరు హనుమంతరావు, ఉదయం గార్లతో సాన్నిహిత్యం తనను ఎంతగానో ప్రభావితం చేసింది.

విద్యార్థి దశ నుంచే అభ్యుదయ భావాలతో

'అధ్యయనం-పోరాటం' అనే ఎస్.ఎఫ్.ఐ నినాదాన్ని అందుకొని విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పని చేసింది. విద్యార్థినుల విభాగానికి కన్వీనర్‌గా చురుకైన పాత్ర వహించింది. మోటూరు ఉదయంగారి నాయకత్వంలో కరాటే శిక్షణా శిబిరానికి విద్యార్థినులను సమీకరించి తనూ శిక్షణలో పాల్గొంది. ఒకే భావజాలంగల, విద్యార్థి ఉద్యమంలో పని చేస్తున్న సుంకర రాజేంద్రప్రసాద్‌కు, జ్యోత్స్నకు 1982 మే 2వ తేదీన పెద్దల సమక్షంలో నిరాడంబ రంగా వివాహం జరిగింది. తర్వాత మహిళా సంఘం, సిపిఎం విజయవాడ నగర కమిటీలో సభ్యురాలిగా, ప్రజా ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యింది. నెల్లూరులో దూబగుంట రోశమ్మ ప్రారంభించిన సారా వ్యతిరేక ఉద్యమాన్ని మహిళా సంఘం రాష్ట్రవ్యాపిత పోరాటాలుగా నడిపిన నాడు విజయవాడ నగరం ఉద్యమంలో పోలీసుల లాఠీలు, ఆరెస్టులు ఎదుర్కొంది. విజయవాడ నగర అభివృద్ధి కమిటీ సభ్యురాలిగా స్థానిక సమస్యలను అధ్యయనం చేసి డిమాండ్లు రూపొందించి పరిష్కారానికి జరిగిన కృషిలో జ్యోత్స్న తనకు ఇచ్చిన బాధ్యతను నిర్వర్తించింది.

మహిళలకు బాసటగా

1992లో మానికొండ సూర్యావతి, బిక్షావతిగార్ల సారథ్యంలో బాధిత మహిళలకు అండగా కృష్ణా జిల్లా న్యాయ సలహా సంఘాన్ని స్థాపించాము. ఆ కౌన్సిలింగ్ సెంటర్‌ను వారానికి ఒక రోజు జ్యోత్స్న, నేను నిర్వహించే వాళ్లం. ఒంటరి మహిళలకు, ఆర్థిక ఇబ్బందులు ఉన్న మహిళలకు స్వయం ఉపాధి కల్పించే దిశగా కూడా ప్రయత్నించాం. 1998 నుండి 2001 వరకు ఫ్యామిలీ కోర్టు లోక్ అదాలత్‌లో సభ్యురాలిగానూ పనిచేసింది. న్యాయస్థానానికి వచ్చిన దంపతుల సమస్యలను పరిష్కరించడంలో చురుకైన పాత్ర వహించింది.

తరుణీ తరంగమై...

2018లో విజయవాడ నగరంలో అభ్యుదయ మహిళా సంస్థలు, వివిధ రంగాల్లో ఉన్న ప్రముఖలతో కలిసి 'తరుణీ తరంగాలు' ఏర్పాటు చేశాం. మహిళలు, యువతులు, విద్యార్థినుల్లో ఉన్న సృజనాత్మకతను, కళలను వెలుగులోకి తెచ్చేందుకు ఆ వేదిక ద్వారా ప్రయత్నం చేశాం. ఐదు సంవత్సరాలు నిర్విఘ్నంగా కల్చరల్, అకడమిక్ అంశాలను నిర్ణయించటంలోనూ, పోటీలను నిర్వహించటంలోనూ టీంతో పాటు జ్యోత్స్న ప్రధాన కార్యదర్శిగా చురుకైన పాత్ర పోషించింది.

మహిళా సాధికారత కోసం ...

2022లో 'మహిళా రక్షణ-సామాజిక బాధ్యత' అనే థీమ్‌తో "మహిళా సాధికారిత కోసం ఒక అడుగు ముందుకు వేద్దాం" (స్టెప్ ఎ హెడ్ ఫర్ ఈక్వాల్టీ-సేఫ్) అనే కాన్సెప్ట్‌తో స్వయంగా 'సేఫ్'ను స్థాపించింది. అనతి కాలంలోనే సుమారు 21 కాలేజీల్లో 'సేఫ్' కమిటీలు ఏర్పాటు చేసి విద్యా, వైజ్ఞానిక కార్యక్రమాలు నిర్వహించింది.

ఆలోచనల్లో నిత్య నూతనం

జ్యోత్స్న ప్రవహించే నదిలా నిత్య నూతనంగా కొత్త కొత్త ఆలోచనలతో ప్రణాళికలు సిద్ధం చేసేది. ఆమె సృజనాత్మకత, అధ్యయనం, క్రియాశీలత, పట్టుదల ప్రతి కార్యక్రమంలో వ్యక్తమయ్యేది. విజయవాడ నగరంలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, 'సేఫ్' మొదలైన 10 సంఘాలు కలిసి 2023, 2024 సంవత్సరాల్లో ప్రత్యామ్నాయ సంస్కృతిని అభివృద్ధి చేసేందుకు దసరా సాంస్కృతికోత్సవాలు ఘనంగా నిర్వహించాం. 2018 నుండి ఏటా జరుగుతున్నా అమరావతి బాలోత్సవాలు-పిల్లల పండుగలో ప్రత్యేక శ్రద్ధతో క్రియాశీల పాత్ర నిర్వహించింది. తీసుకున్న బాధ్యతను విజయవంతంగా నిర్వహించే జోత్స్న... విద్యార్థి, మహిళా ఉద్యమాల్లో, తరుణీ తరంగాలు, సేఫ్, దసరా ఉత్సవాలు, బాలోత్సవాల నిర్వహణలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకుంది.

ఇంటా బయటా సమన్వయం

బయట ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా కుటుంబానికీ అంతే బాధ్యతగా అన్నీ తానై నిలిచింది. పిల్లల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపింది. టెర్రస్ గార్డెన్, రూఫ్ గార్డెన్ నిర్వహణ తనదే. ఇంటికి వచ్చిన వారు గార్డెన్ చూసి అబ్బుర పడతారు. కుటుంబ వ్యవహారాలన్నీ జ్యోత్స్న సక్రమంగా నిర్వహించడటం వలన రాజేంద్ర గారు ఐలూ బాధ్యతలోనూ, ప్రాక్టీస్‌లోనూ ఆటంకం లేకుండా నిర్విఘ్నంగా కొనసాగించటానికి వీలు కల్గింది. అవకాశాలు లభిస్తే ఎందులోనైనా రాణించ గలమని కుటుంబ వ్యవహారాల్లోనూ, ఉద్యమాల్లోనూ తన ప్రతిభా పాటవాలను, సృజనాత్మకతను నిరూపించుకుంది.

... చివరి సంతోషాలు

సెప్టెంబర్ 26-28 తేదీలలో జరిగిన దసరా సాంస్కృతికోత్సవాలే జ్యోత్స్నతో కలిసి మేము పంచుకొన్న చివరి సంతోషాలు. అక్టోబర్ 1వ తేదీన బాలోత్సవ భవన్‌లో దసరా ఉత్సవాలపై చర్చించుకొన్నాం. సక్సెస్ మీట్ గురించి ప్రస్తావిస్తే నేను లేకపోయినా ఆలస్యం చేయకుండా వెంటనే జరపండని సలహా ఇచ్చింది. దసరా ఉత్సవాల ప్రారంభ సభలో సనాతన ఆచారాలు, మూఢనమ్మకాలు, మతం, కులం, యువతలో వస్తున్న మార్పులు, మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు, మహిళలపై హింస మొదలైన విషయాలపై ప్రసంగించింది. అదే తన చివరి ప్రసంగం. నాకు సంబంధించిన అన్ని విషయాల్లో విజయతో పాటు ఎంతో శ్రద్ధ వహించే జ్యోత్స్న అకాల మరణం తన కుటుంబంతో పాటు వ్యక్తిగతంగా నాకు కూడా తీరని లోటు. సాధికారిత కోసం పరితపించే శక్తులకు పెద్ద లోటు. జ్యోత్స్న ఆశయాలను ముందుకు తీసుకువెళ్లటమే మనం ఆమెకు ఇచ్చే నివాళి.

/వ్యాసకర్త ఐద్వా సీనియర్ నేత/

విశ్లేషణ

ఇలాంటి 'సనాతనుల' సరసనా మీరు చేరింది!



ఎం. కోటేశ్వరరావు

తాను పక్కా సనాతనవాదినంటూ పవన్ కల్యాణ్ ఊగిపోతూ చెప్పారు, చెబుతూనే ఉంటారు. ఎందుకంటే సనాతనవాదం పులి మీద స్వారీ వంటిది. ఒకసారి పులినెక్కిన వారు అది ఎక్కడికి తీసుకుపోతే అటు పోవాల్సిందే. ఊహలు, కంప్యూటర్ గ్రాఫిక్స్, సినిమాలు, సాహిత్యంలో తప్ప చరిత్రలో పులిని అదుపుచేసిన వారు ఎవరూ లేరు. పవన్ కల్యాణ్ ప్రస్థానం ఎలా ఉంటుందో చూద్దాం. వారాహి ప్రకటన సందర్భంగా చేసిన సనాతన విన్యాసాల మీద సామాజిక మాధ్యమంలో అనేక మంది అంతకంటే ఎక్కువగా స్పందించి చీల్చి చెండాడుతూ సంధించిన ప్రశ్నలకు ఎక్కడా సమాధానం రాలేదు. బహుశా ఇలా జరుగుతుందని అనుకొని ఉండరు.

పవన్ కల్యాణ్ సనాతన ధర్మం గురించి వ్యతిరేకంగా మాట్లాడిన వారి మీద విరుచుకుపడిన మాటలు ఇంకా చెవుల్లో గింగురు మంటుండగానే సనాతనులకు తామే బ్రాండ్ అంబాసిడర్లమని చెప్పుకొనే వారు చేసిన పనికి సభ్య సమాజం సిగ్గుపడింది. వారిలో కట్టర్ హిందూత్వవాదులు ఉండరనుకోండి. ప్రముఖ జర్నలిస్టు, పురోగామివాది, హిందూత్వ వ్యతిరేకి అయిన గౌరీ లంకేష్‌ను కాల్చి చంపిన కేసులో నిందితులైన పరశురామ్ వాగ్మోరే, మనోహర్ యెదవే అనే వారిని కర్ణాటక సనాతన లేదా హిందూత్వ శక్తులు విజయపురాలో 2024 అక్టోబరు 11న సన్మానించాయి. గౌరీ లంకేష్‌ను 2017 సెప్టెంబరు ఐదవ తేదీన కాల్చి చంపారు. బెంగళూరు సెషన్స్ కోర్టు అక్టోబరు తొమ్మిదవ తేదీన జారీ చేసిన ఆదేశాల మేరకు ఎనిమిది మంది నిందితులకు బెయిల్ మంజూరు చేసింది. దీంతో మొత్తం 18 మందిలో 16 మంది బెయిల్ మీద బయటకు వచ్చారు. మిగిలిన ఇద్దరిలో శరద్ కలాస్కర్ అనే వాడు మహారాష్ట్ర హేతువాది నరేంద్ర దబోల్కర్ హత్య కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న కారణంగా లోపలే ఉన్నాడు. వికాస్ పాటిల్ అనే వాడిని ఇంతవరకు అరెస్టు చేయలేదు. పైన పేర్కొన్న ఇద్దరు నిందితులు కన్నడ పత్రిక వార్తా భారతి కథనం ప్రకారం తమ స్వస్థలం విజయపుర వెళ్లినపుడు కాళికాదేవి గుడిలో పూజలు చేశారు. సంఘపరివార్ (ఆర్.ఎస్.ఎస్), శ్రీరామ్ సేన కార్యకర్తలు వారికి సన్మానం చేశారు. శివాజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ప్రసంగించిన హిందూత్వ నేతలు వారిద్దరినీ ఆరేళ్లుగా అన్యాయంగా జైల్లో ఉంచారని, విజయదశమి సందర్భంగా వారిని విడుదల చేయటం సంతోషమని పేర్కొన్నారు.

పవన్ కల్యాణ్ ఈ వార్తను చదివారో లేదో తెలియదు. ఒకవేళ చదివినా ఆ కేసులోని వారు ఇంకా నిందితులే తప్ప నేరం రుజువు కాలేదుగా అని లా పాయింట్ తీసి "సనాతనుల"ను సమర్థించవచ్చు. అందుకే మరికొన్ని ఉదంతాలను పేర్కొనాల్సి వస్తోంది. గుజరాత్‌లో బిల్కిస్ బానోపై గోద్రా అనంతర మారణకాండ సందర్భంగా సామూహిక అత్యాచారం చేసి ఆమె కుటుంబ సభ్యులందరినీ హత్య చేసిన సంగతి తెలిసిందే. అత్యాచార కేసులో నేరగాళ్లలో పరివర్తన కలిగి మంచివారుగా మారారంటూ అక్కడి సనాతనవాదుల ఏలుబడిలోని రాష్ట్ర ప్రభుత్వం జైలు నుంచి విడుదల చేసింది. ఆ సందర్భంగా వారిని సనాతన ధర్మాన్ని లేదా హిందూత్వను కాపాడేందుకు కంకణం కట్టుకున్నట్లు చెప్పుకొనే విశ్వ హిందూ పరిషత్ నేతలు వారికి సన్మానం చేసి, మిఠాయిలు పంచారు. సుప్రీం కోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు ప్రకారం అత్యాచారం కేసులో యావజ్జీవ శిక్ష పడిన వారు జైల్లో ఉండాల్సిందే. అయితే సదరు సదాచార సనాతనుల కేసులో ఆ తీర్పు రాక ముందే శిక్ష విధించినందున తరువాత వచ్చిన తీర్పు వారికి వర్తించదని, పాత నిబంధనల ప్రకారం వారి సత్ప్రవర్తకు మెచ్చి మేకతోలు కప్పి ముందుగానే జైలు నుంచి విడుదల చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. అయితే సుప్రీం కోర్టు ఆ చర్యను తప్పు పట్టి నేరగాళ్లను తిరిగి జైలుకు పంపింది. దేన్నయినా సమర్థించే బాపతు తయారవుతున్నారు. దీని మీద పవన్ కల్యాణ్ ఏమంటారో?

సకల కళావల్లభుడిగా పేరుగాంచిన హంతకుడు, ఇద్దరు మహిళలపై అత్యాచార నేరగాడు, ప్రవచనకారుడు గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ (డేరా బాబా) జీవిత ఖైదు అనుభవిస్తూ బెయిల్ మీద వచ్చినపుడు హర్యానా బిజెపి నేతలు ఆశీస్సులు పొందారు. అతగాడి అనుచరుల ఓట్లు పొందేందుకు గాను తాజా హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు ముందు పెరోల్ మీద బిజెపి ప్రభుత్వం విడుదల చేసిందనే విమర్శలు వచ్చాయి. 2018లో జమ్మూలోని కథువాలో ఒక బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారికి మద్దతుగా అక్కడ హిందూ ఏక్తా మంచ్ పేరుతో జరిపిన ప్రదర్శన తెలిసిందే. మహిళను దేవతగా కొలిచే సమాజంలో దాని గురించి రోజూ ప్రవచనాలు చెప్పే శక్తులే ఈ ఉదంతాలకు పాల్పడ్డాయంటే దేశం ఎటుపోతోందని కాదు, కొంత మంది ఎటు తీసుకుపోతున్నారో జనం ఆలోచించాలి. రామ్ రహీమ్‌కు 2017లో శిక్ష పడింది, అప్పటి నుంచి ఉత్తరాదిన ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ పెరోల్ ఇవ్వటం గమనించాల్సిన అంశం.

బిల్కిస్ బానో ఉదంతంలో నేరస్థులను సమర్థించటంలో మతాన్ని కూడా జోడించిన దుర్మార్గం, దాన్ని నిస్సిగ్గుగా సమర్థించిన ఉన్మాదం కనిపిస్తుంది. వారంతా సనాతనులే. మతాలతో నిమిత్తం లేకుండా అత్యాచారం ఎవరి మీద జరిగినా దాన్ని ఖండించాల్సిందే. తమ నేతల ప్రమేయం ఉన్న ఉదంతాల పేరెత్తటానికి సనాతన నరేంద్రమోడీ సిగ్గుపడి ఉంటారు. 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఢిల్లీ నిర్భయ కేసును పేరు పెట్టి ప్రస్తావించిన ఆ పెద్దమనిషి తమ ఏలుబడిలో జరిగిన కథువా, ఉన్నావో అత్యాచారాల తరువాత మాట్లాడుతూ సాధారణ పరిభాషలో ఖండించారే తప్ప వాటి ప్రస్తావన ఎక్కడా తేలేదు. ఎందుకంటే కథువా ఉదంతంలో నిందితులకు మద్దతుగా బిజెపి మంత్రులు కూడా ప్రదర్శనల్లో పాల్గొన్నారు. వారిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాల్సి ఉండగా విమర్శలు పెరగటంతో తీరికగా తరువాత రాజీనామా చేయించారు. ఉన్నావో ఉదంతంలో బిజెపి ఎంఎల్‌ఏ దోషి, ఇప్పుడు జీవితకాల ఖైదు శిక్ష అనుభవిస్తున్నాడు. ఏమీ తెలియని అమాయకుడు, అన్యాయంగా ఇరికించారంటూ అతగాడిని రక్షించేందుకు అనేక మంది ఎంఎల్‌ఏలు, బిజెపి పెద్దలు, పోలీసులు ఎన్నో ప్రయత్నాలు చేశారు.

హర్యానాలోని ఆరు జిల్లాలు, పక్కనే ఉన్న పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో డేరా బాబా అనుచరులు ఉన్నారు. ప్రధానంగా దళిత సామాజిక తరగతికి చెందిన వారు. వారి ఓట్ల కోసం పడేపాట్లు ఇవి. వ్రతం చెడ్డా బిజెపికి ఫలం దక్కలేదని పరిశీలకులు చెబుతున్నారు. డేరా బాబా పలుకుబడి ఉందని భావిస్తున్న ఆరు జిల్లాల్లో 28 అసెంబ్లీ సీట్లుండగా బిజెపి గెలిచింది పది చోట్ల మాత్రమే, కాంగ్రెస్ 15 గెలుచుకుంది. గత రెండు సంవత్సరాల్లో రాష్ట్ర బిజెపి ప్రభుత్వం డేరాబాబాకు పదకొండుసార్లు బెయిల్ ఇచ్చి బయటకు వదిలింది. ఏడు సార్లు వేర్వేరు చోట్ల ఎన్నికలకు ముందు బెయిల్ ఇచ్చారు. తాజాగా ఎన్నికలకు కొద్ది రోజుల ముందు అదే జరిగింది. బిజెపికి ఓటు వేయాల్సిందిగా అనుచరులకు సందేశం పంపాడు. అతగాడి ఆశ్రమం ఉన్న సిర్సా జిల్లాలోని ఐదు అసెంబ్లీ సీట్లలో బిజెపికి ఒక్కటి కూడా దక్కలేదు.

సనాతనవాదుల మందలో కొత్తగా చేరిన పవన్ కల్యాణ్ తాను ఎన్నో చదివానని చెప్పిన తరువాత ఆ వాదాన్ని భుజాన వేసుకున్నారు గనుక అమాయకుడని అనుకోలేం. సినిమా రంగం మనిషి. అక్కడ ఏ ఫార్ములా నాలుగు డబ్బులు తెస్తే పోలోమంటూ మిగతావారూ దాన్నే అనుసరిస్తారు. సనాతనం-హిందూత్వ ఫార్ములా ఓట్లు రాల్చేదిగా ఉందని బిజెపి దాన్ని ఎప్పటి నుంచో రంగంలోకి తెచ్చింది. సవ్యసాచి మాదిరి సినిమాలతో పాటు రాజకీయాలను కూడా చేయాలనుకుంటున్నారు గనుక పవన్ కల్యాణ్ సనాతన ఫార్ములాను ఎంచుకున్నారని భావించవచ్చు. దీని వెనుక ఉన్న కారణాల గురించి కూడా చర్చ జరుగుతున్నది. మర్రి చెట్టు వంటి చంద్రబాబు నాయుడి నీడలో ఎంతకాలం ఉన్నా ఎదుగూ బొదుగూ ఉండదు కనుక తాను ప్రత్యేకంగా కనిపించాలంటే సనాతనాన్ని భుజాన వేసుకున్నట్లు కొందరు చెబుతున్నారు. తెలుగుదేశం పార్టీ మద్దతు మీద ఆధారపడిన తాము ఎ.పి లో హిందూత్వ ఎజెండా అమలు జరిపితే రాజకీయంగా ఇబ్బందులు తలెత్తవచ్చు గనుక శిఖండిలా పవన్ కల్యాణ్‌ను రంగంలోకి దించిందని కూడా చెబుతున్నారు. కొంత మంది తాము వేదాలను ప్రమాణంగా తీసుకుంటామని అదే సనాతన ధర్మమని అందమైన ముసుగు వేసుకుంటారు. ఇది వేదకాలం కాదు, మనువాదులు అమలు జరుపుతున్న కుల, మత సమాజం. వేదాలను ప్రామాణికంగా తీసుకొనే వారేమీ కులమతాలకు అతీతంగా లేరు గనుక ఉన్న దుర్మార్గపూరిత వ్యవస్థను ఏదో ఒక పేరుతో సమర్థించేవారిగానే పరిగణించాలి.

అంబేద్కర్ దృష్టిలో సనాతన ధర్మం అంటే వేద, బ్రాహ్మణిజం అన్నది స్పష్టం. ఆయన కాలంలో కులమతాలు, అంతరాలు లేవని చెబుతున్న వేదకాలం లేదూ వేదాలకు అనుగుణంగా పాలనా లేదు. మనువాదం మాత్రమే ఉంది. అందుకే వేదాల జోలికి పోకుండా మనుధర్మ శాస్త్రాన్నే తగులబెట్టారు. మనువాదులు తాము చెప్పేదానినే సనాతన ధర్మమని భాష్యం చెబుతున్నారు, ఇప్పటికీ మన కళ్ల ముందు కనిపిస్తున్నది వారే. అందువలన ఎవరైనా సనాతనాన్ని వ్యతిరేకిస్తున్నారంటే మను ధర్మాన్ని వ్యతిరేకిస్తున్నట్లే, విమర్శించేవారిని సహించబోమని, దాన్ని పరిరక్షించాలని పవన్ కల్యాణ్ వంటి వారు చెబుతున్నారంటే అంబేద్కర్‌ను కూడా వ్యతిరేకించుతున్నట్లే. ఉనికిలో లేని వేదకాల సనాతనంతో ఎవరికీ ఇబ్బంది లేదు, అమలులో ఉన్న మనుసనాతనం, అది సృష్టించిన వివక్షను నిర్మూలించాలా లేదా?

సందిగ్ధంలో సాగునీటి సంఘాల ఎన్నికలు

- 16న నోటిఫికేషన్ విడుదల అర్థాంతరంగా వాయిదా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై అట్టహాసంగా ప్రకటనలు గుప్పించిన ప్రభుత్వం ఇప్పుడు మౌనం వహించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 16న సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. అయితే, ఆ తర్వాత దీనినిఅర్థాంతరంగా వాయిదా వేశారు. ఎందుకు వాయిదా వేశారో? తిరిగి ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల చేస్తారో కనీస సమాచారం కూడా ఇవ్వలేదు. దీంతో, సాగునీటి సంఘాల ఎన్నికలను సాగదీస్తారా? వెంటనే నిర్వహిస్తారా? అనే అనుమానాలు రైతుల్లో నెలకొన్నాయి. విభజిత జిల్లాల వారీగా సాగునీటి సంఘాల ఎన్నికలను నిర్వహించనున్నట్లు ప్రభుత్వం చెప్పింది. దీంతో, అందుకు సంబంధించిన ప్రక్రియను ఇరిగేషన్ అధికారులు పూర్తి చేశారు. ఏలూరు జిల్లాలో మేజర్ ఇరిగేషన్‌లో 92 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, మీడియం ఇరిగేషన్‌లో 11 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్‌లో 253 వాటర్ యూజర్స్ అసోసియేషన్లకు ఎన్నికలు జరపాల్సి ఉంది. ఎన్నికైన కమిటీలు తమ్మిలేరు, ఎర్ర కాలువకు సంబంధించిన రెండు ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటాయి. పశ్చిమగోదావరి జిల్లాలో మేజర్ ఇరిగేషన్‌లో 98 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు, మైనర్ ఇరిగేషన్‌లో 14 వాటర్ యూజర్స్ అసోసియేషన్లు ఉన్నాయి. యూజర్స్ కమిటీలు 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటాయి. ఈ కమిటీలు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకోనున్నాయి. జిల్లాల వారీగా కమిటీల విభజనకు సంబంధించిన ప్రక్రియ ముగిసింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ కాలేదు.

ఓటర్ల జాబితా ఏదీ?

ఎన్నికల నిర్వహణకు విధివిధానాలు ఉంటాయి. ముందుగా ఓటర్ల జాబితా తయారు చేయాలి. దానిపై అభ్యంతరాలను స్వీకరించి తర్వాత తుదిజాబితా ప్రకటించాలి. ఓటర్ల జాబితా సిద్ధమైన తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, నిర్వహణ ప్రక్రియ వంటివి సాగుతాయి. ఇప్పటి వరకూ సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాను అధికారులు విడుదల చేయలేదు. ఈ జాబితాను రెవెన్యూ అధికారులు సిద్ధం చేయాల్సి ఉంది. వాటర్ యూజర్స్ కమిటీ పరిధిలో ఉన్న ఆయకట్టును పరిగణనలోకి తీసుకుని ఎంతమంది రైతులు ఉన్నారో తేల్చాలి. జాబితాను తయారు చేసి అభ్యంతరాలు స్వీకరించాలి. పొలాలు విక్రయించిన వారి ఓట్లు ఉంటే వాటిని తొలగించి ఆ పొలం కొనుగోలు చేసిన రైతుల పేర్లు ఓటర్ల జాబితాలో చేర్చాలి. ఒక యూజర్ కమిటీ పరిధిలో ఎక్కువగా అనుకుంటే వెయ్యి ఎకరాల వరకూ ఉండొచ్చని అంచనా. 150 మంది రైతులు వరకూ ఉండొచ్చు. ఒక్కో జిల్లాలో మేజర్, మైనర్ ఇరిగేషన్ వాటర్ యూజర్స్ కమిటీలు 112 వరకూ ఉన్నాయి.

ఫైనల్లోకి న్యూజిలాండ్

డాటిన్ మెరుపులు వృథా
ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్

షార్జా: ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్లోకి న్యూజిలాండ్ జట్టు దూసుకెళ్లింది. చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా 'నువ్వా నేనా' అన్నట్టు సాగిన రెండో సెమీ ఫైనల్లో న్యూజిలాండ్ ఎనిమిది పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను చిత్తుచేసి ఫైనల్‌కు దూసుకెళ్లింది. స్వల్ప ఛేదనలో టాపార్డర్ విఫలమైనా.. ఆల్‌రౌండర్ డియాండ్ర డాటిన్(33) విజయావకాశాలపై ఆశలు రేపింది. కానీ, ఈడెన్ కార్సన్(3/29), అమేలియా కేర్(2/14)లు తిప్పేయడంతో కరీబియన్ హిట్టర్లు తలొంచక తప్పలేదు. న్యూజిలాండ్ నిర్దేశించిన స్వల్ప ఛేదనలో వెస్టిండీస్ తడబడింది. ఇంగ్లండ్‌పై చెలరేగిన ఓపెనర్ క్వియానా జోసెఫ్ (12)ను కార్సన్ బౌల్డ్ చేసి న్యూజిలాండ్‌కు బ్రేకిచ్చింది. ఆ తర్వాత హేలీ మాథ్యూస్(15), షెమైనే క్యాంప్‌బెల్లె(3)లు ఆచితూచి ఆడడంతో.. పవర్ ప్లేలో విండీస్ స్కోర్.. 25 మాత్రమే. అనంతరం బంతి అందుకున్న కార్సన్.. స్టఫానీ టేలర్(13)ను బౌల్డ్ చేసి మూడో వికెట్ ఖాతాలో వేసుకుంది. 10 ఓవర్లు అయినా స్కోర్ 50 దాటకపోవడంతో ఒత్తిడి పెరిగిపోయింది. ఈ క్రమంలోనే డీప్ మిడ్ వికెట్ దిశగా భారీ షాట్ ఆడిన మాథ్యూస్(15) అమేలియా చేతికి చిక్కింది. దాంతో, కరీబియన్ జట్టు కీలక వికెట్ కోల్పోయింది. ఇక జట్టును గెలిపించే బాధ్యత తీసుకున్న డియాండ్ర డాటిన్(33) రెండు లైఫ్స్ లభించాయి. అయినా కివీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయగా 4.5 ఓవర్ల పాటు ఒక్క బౌండరీ రాలేదు.మైర్ వేసిన 15వ ఓవర్లో ఫ్లెచర్ (17) బౌండరీ బాదగా.. ఆ తర్వాతి తహుహుకు డాటిన్ సిక్సర్‌తో ముగించింది.

టాస్ గెలిచిన న్యూజిలాండ్ బ్యాటింగ్ తీసుకుంది. కెప్టెన్ సోఫీ డెవిన్ నమ్మకాన్ని నిలబెడుతూ ఓపెనర్లు సుజీ బేట్స్(26), జార్జియా ప్లిమ్మెర్(33)లు ధంచి కొట్టారు. దాంతో, పవర్ ప్లేలో కివీస్ స్కోర్ పరుగులు తీసింది. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని కరిష్మా రామ్‌హరాక్ విడదీసింది. ఆ కాసేపటికే ప్లిమ్మెర్‌ను ఫ్లెచర్ బోల్తా కొట్టించింది. అంతే.. అక్కడితో న్యూజిలాండ్ స్కోర్ నెమ్మదించింది. కెప్టెన్ సోఫీ డెవిన్(12), బ్రూక్ హల్లిడే(18)లు విండీస్ బౌలింగ్ దళాన్ని సమర్థంగా ఎదుర్కొంటూ ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేశారు. డియాండ్రా డాటిన్ (4/22) విజంభణతో నెమ్మదించిన న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌కు వికెట్ కీపర్ ఇజబెల్లా గేజ్(20 నాటౌట్) ఊపు తెచ్చింది. డెత్ ఓవర్లలో ధనాధన్ ఆడిన ఆమె జట్టు స్కోర్ 120 దాటించింది. ఇజబెల్లా మెరుపులతో కివీస్ జట్టు 9 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కార్సన్‌కు దక్కింది. ఆదివారం(20న) జరిగే ఫైనల్లో టైటిల్‌కై దక్షిణాఫ్రికాతో తలపడనుంది.

ఉధృతంగా గార్గేయ నదీ ప్రవాహం

- మూడుచోట్ల కొట్టుకుపోయిన కల్వర్టులు
- ఏడు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు

ప్రజాశక్తి-సోమల (చిత్తూరు)

తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పెద్ద ఉప్పరపల్లి, అన్నెమ్మగారిపల్లి, పేటూరు పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో వాగు పొంగి ప్రవహించాయి. దీంతో గురువారం రాత్రి గార్గేయ నది ఉధృతంగా ప్రవహించింది. నదీ ప్రవాహానికి గ్రామాలకు అనుసంధానంగా నిర్మించిన తాత్కాలిక కల్వర్టులు కొట్టుకుపోయాయి. ఏడు గ్రామాలకు శుక్రవారం ఉదయం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. బోన మంద, చిన్నకంపల్లి, రెడ్డివారిపల్లి, పొలిటిమాకులపల్లి, చింతతోపు, పేటూరు, బసవపల్లి గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. సమాచారం అందుకున్న జిల్లా ఉన్నతాధికారులు నది ప్రాంతాలను పరిశీలించారు. తాత్కాలిక కల్వర్టులు కొట్టుకుపోవడంతో ఏడు గ్రామాలకు చెందిన దాదాపు 500 నుంచి 600కుటుంబాల వారు నిత్యవసర సరుకుల కోసం, విద్యార్థులు పాఠశాలలకు రావడానికి, ఆసుపత్రులకు రావడానికి శుక్రవారం నానా ఇబ్బంది పడ్డారు. బోనమంద పేటూరు గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే ఉపాధ్యాయులు కూడా వరద ఉధృతి దాటుకుని విధులకు హాజరయ్యారు. ఏది ఏమైనా పెద్ద ఉప్పరపల్లి ప్రాంతంలో ఎప్పుడు వర్షాలు అధికంగా కురవడం అటవీ సమీప ప్రాంతాలు ఎక్కువగా ఉండడం కారణంగా శాశ్వత ప్రాతిపదికన రోడ్ల నిర్మాణాలు, బ్రిడ్జిలు, కల్వర్టులు నిర్మిస్తే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

జిల్లాలో కొట్టుకుపోయిన కల్వర్టు

ట్రస్ట్ ఎంఎఫ్ నుంచి స్మాల్ క్యాప్ ఫండ్

బి-షెడ్యూల్ : పైన పేర్కొన్న ఐటమ్ నెం. 1 నందు మొత్తం స్థలము నందు నిర్మించిన 'భవ్య రెసిడెన్సీ' అపార్ట్‌మెంట్స్ నందు గ్రౌండ్ ఫ్లోర్ నందు ఫ్లాట్ నెం. జి.ఎఫ్-2 కి చెందిన నివాస ఫ్లాట్. హద్దులు : తూర్పు : శూన్యాకాశము, దక్షిణం : శూన్యాకాశము, పడమర : కామన్ కారిడార్, ఉత్తరం : శూన్యాకాశము. పైన తెలిపిన నాలుగు సరిహద్దుల మధ్యగల ఫ్లాట్‌కి ఫ్లింత్ ఏరియా 916 చ॥అ॥, కామన్ ఏరియా ఫ్లింత్ ఏరియాతో కలిపి 40 చ॥అ॥లు 'భవ్య రెసిడెన్సీ'కి చెందినది.

తేది : 17-09-2024
ప్రదేశం : లబ్బీపేట
చీఫ్ మేనేజర్ / అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

22న రష్యాకు ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : రష్యా ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెల ఈ నెల 22, 23 తేదీల్లో ఆ దేశంలో పర్యటించనున్నారు. కజన్‌లో జరగనున్న 16వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనాల్సిందిగా రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ మోడీని ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో మోడీ రష్యా పర్యటన ఖరారైందని విదేశాంగ శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో సభ్య దేశాల ప్రతినిధులతో మోడీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించేవీలుంది. 'అంతర్జాతీయ అభివృద్ధి, భద్రతల కోసం బహుళవాదాన్ని బలోపేతం చేయడం' అన్నది ఈ ఏడాది బ్రిక్స్ సదస్సు ప్రధాన ఉద్దేశంగా వుంది. కీలకమైన అంతర్జాతీయ సమస్యలపై చర్చించేందుకు ఇదొక ముఖ్య వేదిక కానుందని విదేశాంగ శాఖ పేర్కొంది. బ్రిక్స్ సభ్య దేశాలు చేపట్టిన పలు చొరవల పురోగతిని సమీక్షించేందుకు ఇదొక విలువైన అవకాశమని, అలాగే భవిష్యత్ సహకారానికి ముఖ్యమైన రంగాలను గుర్తించడానికి కూడా వీలు వుంటుందని తెలిపింది.

ఇషా ఫౌండేషన్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట

- హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ నిలిపివేత

న్యూఢిల్లీ : మహిళలను అక్రమంగా నిర్బంధించారంటూ వివాదస్పద అధ్యాత్మిక గురువు జగ్గీ వాసుదేవ్ నిర్వహిస్తున్న ఇషా ఫౌండేషన్‌పై విమర్శలు వచ్చిన నేపథ్యంలో దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు శుక్రవారం ముగించింది. ఏవరైనా వ్యక్తి కనపడకపోతే, లేదా అక్రమ నిర్బంధంలో ఉన్నట్లు భావిస్తే సదరు వ్యక్తిని కోర్టు ముందు హాజరు పర్చాలని దాఖలు చేసే పిటిషన్‌ను హెబియస్ కార్పస్‌గా పిలుస్తారు. ఇషా ఫౌండేషన్‌లో తన ఇద్దరు కుమార్తెలు (ఒకరి వయస్సు 42 ఏళ్లు, మరోకరి వయస్సు 39 ఏళ్లు) అక్రమంగా బంధీలుగా ఉంచారని పేర్కొంటూ 70 ఏళ్ల వృద్ధుడు ఈ హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మద్రాసు హైకోర్టులో కొన్ని రోజులు విచారణ సాగింది. అనంతరం సుప్రీంకోర్టుకు చేరింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. బాధితులుగా పేర్కొన్న ఇద్దరు మహిళలు తమ స్వీయ అభీష్టం మేరకే సన్యాసినులుగా జీవిస్తూ ఇషా ఫౌండేషన్‌లో వున్నామని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సుప్రీంకోర్టుకు తెలియజేశారు. దీంతో కోర్టు ఈ పిటిషన్‌పై విచారణను ముగించింది. తమను కలిసిన తమిళనాడు పోలీసులకు కూడా వారు ఈ విషయం తెలియచేశారు. ఇద్దరు మహిళలు మేజర్లు అయినందున తల్లిదండ్రులు వారిని నియంత్రించలేరని ధర్మాసనం పేర్కొంది. పైగా తల్లిదండ్రులు, పెరిగిన పిల్లల మధ్య వుండాల్సిన వ్యక్తిగత బంధాలను చట్టపరమైన తీర్పులు, చర్యలు ద్వారా నిర్దేశించలేరని జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. ఆ మహిళలను బందీలుగా వుంచితే కోర్టు సర్వ శక్తులను ఒడ్డి చర్యలు తీసుకునేదని, కానీ వారు తాము బందీలం కాదని, తమను ఎవరూ ఒత్తిడి చేయలేదని స్పష్టం చేసిన తర్వాత ఈ నిర్ధారణకు రావాల్సి వచ్చిందని సిజెఐ తెలిపారు.

మోడీపై మళ్లీ ప్రశంసలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రుల పనితీరుపై ఐవిఆర్ఎస్ ద్వారా సమాచారం తీసుకుంటామని తెలిపారు. ప్రజలనుంచి వస్తున్న వినతుల పరిష్కారంపై పర్యవేక్షణకు మంత్రులతో సబ్ కమిటీ వేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. పట్టభద్రుల ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఓట్ల నమోదుకు ఇంకా 19 రోజులు సమయం మాత్రమే ఉందన్నారు. మంత్రులు జిల్లాలకు వెళ్లినప్పుడు ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ అధ్యక్షులకు తప్పకుండా సమాచారం ఇవ్వాలని చెప్పారు.

26 నుంచి సభ్యత్వ నమోదు

ఈనెల 26 నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. దేశంలోనే మొట్టమొదటిసారి కార్యకర్తలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. సాధారణ సభ్యత్వ రుసుం ఎప్పటి లాగే రూ.100, ఈ ఏడాది నుంచి కొత్తగా లైఫ్ టైమ్ సభ్యత్వాన్ని ప్రవేశపెడుతున్నామని, సభ్యత్వ రుసుము రూ.1 లక్షగా నిర్ణయించామన్నారు. మెంబర్ షిప్ ఉన్న వారు చనిపోతే అందించే ఇన్సూరెన్స్ రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచుతున్నామన్నారు. చనిపోయిన కార్యకర్తల మట్టి ఖర్చులకింద రూ.10 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రమాద బీమా కింద ఇప్పటి వరకు రూ.102 కోట్లు, సహజమరణం, ఇతర సమస్యలకు రూ.18కోట్లు సాయం అందించామన్నారు.

రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలి

- తీర్మానాన్ని ఆమోదించిన జమ్మూకాశ్మీర్ కేబినెట్
- తొలి సమావేశంలో నిర్ణయం

జమ్మూకాశ్మీర్ తొలి కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్ : కేంద్రపాలిత ప్రాంతం(యూటీ) జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హెూదాను పునరుద్ధరించాలని కోరుతూ జమ్మూకాశ్మీర్ కొత్త ప్రభుత్వం ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన రెండు రోజులకే నిర్వహించిన తొలి మంత్రివర్గ సమావేశం రాష్ట్ర హోదా పునరుద్ధరణను అత్యంత ప్రాధాన్యతాంశంగా భావించి, ఈ మేరకు తీర్మానం చేసింది. నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమి తన ఎన్నికల మ్యానిఫెస్టోలో జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి తిరిగి సాధిస్తామని స్పష్టంగా పేర్కొంది.. కేబినెట్ తీర్మానాన్ని ప్రతిపక్ష బిజెపి, పిడిపి విమర్శించాయి. . రాష్ట్ర హెూదాను కోరటం ద్వారా 2019, ఆగస్టు 5న కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఒమర్ అబ్దుల్లా పరోక్షంగా సమర్థిస్తున్నారని పిడిపి నేత వాహీద్-ఉర్-రెహమాన్ పెర్రా ఆరోపించారు. ఆర్టికల్ 370పై ఎలాంటి తీర్మానం చేయలేదని ఆయన విమర్శించారు.

మంత్రులకు శాఖల కేటాయింపు

ఒమర్ అబ్దుల్లా తన కేబినెట్‌లోని ఐదుగురు మంత్రులకు శుక్రవారం శాఖలు కేటాయించారు. ఐదుగురు మంత్రుల్లో ఇద్దరు కాశ్మీర్ లోయ నుంచి, మరో ముగ్గురు జమ్మూ ప్రాంతం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

జమ్మూకాశ్మీర్ ఉప ముఖ్యమంత్రి సురిందర్ కుమార్ చౌదరీకి పబ్లిక్ వర్క్స్ (రోడ్లు మరియు బిల్డింగ్‌లు), పరిశ్రమలు, కామర్స్, మైనింగ్, లేబర్, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి శాఖలు దక్కాయి. సకీనా మసూద్ ఇటూకు వైద్యారోగ్యం, విద్య, స్కూల్ ఎడ్యుకేషన్, హయ్యార్ ఎడ్యుకేషన్, సోషల్ వెల్ఫేర్‌లు వచ్చాయి. జావెద్ అహ్మద్ రానా.. జల్‌శక్తి, అటవీ, ఎకోలజీ, పర్యావరణం, గిరిజన వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు దక్కాయి. వ్యవసాయ ఉత్పత్తి, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, సహకార, ఎలక్షన్ మంత్రిగా జావిద్ అహ్మద్ దర్‌కు బాధ్యతలు అందాయి. జమ్మూ ప్రాంతంలోని ఛంబ్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన మంత్రి సతీశ్ శర్మకు ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, రవాణా, సైన్స్ అండ్ టెక్నాలజీ, సమాచార సాంకేతిక, యువజన సర్వీసులు, క్రీడలు, ఏఆర్ఐ అండ్ ట్రైనింగ్స్ శాఖలను ఒమర్ కేటాయించారు.

ఆప్ నేత సత్యేంద్ర జైన్‌కు బెయిల్

న్యూఢిల్లీ : మనీ లాండరింగ్ కేసులో మాజీ మంత్రి, ఆప్ నేత సత్యేంద్ర జైన్‌కు ఢిల్లీ కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. విచారణలో జాప్యాన్ని, సుదీర్ఘకాలం ఆయన జైల్లో మగ్గాల్సి రావడాన్ని ఈ సందర్భంగా కోర్టు ప్రస్తావించింది. జైన్‌కు సంబంధించిన నాలుగు కంపెనీల ద్వారా మనీ లాండరింగ్ జరిగిందన్న ఆరోపణలపై 2022 మే 30న ఇడి ఆయనను అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ కస్టడీలో వున్నారు. నిందితుడు, ఇడిల నుండి అందిన పిటిషన్లపై ఉభయ పక్షాల వాదనలు విన్న అనంతరం ప్రత్యేక న్యాయమూర్తి రాకేష్ స్యాల్ తన తీర్పును రిజర్వ్ చేసుకున్నారు. జైన్‌ను ఇంకా కస్టడీలో కొనసాగించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని జైన్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. విచారణలో జాప్యం, 18 మాసాల సుదీర్ఘ కారాగారవాసం, విచారణ ప్రారంభం కావడానికి ఇంకా సమయం పడుతుందన్న వాస్తవం ఇవన్నీ చూస్తుంటే నిందితుడికి బెయిల్ ఇవ్వడం ద్వారా ఉపశమనం కలిగించాలని భావించాల్సి వస్తోందని ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే వ్యాఖ్యానించారు. రూ.50 వేల బెయిల్ బాండ్, అంతే మొత్తానికి రెండు పూచీకత్తులతో న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు.

కాగా ఇడి, జైన్ పిటిషన్‌ను తిరస్కరించింది. జైన్‌ను విడుదల చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం వుందని, లేదా పారిపోతారని హెచ్చరించింది. జైన్‌కు బెయిల్ లభించిన వెంటనే 'సత్యమేవ జయతే' అంటూ ఆప్ వ్యాఖ్యానించింది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. మొహల్లా క్లినిక్‌లు ఏర్పాటు చేయడం ద్వారా ఢిల్లీలో ఆరోగ్య రంగ విప్లవం తీసుకువచ్చిన జైన్‌కు బెయిల్ ఇవ్వడంతో బిజెపి పన్నిన మరో కుట్ర విఫలమైందని వ్యాఖ్యానించింది. దీంతో బిజెపి వాస్తవ రూపం బయటపడిందని పేర్కొంది.

క్యాబినెట్ నిర్ణయానికి
గవర్నర్ కట్టుబడివుండాల్సిందే

- మద్రాస్ హైకోర్టు పునరుద్ఘాటన

చెన్నయ్ : రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాలను పాటించటానికి గవర్నర్ రాజ్యాంగబద్ధంగా కట్టుబడి ఉండాలని మద్రాసు హైకోర్టు పునరుద్ఘాటించింది. తనను త్వరగా విడుదల చేయాలంటూ జీవితఖైదు అనుభవిస్తున్న ఒక ఖైదీ వేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. పై విధంగా స్పందించింది. ఒక హత్య కేసులో పుఝల్ జైలులో పిటిషనర్ వీరభారతి జీవితఖైదు అనుభవిస్తున్నారు. తనను త్వరగా విడుదల చేయాలంటూ మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. తాను ఇప్పటికే 20 ఏండ్లు జైలులో శిక్షను అనుభవించాననీ, సత్ప్రవర్తన కింద తనను విడుదల చేయాలంటూ అంతకముందు జైళ్లశాఖ డిజిపి నేతృత్వంలోని కమిటీకి పిటిషన్‌ను సైతం అందిచారు. ఇవే నేరాలకు సంబంధించి దోషులుగా తేలిన ఖైదీలు త్వరగానే విడుదలయ్యారని వీరభారతి వాదించారు. పూర్తి రివ్యూ తర్వాత రాష్ట్ర కమిటీ తన విడుదలకు సిఫారసు చేసిందని వివరించారు. ఈ సిఫారసును సీఎంకు పంపించటం, ఆ తర్వాత రాష్ట్ర క్యాబినేట్ ఆమోదం పొంది తుది అనుమతి కోసం గవర్నర్ వద్దకు వెళ్లిందని పేర్కొన్నాడు. అయితే, తన విడుదలకు గవర్నర్ ఆమోదం తెలపలేదని వీరభారతి వివరించారు. న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.ఎం సుబ్రహ్మణ్యం, జస్టిస్ వి. శివజ్ఞానం లతో కూడిన ధర్మాసనం.. భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో దోషి అయిన పెరారివాలన్ వంటి కేసులను ఉటంకించింది. ఈ నేపథ్యంలో గవర్నర్ విషయంలో కోర్టు పై విధంగా కీలక వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయానికి అనుగుణంగా వ్యవహరించాల్సిన బాధ్యత గవర్నర్‌కున్నదని న్యాయస్థానం నొక్కి చెప్పింది. మరోపక్క, వీరభారతి పిటిషన్‌ను పునర్విచారణకు ఆదేశించిన ధర్మాసనం.. ఆయనకు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. తమిళనాడు ప్రభుత్వానికి, రాష్ట్ర గవర్నర్‌కు మధ్య గత కొంత కాలంగా సఖ్యత లేని విషయం విదితమే. ఈ నేపథ్యంలో మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

పోరు ఆగదు!

- స్పష్టం చేసిన హమాస్ డిప్యూటీ చీఫ్ ఖలీల్
- బందీలను విడిచిపెడితే యుద్ధం ముగింపు : నెతన్యాహు

హౌతీలకు, హమాస్ సాయుధులకు మద్దతు వెల్లువ : ఇజ్రాయిల్ యుద్ధోన్మాద దాడులను వ్యతిరేకిస్తూ యెమెన్‌లోని హౌతీలకు, గాజా స్ట్రిప్‌లోని హమాస్ సాయుధులకు మద్దతుగా యెమెన్ రాజధాని సానాలో భారీ ప్రదర్శనలు నిర్వహించారు. వేలాది మంది ప్రజలు ఈ ర్యాలీల్లో పాల్గొన్నారు. ఇజ్రాయిల్ బలగాలు హత్య చేసిన హమాస్ అధినేత సిన్వార్ చిత్రాలను పలు కూడళ్లలో ఏర్పాటు చేశారు.

గాజా, బీరుట్ : దక్షిణ గాజాలోని రఫా నగరంలో సైనిక బలగాల ఆపరేషన్‌లో హమాస్ చీఫ్ యాహ్యా సిన్వర్‌ను చంపేశామని, సంబరపడుతున్న నెతన్యాహు, బైడెన్‌లకు హమాస్ గట్టి హెచ్చరిక చేసింది. నాయకత్వాన్ని నిర్మూలించినంత మాత్రాన పోరు ఆగదని హమాస్ డిప్యూటీ చీఫ్ ఖలీల్ స్పష్టం చేశారు. సిన్వర్ మృతి చెందిన విషయాన్ని హమాస్ శుక్రవారం ధ్రువీకరించింది. గాజాపై దాడులను ఆపి, బలగాలను మొత్తంగా ఉపసంహరించుకునేంతవరకు బందీలను విడిచిపెట్టే ప్రసక్తే లేదని టివి ప్రసంగంలో ఆయన స్పష్టం చేశారు. పాలస్తీనా విముక్తి జరిగేవరకు ఈ పోరు ఆగదని పునరుద్ఘాటించారు.. దీనికి ఇజ్రాయిల్ ప్రధాని, ఫాసిస్టు నెతన్యాహు స్పందిస్తూ బందీలను విడిచిపెడితే యుద్ధం ముగిస్తానని చెప్పారు. ఏడాది కాలంగా సాగుతున్న యుద్ధాన్ని ముగించడానికి ఇది ఆరంభం మాత్రమేనని అన్నారు.

ఎవరీ సిన్వర్ ?

దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ శరణార్థ శిబిరంలో 1962లో సిన్వర్ జన్మించారు. అప్పటికి ఈ ప్రాంతమంతా ఈజిప్ట్ నియంత్రణలో వుండేది. 1948లో ఇజ్రాయిల్ ఆవిర్భావం సందరభంగా అరబ్బు జాతి ప్రక్షాళన పెద్ద ఎత్తున జరిగిన పాలస్తీనియన్ నక్బా (విపత్తు) సమయంలో యూదు శక్తులు సిన్వర తల్లిదండ్రులను దేశం నుండి బహిష్కరించారు. 1980వ దశకంలో ఇజ్రాయిల్ ఆయనను అరెస్టు చేసి. కిడ్నాపులు, హత్యలు వంటి పలు కేసులు బనాయించింది. ఈ కేసుల్లో ఆయనకు యావజ్జీవ శిక్ష విధించింది. జైలు నుంచి బయటకు వచ్చిన సిన్వర్ తొలుత ముస్లిం బ్రదర్ హుడ్ పార్టీలో పనిచేశాడు.. షేక్ అహ్మద్ యాసిన్ ప్రేరణతో ఇజ్రాయిల్ దురాక్రమణకు వ్యతిరేకంగా బలమైన ప్రతిఘటన నిర్మించేందుకు హమాస్‌లో చేరాడు. ఇతర నాయకుల్లా విదేశాల్లో నివాసం ఏర్పాటు చేసుకోవడం కాకుండా ఉత్తర గాజాలోనే ఉంటూ హమాస్ శ్రేణులకు అందుబాటులో ఉండేవారు. గాజాలో కాల్పుల విరమణకు జరిగిన దౌత్య చర్చల్లో కీలక పాత్ర పోషించాడు. మీడియా ఫ్రెండ్లీగా ఉండేవాడు. ఇజ్రాయిల్ దురాక్రమణదారుల కోసం పనిచేస్తున్నాడన్న అనుమానం రావడంతో సోదరుడు అని కూడా చూడకుండా అతడిని అంతమొందించాడు.

22ఏళ్ళ పాటు ఇజ్రాయిల్ జైళ్ళలో

హమాస్ అంతర్గత భద్రతా విభాగం అల్ మజిద్‌ను ఏర్పాటు చేసిన ఘనత ఆయనదే. ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్, భద్రతా సర్వీసు అధికారులను గుర్తించడం, వారిని మట్టుబెట్టడం వంటి పనులన్నీ చక్కబెట్టడం ఈ విభాగం బాధ్యత. హమాస్ మిలటరీ విభాగం అల్ ఖసమ్ బ్రిగేడ్‌లను ఏర్పాటు చేసింది కూడా సిన్వరే. ఇజ్రాయిల్‌తో కుమ్మక్కైన 12మంది పాలస్తీనియన్లను హతమార్చినందుకు, ఇజ్రాయిల్ సైనికులిద్దరిని కిడ్నాప్ చేసి, హత్య చేశారన్న అభియోగంపై 1988లో సిన్వర్‌ను ఇజ్రాయిల్ అరెస్టు చేసింది. ఇజ్రాయిల్‌లోని వివిధ జైళ్ళల్లో 22ఏళ్ళ పాటు గడిపి చివరగా పెద్ద ఎత్తున ఖైదీల మార్పిడి ఒప్పందం కింద 2011లో విడుదలయ్యారు. తిరిగి హమాస్‌లో చేరి కిందిస్థాయి నుండి ఎదుగుతూ వచ్చి 2017లో హమాస్ నేత ఇస్మాయిల్ హనియెకు వారసుడిగా బాధ్యతలు చేపట్టారు. ఇరాన్‌లో హనియెను హతమార్చిన నేపథ్యంలో ఈ ఆగస్టులో హమాస్ పొలిట్‌బ్యూరో చీఫ్‌గా ఎన్నికయ్యారు.గతేడాది అక్టోబరు 7నాటి దాడికి పథక రూపకల్పన 2022 డిసెంబరులోనే జరిగిందని భావిస్తున్నారు. సిన్వర్ హత్యను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఖండించడానికి బదులు హర్షం వ్యక్తం చేశాడు. ఇందుకుగాను నెతన్యాహును గురువారం అభినందించాడు. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కూడా హమాస్ చీఫ్ హత్యను సమర్ధించుకొచ్చారు. హమాస్‌ను, దాని నాయకత్వాన్ని నిర్మూలించే హక్కు ఇజ్రాయిల్‌కు ఉందని బైడెన్ బాహాటంగానే వ్యాఖ్యానించారు. హమాస్‌ను రూపుమాపాలన్న ఇజ్రాయిల్ లక్ష్య సాధన దిశగా ఇదొక గొప్ప ముందడుగుగా కమలా హారిస్ పేర్కొన్నారు. మాజీ అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు దురాగతాలను పూర్తిగా వెనకేసుకొచ్చారు. సిన్వర్ హత్యపై అమెరికా గూఢచారి సంస్థ సిఐఎ మాజీ డైరక్టర్ లియో పనెట్టా దీనిని ఇజ్రాయిల్ ఉగ్రవాద చర్యగా పేర్కొన్నారు. సెప్టెంబరు 17,18 తేదీల్లో విచక్షణా రహితంగా కమ్యూనికేషన్ పరికరాలు (వాకీ టాకీ, పేజర్లు)ను పేల్చివేయడం కచ్చితంగా ఉగ్రవాద చర్యేనని అన్నారు. అంతర్జాతీయ చట్టాలను ఇజ్రాయిల్ బాహాటంగా ఉల్లంఘించిందని అన్నారు. ఆ తరువాత హమాస్, హిజ్బుల్లా అగ్రనాయకులను, మిలిటరీ అధిపతులను వరుసగా హత్య చేయడం మరీ దారుణమని పనెట్టా వ్యాఖ్యానించారు. 2004లో ఇజ్రాయిల్ దాడి చేసి హమాస్ నాయకుడు షేక్ అహ్మద్ యాసిన్‌తో సహా తొమ్మిది మంది పౌరులను చంపినప్పుడు మాట వరసకైనా అప్పటి అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్ ఖండించాడు. ఇప్పుడు లెబనాన్‌లో ఇజ్రాయిల్ అంచనా ప్రకారమే 300 మంది పౌరులను చంపిన నెతన్యాహు, గురువారం నాడు సిన్వర్‌ను హత్య చేస్తే బైడెన్ ఖండించడానికి బదులు సంతోషం వ్యక్తం చేశాడు. పాశ్చాత్య మీడియా కూడా నెతన్యాహు దాష్టీకాన్ని కప్పిపుచ్చి నెతన్యాహు లక్ష్యం నెరవేరిందన్నట్లుగా వ్యాఖ్యానించాయి.

వడ్డీ రేట్ల తగ్గింపు ప్రమాదకరం

- ఈ దశలో కోత పెట్టలేము
- అధిక ద్రవ్యోల్బణమే కారణం
- ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్



న్యూఢిల్లీ : ప్రస్తుత పరిస్థితుల్లో వడ్డీ రేట్ల తగ్గింపు ప్రమాదకరమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. దేశంలో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ (సిపిఐ) 5.5 శాతంగా ఉందని.. తదుపరి మరింత పెరగొచ్చని అన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన బ్లూమ్‌బర్గ్ ఇండియా క్రెడిట్ ఫోరమ్‌లో శక్తికాంత మాట్లాడుతూ.. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్నప్పుడు వడ్డీ రేట్లను తగ్గించడం ప్రమాదం అవుతుందన్నారు. ద్రవ్యోల్బణ లక్ష్యం 4 శాతం వద్ద స్థిరంగా ఉంటుందనే విశ్వాసం నెలకొన్నప్పుడే వడ్డీ రేట్ల తగ్గింపునపై ఆర్‌బిఐ ఆలోచిస్తుందన్నారు. రేట్ల తగ్గింపును తాము ముందుగా ఊహించడం లేదన్నారు. ద్రవ్యోల్బణ గణంకాల కోసం వేచి చూడాల్సిందేనన్నారు. వచ్చే ఆరు నెలలు లేదా ఒక సంవత్సరంలో ద్రవ్యోల్బణం ఎలా ఉంటుందో చూడాలని.. దాని ఆధారంగా తాము చర్య తీసుకుంటామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వడ్డీ రేట్ల తగ్గింపునపై ముందుగా మాట్లాడటమంటే తెలివి తక్కువ పనే అవుతుందన్నారు. ఇతర దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు వడ్డీ రేట్లను తగ్గిస్తున్నప్పటికీ.. తాము ఆ పని చేయలేమన్నారు. "మేము ఇతర దేశాల వ్యవస్థాగత బ్యాంకులు ఏమి చేస్తున్నాయో చూస్తున్నాము, ముఖ్యంగా అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు ప్రపంచంలోని దాదాపు ప్రతి ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. ప్రధానంగా దేశీయ ద్రవ్యోల్బణం, వృద్ధి, స్థూల ఆర్థిక పరిస్థితిపై మా నిర్ణయాలు ఆధారపడి ఉంటాయి" అని శక్తికాంత తెలిపారు. గడిచిన సెప్టెంబర్‌లో ద్రవ్యోల్బణం సూచీ 5.49 శాతానికి ఎగిసింది. అహార ద్రవ్యోల్బణం భారీగా పెరిగింది. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే డిసెంబర్‌లోని ఆర్‌బిఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షలోనూ వడ్డీ రేట్లు దిగిరాకపోవచ్చని తెలుస్తోంది.

రూపాయి 11 శాతం క్షీణత

అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గుతోందని శక్తికాంత దాస్ అన్నారు. అవకాశం ఉన్నప్పుడల్లా తాము డాలర్లను కొనుగోలు చేస్తున్నామన్నారు. మార్కెట్లో డాలర్ కొరత ఉన్నప్పుడు తాము ఆ కరెన్సీని మార్కెట్లోకి విడుదల చేయడం ద్వారా రూపాయి విలువను స్థిరంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నామన్నారు. "జనవరి 2022 నుండి ఇప్పటి వరకు డాలర్‌తో పోలిస్తే రూపాయి దాదాపు 11.5 శాతం క్షీణించింది. ఈ కాలంలో డాలర్ సుమారు 8-8.5 శాతం పెరిగింది. దీంతో రూపాయి విలువ తగ్గింది." అని దాస్ తెలిపారు. విదేశీ మారకం నిల్వల పెంపుదలపై దృష్టి పెడుతున్నామని దాస్ తెలిపారు. నేటి ప్రపంచంలో ప్రతీ దేశం తన స్వంత భద్రతా వలయాన్ని నిర్మించుకోవాలని తాము భావిస్తున్నామన్నారు. ఆ నేపథ్యంలో మార్కెట్ అవకాశం ఇచ్చినప్పుడల్లా ఆర్‌బిఐ మారకం నిల్వలను పెంచుకుంటుందన్నారు.

తగ్గిన విదేశీ మారకం నిల్వలు..

వరుసగా రెండో వారంలోనూ భారత విదేశీ మారకం నిల్వల్లో తగ్గుదల చోటు చేసుకుంది. ఆర్‌బిఐ శుక్రవారం వెల్లడించిన గణంకాల ప్రకారం.. అక్టోబర్ 11తో ముగిసిన వారంలో విదేశీ మారకం నిల్వలు ఏకంగా 10.74 బిలియన్ డాలర్లు తరిగిపోయి 690.43 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకుంది. ఇంతక్రితం వారంలోనూ 3.709 బిలియన్ డాలర్లు తగ్గాయి. సెప్టెంబర్ ముగింపు నాటికి రికార్డ్ స్థాయిలో 704.885 బిలియన్లుగా ఉన్నాయి.

కేరళ కళాశాల ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ జయభేరి

- సిపిఎం అభినందనలు

తిరువనంతపురం : కేరళలోని పలు విశ్వవిద్యాలయాల పరిధిలో జరిగిన కళాశాల సంస్థాగత విద్యార్థి సంఘ గుర్తింపు ఎన్నికల్లో భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) జయభేరి మోగించింది. కేరళలోని ప్రధాన విశ్వవిద్యాలయాలైన కన్నూరు వర్సిటీ, కాలికట్ వర్సిటీ, మహాత్మాగాంధీ వర్సిటీ, కేరళ వర్సిటీలన్నింటా కళాశాల గుర్తింపు సంఘ ఎన్నికల్లోనూ ఎస్ఎఫ్ఐ జయకేతనం ఎగురవేసింది. ఎస్ఎఫ్ఐ విజయం పట్ల సిపిఎం హర్షం వ్యక్తం చేసింది. విజేతలందరికీ అభినందనలు తెలిపింది.

కన్నూర్ విశ్వవిద్యాలయం పరిధిలో కాసరగోడ్, కన్నూరు, వయనాడ్ జిల్లాల్లోని 65 కళాశాల్లో ఎన్నికలు జరగగా ఎస్ఎఫ్ఐ 45 కాలేజీల్లో గెలుపొందింది. కన్నూరు వర్సిటీలో నిర్వహించిర రెండో విడత ఎన్నికల్లో ఐదు డిపార్ట్‌మెంటల్ కేంద్రాల్లోనూ ఎస్ఎఫ్ఐకే విద్యార్థులు పట్టం కట్టారు.

కాలికట్ విశ్వవిద్యాలయంలో పరిధిలోనూ ఎస్ఎఫ్ఐ ఘన విజయం సాధించింది. ఈ వర్సిటీ పరిధిలో 171 కాలేజీల్లో ఎన్నికలు నిర్వహించగా 102 కాలేజీల్లో ఎస్ఎఫ్ఐ విజయపతాక ఎగురవేసింది. వీటిలో 20 కాలేజీల్లో ఏకగ్రీవంగా విజయం సాధించింది.

మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరిధిలో 129 కళాశాల్లో 104 చోట్ల విద్యార్థులు ఎస్ఎఫ్ఐకి పట్టం కట్టారు. వీటిలో 62 కాలేజీల్లో ఎస్ఎఫ్ఐ ఏకగ్రీవంగా ఎన్నికైంది. కేరళ విశ్వవిద్యాలయంలోనూ ఎస్ఎఫ్ఐ తిరుగులేని విజయాన్ని సాధించింది. ఈ వర్సిటీ పరిధిలో 77 కాలేజీల్లో ఎన్నికలు జరగగా 64 చోట్ల ఎస్ఎఫ్ఐ పతాకం రెపరెపలాడింది. ఇదివరకే పాలిటెక్నిక్ కాలేజీ యూనియన్ ఎన్నికల్లోనూ, స్కూల్ పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఎస్ఎఫ్ఐ జయభేరీ మోగించింది. చాలా కళాశాల్లో అన్ని గర్ల్స్ ప్యానెళ్లను ఎస్ఎఫ్ఐ సొంతం చేసుకొని చరిత్ర సృష్టించింది.

రాజ్యాంగ పదవిలో ఉండి కూడా ఎస్ఎఫ్ఐపై అపనిందలు మోపిన రాష్ట్ర గవర్నరుకు, అలాగే అసత్య కథనాలతో దుష్ప్రచారం సాగించిన బూర్జువా మీడియాకు విద్యార్థులు ఈ విజయం ద్వారా చెంప పెట్టులాంటి సమాధానమిచ్చారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఇకపై అన్ని కేసుల విచారణ ప్రత్యక్ష ప్రసారం

- సుప్రీంకోర్టు నిర్ణయం
- త్వరలో యాప్ ద్వారా అందుబాటులోకి

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు చరిత్రలో మరో కొత్త అధ్యాయం మొదలు కానుంది. ఇకపై సుప్రీంలో జరిగే అన్ని కేసుల విచారణను లైవ్ స్ట్రీమింగ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం రూపొందించిన యాప్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ఈ క్రమంలో లోటుపాట్లను సవరించి త్వరలో అమలులోకి తీసుకురానున్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం రాజ్యాంగ ధర్మాసనం కేసుల విచారణ ప్రత్యక్ష ప్రసారం ప్రారంభమైంది. యూట్యూబ్ వేదికగా వాటిని ప్రసారం చేస్తున్నారు. ప్రత్యక్ష ప్రసారంలో తొలి విచారణ 'సేన విఎస్ సేన' కేసుపై జరిగింది. మహారాష్ట్ర శివసేన పార్టీలో శిండే వర్గం తిరుగుబాటు, ఠాక్రే నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం కూలిపోవడం వంటి పరిణామాలపై సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. అసలైన శివసేన తమదేనంటూ ఠాక్రే, శిండే వర్గాల మధ్య పోరు నెలకొన్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. కేసుల విచారణలను లైవ్ స్ట్రీమింగ్ చేయడానికి అనుకూలంగా సుప్రీంకోర్టు 2018లోనే నిర్ణయం తీసుకున్నప్పటికీ.. ఆచరణలోకి రాలేదు. అయితే, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎన్‌వి రమణ పదవీ విరమణ రోజు.. ఆయన నేతృత్వంలోని ధర్మాసనం కార్యకలాపాలను దేశ ప్రజలంతా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. సుప్రీంకోర్టు కార్యకలాపాలను ప్రత్యక్ష ప్రసారం చేయడం అదే తొలిసారి. ఆ తర్వాత రాజ్యాంగ ధర్మాసనం విచారణలను లైవ్ స్ట్రీమింగ్ చేయాలని రెండేళ్ల క్రితం నిర్ణయం తీసుకుంది. ఈ చారిత్రక నిర్ణయంతో పౌరసత్వ సవరణ చట్టం, ఆర్టికల్ 370 వంటి కీలక కేసులకు సంబంధించిన విచారణల వంటివాటిని దేశ ప్రజలంతా ప్రత్యక్షంగా వీక్షించారు.

బాల్య వివాహాల కట్టడికి మార్గదర్శకాలు జారీ

న్యూఢిల్లీ : బాల్య వివాహాల కట్టడికి సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలు జారీ చేసింది. పర్సనల్ లాతో సంబంధం లేకుండా బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని అమలు చేయాలని సూచించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని పర్సనల్ లా (మత సంబంధిత చట్టాలు)తో నిర్వీర్యం చేయవద్దని వెల్లడించింది. ఇలాంటి వివాహాలతో మైనర్లకు వారి జీవితాన్ని ఎంచుకొనే స్వేచ్ఛను ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించింది. బాల్య వివాహాల నిరోధం, మైనర్‌ల రక్షణపై అధికారులు దృష్టిసారించాలని, చివరి ప్రయత్నంగా నిందితులకు జరిమానా విధించాలని తెలిపింది. 'బాల్య వివాహాలను నివారించాలనే వ్యూహాలు వివిధ వర్గాలకు అనుగుణంగా ఉండాలి. బహుళ రంగాల మధ్య సమన్వయం ఉన్నప్పుడే చట్టం విజయవంతం అవుతుంది. పోలీసులు, దర్యాప్తు అధికారులకు దీనిపై శిక్షణ సామర్థ్యాన్ని పెంచాలి. కమ్యూనిటీ ఆధారిత విధానాలు ఉండాలి' అని ధర్మాసనం పేర్కొంది. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని 2006లో రూపొందించారు.

పోలీసుల అదుపులో ట్రాంగ్

స్థిరాస్తి అక్రమాలపై వియత్నాం ఉక్కుపాదం

- రియల్ ఎస్టేట్ దిగ్గజం ట్రాంగ్‌కు యావజ్జీవం

హనోయ్ : వియత్నాంలో స్థిరాస్తి అక్రమాలపై, అవినీతి కార్యకలాపాలపై అక్కడి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఈ క్రమంలోనే రియల్ ఎస్టేట్ దిగ్గజం ట్రాంగ్ మై లాన్ కోట్లాది రూపాయిల మేరకు అవినీతికి పాల్పడిన కేసులో దోషిగా తేలారు. అవినీతిపై ప్రభుత్వ అణచివేత చర్యల్లో భాగంగా ఈ కేసు తెరపైకి వచ్చింది. మరో కేసులో 12,500 కోట్ల డాలర్ల మేరకు అవినీతి చర్యలు చేపట్టినందుకు హోచిమిన్ నగర కోర్టు ఇప్పటికే ట్రాంగ్ మై లాన్‌ను ఏప్రిల్‌లో దోషిగా నిర్ధారించింది. ఈ మొత్తం దేశ స్థూల దేశీయోత్పత్తిలో దాదాపు 3 శాతంగా వుంది. ఈ కేసులో మరణ శిక్ష విధించారు. ఆమెపై అనేక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో విచారణలను రెండు భాగాలుగా చేశారు. గురువారం ఇచ్చిన తీర్పు కింద గరిష్ట కాలం జైలు శిక్ష అనుభవించాల్సి వుంది. కాగా తన మరణశిక్ష తీర్పునకు వ్యతిరేకంగా అప్పీల్ చేసిన ఆమె తీర్పు కోసం ఎదురుచూస్తున్నారు. తన కెరీర్‌లో ఇదొక యాక్సిడెంట్ అని ఆమె వ్యాఖ్యానించినట్లు ఆన్‌లైన్ వార్తాపత్రిక విఎన్‌ఎక్స్‌ప్రెస్ వ్యాఖ్యానించింది. తన చర్యల వల్ల వేలాది కుటుంబాలు ప్రభావితమయ్యాయన్న విషయం మర్చిపోనని ఆమె వ్యాఖ్యానించారు. ఈ కేసులో మరో 33 మందిని కూడా విచారించారు. కానీ వారి తీర్పుల వివరాలు వెంటనే తెలియరాలేదు.

మీకోసం

చెప్పులు, బూట్లు కరుస్తుంటే ఆ భాగానికి పెరుగు రాసి రాత్రంతా ఉంచి తెల్లారి ఎండిన పెరుగును దులిపి పాద రక్షలు ధరించాలి.

జీవన సౌరభం

పనిచేసిన ప్రతిసారీ సత్ఫలితాలు రాకపోవచ్చు గాని, అసలు ప్రయత్నమే చేయకపోతే ఏ ఫలితమూ రాదు.

మంచి మిత్రులు

మహాదేవపురం అనే గ్రామంలో ఓ ముసలవ్వ ఉంది. తనకున్న కొద్దిపాటి స్థలంలో రకరకాల చెట్లను, ఆకుకూరలను పెంచుతూ.. పండ్లను, ఆకు కూరలను సంతలో అమ్ముతుంది. అయితే అవ్వ చెట్లకు కాసిన పండ్లన్నిటినీ కోయకుండా కొన్నిటిని పక్షుల కోసం ఉంచేది. ఈ క్రమంలో చెట్లపై నివాసాలు ఏర్పర్చుకున్న పక్షులకు, ముసలవ్వకి మధ్య మంచి స్నేహం కుదిరింది. పక్షులైతే చెట్ల కొమ్మలపై ఎక్కి ఊగుతూ మరిన్ని పళ్ళు కింద రాలిపడేలా చేసేవి. అవ్వకి ఆ పక్షుల సవ్వడితో ఒంటరిననే బాధ పోయింది. రోజూ వాటితో కబుర్లు చెబుతూ కాలక్షేపం చేస్తోంది. ప్రతిరోజూ తనకు వండుకున్న ఆహారంలో కొంత భాగం పక్షులకు పెడుతుంది. ఇంకా బయటినుంచి వరి కంకులు, ఇతర ధాన్యపు గింజలు తెచ్చి వేసేది. పక్షులు కూడా అవ్వతో కలిసిమెలిసి ఎంతో సంతోషంగా ఉంటున్నాయి.

ఓ రోజు చెట్లపై ఉన్న పక్షి గూడు వైపు ఓ పెద్ద పాము వెళ్లడం అవ్వ గమనించింది. వెంటనే పెద్ద కర్ర తీసుకుని దానిని తరిమికొట్టింది. ఆ విషయం తెలుసుకున్న పక్షులన్నీ, అవ్వకు తమ రెక్కలను శబ్దం చేస్తూ కృతజ్ఞతలు తెలిపాయి. ఓ రోజు అవ్వ ఎండిపుల్లలను ఏరి మోపులు కడుతోంది. అక్కడే ఆకుల కింద ఉన్న ఓ పెద్ద తాచుపాము అవ్వ కాళ్ళ దగ్గరకి వెళ్తుండడం కొన్ని పక్షులు గమనించాయి. వెంటనే అవి గట్టిగా అరుస్తూ మిగతా పక్షులను కూడా పిలుస్తూ ఆ పామును వాటి ముక్కుతో పొడుస్తూ తరిమాయి. పాము ప్రాణ భయంతో పారిపోయింది. అవ్వ తనకి జరగబోయిన పెద్ద ప్రమాదాన్ని తన మిత్రులైన పక్షులు ఎంతో తెలివిగా తప్పించినందుకు సంతోషించింది.

- పేలూరి వెంకట మీనాక్షి,
99126 01765.



లెక్క పెట్టండి

పిల్లలూ, ఇక్కడ బొమ్మల రూపంలో కొన్ని లెక్కలు ఇచ్చాం. బొమ్మల సంఖ్యను బట్టి ఒక్కో వరుస జవాబును మీరు రాయండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ

బి.మధుశ్రీ,
8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
సిద్దిపేట.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

స్ట్రాంగ్ గర్ల్ ఆఫ్ ఇండియా 'సాదియా'

గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలోని ఇస్లాంపేట (తెనాలి రోడ్డు)కు చెందిన షేక్ సందాని, తల్లి రిజ్వానా కుమార్తె సాదియా అల్మాస్ 2002, అక్టోబర్ 27న జన్మించారు. ఆమె ప్రస్తుతం కెఎల్ యూనివర్శిటీలో ఎంబిఎ ఆఖరి సంవత్సరం చదువుతున్నారు. సివిల్ సర్వీసెస్‌లో రాణించాలనే లక్ష్యంతో బిఎను కెఎల్ యూనివర్శిటీలో అభ్యసించారు. ప్రాథమిక విద్యను మంగళగిరి అరవింద పబ్లిక్ స్కూలులోనూ, ఇంటర్మీడియట్‌ను విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వరి సిద్ధార్థ మహిళా కళాశాలలో, మంగళగిరి విజెలో పూర్తిచేశారు. చిన్నప్పటి నుంచి సాదియాకు ఆటలంటే ఎంతో ఇష్టం. కబడ్డీ, వెయిట్‌లిఫ్టింగ్ వంటి ఆటల్లో ప్రావీణ్యం చూపించేవారు. ఇది గమనించిన తల్లిదండ్రులు ఆటల పోటీల్లో ప్రోత్సహించారు. సాదియా తండ్రి సందాని కూడా పవర్ లిఫ్టర్. సందాని పవర్ లిఫ్టింగ్ అకాడమీ పేరుతో ఆయన ఎంతోమందికి గత 25 సంవత్సరాలుగా పవర్ లిఫ్టింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్‌కు కార్యదర్శిగా ఉన్న తండ్రి ప్రోత్సాహంతో సాదియా పవర్‌లిఫ్టింగ్ వైపు ఆకర్షితులయ్యారు. మొదట గుంటూరు జిల్లాస్థాయిలో జరిగిన పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నారు. అందులో పతకాలు సాధించటంతో ఆమెలో ఆత్మ విశ్వాసం పెరిగింది. తండ్రి గమనించి ఆమెను జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపేలా ప్రోత్సహించారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదిగారు. ఎపి స్టేట్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు గంటా వెంకటేశ్వరరావు, సెక్రటరీ సకల సూర్యనారాయణ, సౌత్‌జోన్ సెక్రటరీ ఎస్.కోటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు మద్ది ప్రభాకర్, గుంటూరు జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, మిగతా సభ్యులు తమవంతుగా ప్రోత్సాహాన్ని అందించారు. దీంతో సాదియా మొక్కవోని దీక్షతో సాధన చేస్తూ, పతకాల పంట పండిస్తోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా విదేశాలకు పోటీలకు వెళ్లటానికి సాదియా ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్ రూ.3 లక్షల వరకూ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సాదియా అక్క షేక్ ఆసియా కూడా పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారిణే.

కామన్‌వెల్త్ పోటీల్లో ...

దక్షిణాఫ్రికా సన్‌సిటీలో ఈ నెల 4 నుంచి 13వ తేదీ వరకు జరిగిన కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్ పోటీల్లో షేక్ సాదియా అల్మాస్ 57 కిలోల అండర్ జూనియర్ విభాగంలో స్క్వాట్ –185 కిలోల పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం, బెంచ్‌ప్రెస్ 95 కిలోలు, డెడ్‌లిఫ్ట్ 180 కిలోలు ఓవరాల్‌గా 460 కిలోలు లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు సాధించారు. ప్రపంచం మొత్తం గర్వించేలా అక్కడి పోటీలు నిర్వహించే ప్రతినిధులు 'స్ట్రాంగ్ గర్ల్ ఆఫ్ ఇండియా' అంటూ పొడగ్తలతో ముంచెత్తారు.

వరల్డ్ చాంఫియన్‌గా...

మాల్టా దేశంలో ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 8 వరకూ జరిగిన జూనియర్ వరల్డ్ మెన్ అండ్ ఉమెన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంఫియన్‌షిప్‌లో సాదియా అల్మాస్ 57 కేజీల విభాగంలో ఓవరాల్ చాంఫియన్‌గా గోల్డ్ మెడల్ సాధించారు. స్క్వాట్ 190 కేజీలు, బెంచ్ ప్రెస్ 97.5 కేజీలు, డెడ్ లిఫ్ట్ 175 కేజీలు మొత్తంగా 462.5 కేజీల బరువు ఎత్తారు. బంగారు పతకం సాధించటం ద్వారా భారతదేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారు. యుఎఇలోని షార్జాలో 2023 ఆగస్టు 17 నుంచి 21 వరకూ జరిగిన 'ఆసియన్ యూనివర్శిటీ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్‌లో చాంఫియన్‌షిప్‌లో మొదటిస్థానంలో నిలిచి మొత్తం నాలుగు బంగారు పతకాలను గెల్చుకున్నారు. స్క్వాట్ 142.5 కేజీలు, బెంచ్‌ప్రెస్ 62.5 కేజీలు, డెడ్‌లిఫ్ట్ 135 కేజీలు మొత్తంగా 340 కేజీల బరువు ఎత్తి మొదటిస్థానంలో నిలిచారు. 'స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఆసియన్ యూనివర్శిటీస్)గా ప్రకటించారు.

పోటీలో పాల్గొంటే బంగారు పతకమే...

కేరళలోని అలప్పుజలో 2023 మే 1 నుంచి 6 వరకూ జరిగిన 'ఆసియన్ పవర్ లిఫ్టింగ్ చాంఫియన్‌షిప్‌లో మొదటిస్థానంలో నిలిచి 'స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఆసియా'గా నిలిచారు. న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో 2022 నవంబర్ 24 నుంచి డిసెంబర్ 4 వరకూ జరిగిన 'కామన్ వెల్త్ పవర్‌లిఫ్టింగ్ చాంఫియన్‌షిఫ్'లోనూ మొదటిస్థానంలో నిలిచి నాలుగు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. 'స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ కామన్‌వెల్త్'గా టైటిల్‌ను గెల్చుకున్నారు. టర్కీలోని ఇస్తాంబుల్‌లో 2022 ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 4 వరకూ జరిగిన 'వరల్డ్ పవర్‌లిఫ్టింగ్ చాంఫియన్‌షిప్'లోనూ ద్వితీయస్థానంలో నిలిచారు. ఒక గోల్డ్, రెండు సిల్వర్, రెండు బ్రాంజ్ మెడళ్లను అందుకున్నారు. 2022 జూన్ 17 నుంచి 21 వరకూ తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగిన 'ఏషియన్ పవర్‌లిఫ్టింగ్ చాంఫియన్‌షిప్'లోనూ మొదటి స్థానంలో నిలిచి నాలుగుబంగారు పతకాలను గెల్చుకున్నారు. ఇలా అనేక పోటీల్లో పాల్గొంటే చాలు... పతకం ఖాయం అన్నట్టుగా సాదియా తన ప్రతిభను ప్రదర్శిస్తున్నారు.

- యడవల్లి శ్రీనివాసరావు

దక్షిణాఫ్రికాలో ఇటీవల జరిగిన కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఆమె మువ్వన్నెల పతాకాన్ని సగర్వంగా ఎగురవేశారు. ఏకంగా నాలుగు బంగారు పతకాలను సైతం గెలుచుకుని ఔరా అని పించారు. పాల్గొన్న పోటీలన్నింటిలోనూ పతకాలను గెల్చుకుని 'స్ట్రాంగ్ గర్ల్ ఆఫ్ ఇండియా'గా ప్రపంచానికి పరిచయమయ్యారు. ఆమె షేక్ సాదియా అల్మాస్. ఇప్పటివరకూ ఆమె అంతర్జాతీయస్థాయిలో 11 పతకాలు గెల్చుకున్నారు. వాటిలో పది పతకాలు బంగారువే. తనకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తే ప్రపంచ చాంఫియన్‌గా రాణిస్తానని ఆమె ఘంటాపథంగా చెబుతున్నారు.

దేశ గౌరవాన్ని పెంచుతా ...

నేను ఈ స్థాయిలో రాణించటానికి మొదటగా కోచ్‌గా ఉన్న నా తండ్రి షేక్ సందాని, కుటుంబ సభ్యులు, స్నేహితుల ప్రోత్సాహం ఎంతో ఉంది. పవర్‌లిఫ్టింగ్ ఎపి, గుంటూరు జిల్లా అసోషియేషన్ల సహకారం మరువలేనిది. మంత్రి నారా లోకేష్, రోటరీ క్లబ్ సహాయం అందించారు. భవిష్యత్తులో దేశానికి మరిన్ని పతకాలు సాధించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తా. జూనియర్ వరల్డ్‌లో రెండుసార్లు సత్తా చాటా. సీనియర్ వరల్డ్‌లోనూ పతకాలు సాధిస్తాను.

- షేక్ సాదియా అల్మాస్

కథకే ప్రాధాన్యమిస్తారని అర్థమైంది ...

కేన్స్‌లో చరిత్ర సృష్టించిన 'ఆల్ వి ఇమాజిన్ యూజ్ లైట్' చిత్రం డిస్ట్రిబ్యూషన్ హక్కులను రానా సొంతం చేసుకున్నారు. తాజాగా, ఈ సినిమా మరో ఘనత సాధించింది. 'ఆసియా పసిఫిక్ స్క్రీన్' పురస్కారాల్లో ఐదు నామినేషన్లు దక్కించుకుంది. ఈ వేడుక నవంబర్ 30న జరగనుంది. ఈ క్రమంలో.. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రానా పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'నేను ఇండస్ట్రీలోకి వచ్చి 20 ఏళ్లు గడిచాయి. అయినప్పటికీ ప్రేక్షకులకు ఎలాంటి చిత్రాలు నచ్చుతాయో తెలుసుకోవడంలో విఫలమవుతున్నాను. కథ, భావోద్వేగాలతో నిండిన ప్రతి సినిమా ప్రత్యేకతను చాటుకుంటుందని అర్థమైంది. 2004లో వచ్చిన 'బొమ్మలాట' అనే యానిమేషన్ చిత్రానికి నిర్మాతగా వ్యవహరించాను. దానికి జాతీయ అవార్డు కూడా వచ్చింది. కానీ సినిమా రిలీజ్ కోసం థియేటర్స్ వెతుక్కోవాల్సి వచ్చింది. అయితే సినిమా బాగుంటే ప్రేక్షకులు కచ్చితంగా హిట్ చేస్తారన్న నమ్మకం నాకు ఉంది' అని మాట్లాడుతూ 'ప్రపంచంలోని ఇతర భాషల్లో ఉన్నట్లుగా ఇక్కడ చిత్ర నిర్మాతలకు గ్రాంట్లు ఉండవు' అని చెప్పారు.

'జై హనుమాన్'లో రిషబ్‌శెట్టి

తేజా సజ్జా హీరోగా ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన 'హనుమాన్'కు సీక్వెల్‌గా 'జైహనుమాన్' రానున్నట్లుగా మేకర్లు ప్రకటించారు. ఈ సినిమాలో కన్నడ హీరో రిషబ్‌శెట్టి నటిస్తున్నట్లుగా సమాచారం. చిరంజీవి, రామ్‌చరణ్ వంటి స్టార్ల పేర్లు కూడా పరిశీలిస్తున్నట్లుగా ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరైన చైతన్య తెలిపారు. ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో నిరంజన్‌రెడ్డి, చైతన్య ఈ సినిమాను నిర్మించనున్నారు. కాగా, ప్రస్తుతం 'కాంతార' ప్రీక్వెల్‌తో రిషబ్‌శెట్టి బిజీగా ఉన్నారు.

21 'మ్యాజిక్'

దర్శకుడు గౌతమ్ తిన్ననూరి కొత్త సినిమా 'మ్యాజిక్'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఈ సినిమా నిర్మితమవుతోంది. నూతన నటీనటులను ఎంపిక చేశారు. అనిరుధ్ స్వరాలు అందించనున్నారు. నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. అనిరుధ్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర నిర్మాత సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను షేర్ చేసింది. డిసెంబర్ 21న ఈ సినిమా విడుదల కానుందని ప్రకటించింది.

'యాక్షన్ చెప్పగానే నేను చనిపోవాలి'



సినీ రంగానికి చేస్తోన్న సేవలకు గాను 'లోకర్నో ఫిల్మ్ ఫెస్టివల్'లో షారుక్ ఖాన్‌కి జీవిత సాఫల్య పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఆయన ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో తన సినీ జీవితం గురించి పలు వ్యాఖ్యలు చేశారు. 'చనిపోయే వరకూ సినిమాల్లోనే ఉంటా. ఏదైనా సినిమా సెట్‌లో యాక్షన్ చెప్పగానే నేను చనిపోవాలి. వాళ్లు కట్ చెప్పాక కూడా నేను పైకి లేవకూడదు. ఇదే నా కోరిక' అని అన్నారు. ఇంకా స్టార్‌డమ్ గురించి మాట్లాడుతూ.. 'స్టార్‌డమ్‌కు నేను పెద్దగా ప్రాధాన్యం ఇవ్వను. దానిని గౌరవిస్తాను. దానివల్ల నాకు అభిమానుల ప్రేమ, ఆదరణ, గుర్తింపు, డబ్బు లభించాయి. నా కుటుంబం కూడా సంతోషంగా ఉంది. ఇప్పుడున్న రోజుల్లో ప్రజలు చాలా సున్నిత మనస్కులు అయ్యారు. మనం ఏదైనా చెబితే దానికి డిస్టర్బ్ అవుతున్నారు. కాబట్టి సెన్స్ ఆఫ్ హ్యూమర్ లేకపోవడమే మంచిది' అని తెలిపారు.

రామ్ లక్ష్మణ్ జంతు ప్రేమ

ఫైట్ మాస్టర్స్ రామ్, లక్ష్మణ్ ఇటీవల ఓ పెద్ద బండరాయి చీలిక మధ్య చిక్కుకుపోయిన తల్లి కుక్కను కాపాడి, దాని పిల్లల చెంతకు చేర్చిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మొయినాబాద్ లోని అజీజ్ నగర్‌లో ఓ సినిమా షూటింగ్ జరుగుతుండగా ఫైట్ మాస్టర్స్ రామ్, లక్ష్మణ్ బృందానికి కుక్కల ఏడుపు వినిపించింది. ఆ స్థలానికి వెళ్ళి చూడగా అక్కడ ఓ పెద్ద బండరాయి చీలిక మధ్యలో చిక్కుకుపోయిన తల్లి కుక్క ఒక వైపు, పక్కనే తల్లి పాల కోసం చూస్తున్న 10 కుక్క పిల్లలు కనిపించాయి. ఆ దృశ్యాన్ని చూసిన రామ్, లక్ష్మణ్ చలించిపోయారు. తల్లి కుక్కను కాపాడేందుకు జేసీబీని రప్పించి, దాన్ని కాపాడారు. దీనిని సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

31న 'ఆదిపర్వం' విడుదల

మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటించిన సినిమా 'ఆదిపర్వం'. ఎస్తేర్, శివ కంఠమనేని కీలకపాత్రలు పోషించారు. ఎర్రగుడి నేపథ్యంలో అల్లుకున్న పీరియాడిక్ ప్రేమకథతో గ్రాఫిక్స్ ప్రధానంగా ఈ చిత్రాన్ని దర్శకుడు సంజీవ్ మేగోటి రూపొందిస్తున్నారు. ఈనెల 31న ఈ సినిమా విడుదల కానుంది.

రోహిత్, కోహ్లి, సర్ఫరాజ్ అర్ధసెంచరీలు

- భారత్ 231/3
- న్యూజిలాండ్‌తో తొలిటెస్ట్

బెంగళూరు: తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే కుప్పకూలిన టీమిండియా.. రెండో ఇన్నింగ్స్‌లో సమిష్టిగా రాణించింది. కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, సర్ఫరాజ్ ఖాన్ అర్ధసెంచరీలతో కదం తొక్కారు. దీంతో టీమిండియా మూడోరోజు ఆట ముగిసే సమయానికి 3వికెట్ల నష్టానికి 231పరుగులు చేసింది. న్యూజిలాండ్ కంటే ఇంకా 125పరుగులు వెనుకబడి ఉంది. చిన్నస్వామి స్టేడియంలో రెండో రోజు తమను వణికించిన న్యూజిలాండ్ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ బౌండరీల వర్షం కురిపించారు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించగా తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్ అయిన సర్ఫరాజ్ ఖాన్(70నాటౌట్), విరాట్ కోహ్లీ(70) అర్ధసెంచరీలతో కదం తొక్కారు.

రోహిత్-జైస్వాల్ తొలి వికెట్‌కు 72పరుగుల భాగస్వామ్యం

మరోవైపు కెప్టెన్ రోహిత్ శర్మ(52) కూడా విధ్వంసక బ్యాటింగ్‌తో అలరించి కివీస్ బౌలర్లను ముప్పతిప్పలు పెట్టారు. సర్ఫరాజ్-విరాట్ కోహ్లి కలిసి మూడో వికెట్‌కు 136 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్(35) ఉన్నంత సేపు ధనాధన్ ఆడాడు. అయితే.. అజాజ్ పటేల్ ఓవర్లో ఫ్రంట్‌ఫుట్ వచ్చి స్టంపౌట్ అయ్యాడు. 72 వద్ద తొలి వికెట్ పడినా కెప్టెన్ రోహిత్ శర్మ(52) జోరు తగ్గించలేదు. మ్యాట్ హెన్రీ ఓవర్లో వరుసగా 4, 6, 4 బాది రోహిత్ అర్ధ శతకం సాధించాడు. ఆ తర్వాత అజాజ్ పటేల్ ఓవర్లో బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత కోహ్లి కాస్త నిదానంగా ఆడితే.. సర్ఫరాజ్ మాత్రం కివీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ఫోర్లు, సిక్సర్లతో చెలరేగాడు. ఈ జోడీ మూడో వికెట్‌కు 136 పరుగులు జోడించింది. అయితే.. మూడో రోజు గ్లెన్ ఫిలిప్స్ వేసిన ఆఖరి ఓవర్.. చివరి బంతికి కోహ్లి వికెట్ కీపర్ చేతికి చిక్కాడు. న్యూజిలాండ్ బౌలర్లు అజాజ్ పటేల్‌కు రెండు, ఫిలిప్స్‌కు ఒక వికెట్ దక్కాయి.

9వేల పరుగుల క్లబ్‌లో కోహ్లి

టీమిండియా రన్ మెషీన్, విరాట్ కోహ్లి మరో మైలురాయిని అందుకున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో 9వేల పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. చిన్నస్వామి స్టేడియంలో న్యూజిలాండ్ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ... టెస్టుల్లో 31వ అర్ధసెంచరీని 9 వేల పరుగుల మార్క్‌ను చేరుకున్నాడు. విలియం ఓర్కీ బౌలింగ్‌లో మిడాన్ దిశగా సింగిల్ తీసిన కోహ్లి 53 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఈ ఘనతకు చేరువయ్యాడు. దాంతో, ఈ ఫీట్ సాధించిన నాలుగో భారత క్రికెటర్‌గా క్రికెటర్‌గా రికార్డుల్లోకెక్కాడు. సచిన్ టెండూల్కర్(15,921), రాహుల్ ద్రావిడ్(13,265), గవాస్కర్(10,212)లు కోహ్లికంటే ముందున్నారు.

రవీంద్ర సెంచరీ

న్యూజిలాండ్ యువకెరటం రచిన్ రవీంద్ర (134) సెంచరీతో కదం తొక్కాడు. ఓవర్ నైట్ స్కోర్ 3వికెట్ల నష్టానికి 180పరుగులతో మూడోరోజు ఆటను కొనసాగించిన న్యూజిలాండ్‌ను రవీంద్ర, మాజీ సారథి టిమ్ సౌథీ(65) మెరుపు హాఫ్ సెంచరీతో భారత బౌలర్లను ఆదుకున్నారు. అంతకుముందు ఓపెనర్ డెవాన్ కాన్వే(91) సైతం అర్ధ శతకం బాదగా.. న్యూజిలాండ్ 402 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి.

ఇండియా తొలి ఇన్నింగ్స్: 46ఆలౌట్

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్‌బి)కుల్దీప్ 15, కాన్వే (బి)అశ్విన్ 91, యంగ్ (సి)కుల్దీప్ (బి)జడేజా 33, రవీంద్ర (సి)ధృవ్ జురెల్ (బి)కుల్దీప్ 134, మిఛెల్ (సి)జైస్వాల్ (బి)సిరాజ్ 18, బ్లండెల్ (సి)రాహుల్ (బి)బుమ్రా 5, ఫిలిప్స్ (బి)జడేజా 14, హెన్రీ (బి)జడేజా 8, సోథీ (సి)జడేజా (బి)సిరాజ్ 65, అజాజ్ పటేల్ (ఎల్‌బి)కుల్దీప్ 4, రూర్కే (నాటౌట్) 0, అదనం 15. (91.3ఓవర్లలో ఆలౌట్) 402పరుగులు. **వికెట్ల పతనం:** 1/67, 2/142, 3/154, 4/193, 5/204, 6/223, 7/233, 8/370, 9/384, 10/402 **బౌలింగ్:** బుమ్రా 19-7-41-1, సిరాజ్ 18-2-83-2, అశ్విన్ 16-1-94-1, కుల్దీప్ 18.3-1-99-3, జడేజా 20-1-72-3.

ఇండియా రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (స్టంప్)బ్లండెల్ (బి)అజాజ్ పటేల్ 35, రోహిత్ శర్మ (బి)అజాజ్ పటేల్ 52, కోహ్లి (సి)బ్లండెల్ (బి)ఫిలిప్స్ 70, సర్ఫరాజ్ ఖాన్ (బ్యాటింగ్) 70, అదనం 4. (49ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 231పరుగులు. **వికెట్ల పతనం:** 1/72, 2/95, 3/231 **బౌలింగ్:** సౌథీ 7-1-22-0, హెన్రీ 11-1-52-0, రూర్కే 11-1-48-0, అజాజ్ పటేల్ 12-2-70-2, ఫిలిప్స్ 8-1-36-1.

క్వార్టర్స్‌లో ఓడిన సింధు

డెన్మార్క్ ఓపెన్‌లో ముగిసిన భారత్ పోరు



ఒడెన్సే(డెన్మార్క్): డెన్మార్క్ ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ పోరాటం ముగిసింది. క్వార్టర్‌ఫైనల్‌కు చేరిన ఏకైక షట్లర్ పివి సింధు మూడుసెట్ల హోరాహోరీ పోరులో ఓటమిపాలైంది. మలేషియాకు చెందిన టంగ్‌జంగ్‌తో శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ పోటీలో పివి సింధు 13-21, 21-16, 9-21తో ఓటమిపాలైంది. తొలి గేమ్‌ను చేజార్చుకున్న సింధు.. రెండో గేమ్‌లో అద్భుతంగా పుంజుకొంది. కానీ నిర్ణయాత్మక మూడోగేమ్‌లో తేలిపోయింది. దీంతో ఓటమిపాలైంది.

రెండోటెస్ట్‌లో పాక్ గెలుపు

రెండో ఇన్నింగ్స్‌లో 144పరుగులకే కుప్పకూలిన ఇంగ్లండ్

ముల్తాన్: ముల్తాన్ వేదికగా జరిగిన రెండో టెస్టులో పాకిస్థాన్ 152పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 297పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ టజ్టు 144పరుగులకే కుప్పకూలింది. దీంతో సొంతగడ్డపై 1,348 రోజుల తర్వాత పాక్‌కు ఇది తొలి గెలుపు. తొలి టెస్టులో ఓడిన పాకిస్తాన్.. రెండో టెస్ట్‌లో ఇంగ్లండ్ బ్యాటర్లకు కళ్లెం వేసింది. స్వదేశంలో 14 వరుస పరాజయాల తర్వాత ఆ జట్టుకు దక్కిన చిరస్మరణీయ విజయమిది. స్వదేశంలో కెప్టెన్ షాన్ మసూద్‌కు కూడా ఇదే తొలి విజయం. పాకిస్థాన్ విజయంలో స్పిన్నర్లు నొమాన్ అలీ (8/46), సాజిద్ ఖాన్ (2/93) కీలక పాత్ర పోషించారు.

సాజిద్, నోమన్

రికార్డుపుటల్లో సాజిద్, నోమన్..

తొలి ఇన్నింగ్స్, రెండో ఇన్నింగ్స్‌లో మొత్తం 10 వికెట్లను వీరిద్దరూ పడగొట్టడం 52ఏళ్ల క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి. వీరిద్దరూ స్పిన్నర్లే కావడం మరో విశేషం. దీంతో వీరు రికార్డు పుటల్లో చోటు దక్కించుకున్నారు. మొత్తంగా ఈ ఘనత సాధించిన ఏడో స్పిన్నర్ల జోడీగా సాజిద్, నొమన్‌లు రికార్డుకెక్కారు. 1972లో ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా బౌలర్లు మస్సీ(16), డెనిస్ లిల్లీలు 20 వికెట్లతో చరిత్ర లిఖించారు. ఆ తర్వాత ఎవరికీ సాధ్యంకాని రికార్డును పాక్ స్పిన్ ద్వయం బద్దలు కొట్టేసింది. ఈ గెలుపుతో మూడు టెస్టుల సిరీస్‌లో ఇరుజట్లు 1-1తో సమంగా ఉన్నాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సాజిద్ ఖాన్‌కు దక్కింది.

స్కోర్లు(సంక్షిప్తంగా)... పాకిస్తాన్: 366, 221 ఇంగ్లండ్ : 281, 144

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68